తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

13-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 194 పేజీలు: 16 వెల: 6.50




**SHOWROOMS: ANDHRA PRADESH:** RENAULT **SRIKAKULAM** Ph: 8448481380. RENAULT **VIZAG** Ph: 8527240397.



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్ రెడ్డి

# ఎందుకంత జాప్యం

>> నమోదు చేసి జైలుకు పంపించేందుకు కూడా వెనుకాడవద్దని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహించిన ఇఇకి మెమో జారీ చేయాలని ఇఎన్‌సి నరసింహమూర్తిని మంత్రి ఆదేశించారు. ఇకపై పుష్కర లిఫ్ట్ స్కీం పైప్‌లైన్ పనులపై ప్రతిరోజూ వర్క్ ప్రోగ్రెస్ రిపోర్ట్ అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి తెలిపారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు పుష్కర ఎత్తిపోతల పథకం పనులు కీలకమని పేర్కొన్నారు. ఈ నెలాఖరున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు గోదావరి జలాలు వెళ్లేలా నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో, పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను, కాంట్రాక్టు ఏజెన్సీలను ఆదేశించారు.

# కీలక ముందడుగు

>> నుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపి మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వహించనుంది. ఐఐటి మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్‌ను సిద్ధం చేయనున్నారు.

**నవంబర్ నుంచి పనులు ప్రారంభం:**

ఐఐటి మద్రాస్‌తో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో, రానున్న నవంబర్‌నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు. ఈకార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శరవణన్, పాడా డైరెక్టర్ డా.ఎన్.వి. శివరామ ప్రసాద్, ఐఐటి మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్‌బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ ఎన్టీఆర్‌కు సర్జరీ

>> పారు. ఇటీవల జిమ్‌లో ఉండగా ఎన్టీఆర్ భుజానికి గాయం కాగా ప్రత్యేక వైద్య నిపుణుల బృందంతో చర్చించి ఆర్థ్రోస్కోపిక్ శస్త్రచికిత్స ప్రయోజనకరంగా ఉంటుందని నిర్ధారించామని తెలిపారు. ఈనేపథ్యంలో ఆర్థోపెడిక్ సర్జన్ల బృందం ఆర్.ఎ.పూర్ణచంద్ర తేజస్వి, డా.నితిన్ బెజ్జంకి, డా.మధుసూదన్ రావు, డా.శ్రీనివాస్ రావు సూరపనేని ఆధ్వర్యంలో ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ ఇప్పుడు వైద్య పర్యవేక్షణలో ఉంటారని రెండు నుంచి మూడు నెలల కాల వ్యవధిలో పూర్తిగా కోలుకుని, తిరిగి సాధారణ స్థితికి వస్తారని తాము ఆశిస్తున్నారని హెల్త్‌బులిటెన్‌లో పేర్కొన్నారు.

**మీ అందరి అండతో త్వరలో మీ ముందుకు వస్తా: ఎన్టీఆర్**

తన భుజానికి సర్జరీ విజయవంతం కావడంపై కిమ్స్ వైద్య బృందానికి జూనియర్ ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరి అండతో త్వరలో మీ ముందుకు వస్తా. నా క్షేమం కోరుకున్న అందరికీ కృతజ్ఞతలు అని ఎక్స్ వేదికగా జూనియర్ ఎన్టీఆర్ పోస్టు పెట్టారు.

# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ మరణించారా?

## అమెరికన్ జర్నలిస్టు ప్రత్యేక కథనం



**రావల్పిండి, ఆగస్టు 12:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. ఆయన జైల్లోనే మృతిచెంది ఉండొచ్చంటూ పాకిస్థాన్‌కు చెందిన ఓ సీనియర్ జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అయితే ఈ వాదనకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. అమెరికాలో ఉంటున్న జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు జీవించి లేరని ముగ్గురు సీనియర్ పాకిస్థాన్ సైనిక అధికారులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వాళ్లు కూడా ఈ సమాచారాన్ని స్వయంగా నిర్ధారించలేదని చెప్పారు. అనధికారిక మార్గాల్లో తమకు సమాచారం అందిందని మాత్రమే వారు చెప్పినట్లు వివరించారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనపై పలు కేసులు కొనసాగుతున్నాయి. జైల్లో ఉన్న ఆయనను కలిసేందుకు కుటుంబసభ్యులకు అనుమతి ఇవ్వడం లేదంటూ పాకిస్థాన్ తెహ్రీక్‌ఏ ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ పలుమార్లు ఆరోపించింది. ఆయనకు సరైన వైద్యం అందడం లేదని కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. ఇమ్రాన్ కుటుంబసభ్యులు, పీటీఐ నేతలు మంగళవారం మరోసారి ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వకపోతే సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ చేపడతామని పీటీఐ ప్రకటించింది. అంతకుముందే నిరసనలు చేపడతామని పీటీఐ హెచ్చరించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై అమెరికా నుంచి కూడా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. 13 మంది అమెరికా చట్టసభ సభ్యులు అక్కడి విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు లేఖ రాశారు. ఇమ్రాన్ ఆయన భార్య బుష్రా బీబీ నిర్బంధ పరిస్థితులపై ఇస్లామాబాద్‌తో మాట్లాడాలని కోరారు.

# నేరాల రూపం మారింది

>> నేరాలు, సోషల్ మీడియా అసభ్య పోస్టుల లాంటి నేరాలు పెరిగాయి. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ అని పదేపదే చెబుతున్నాను. ఈ విషయంలో కఠినంగా ఉండాల్సిందే. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షి ంచటంలో విఫలం కాకూడదు. నేర నియంత్రణకు పోలీసులూ గోల్డెన్ అవర్ విధానాన్ని పాటించాలి. తప్పు చేస్తే నేరస్తులు తప్పించుకోలేరని తెలిసేలా చేయాలి. వివేకా హత్య కేసు ఘటనలో పూర్తి సమాచారం రాలేదు. పోలీసుల వైపు నుంచి జరిగిన కాస్ట్ లీ మిస్టేక్ అది. కొందరు కావాలనే తప్పు దోవ పట్టించారు. ఇల్లంతా రక్తం మరకలతో తడిస్తే ఆ ఆధారాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. ఇది పూర్తి నిరక్ష ్యం. నేరస్తుల పట్ల ఉదాసీనంగా ఉండొద్దు. జీరో డ్రగ్స్, గంజాయి లేకుండా జాతీయ స్థాయిలో ఓ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహిళల భద్రతతో పాటు గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం డ్రగ్స్ వద్దు బ్రో అన్న ప్రచారాన్ని విస్తృతం చేయండి. రహదారి భద్రత కూడా కీలకమైన అంశం. రోడ్డు ప్రమాదాల అరికట్టేలా సైనేజీలు, రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌లను ఆడిట్ చేయాలి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించండ్షి అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ పార్టీలకు లేదు**

"శాంతిభద్రతల విషయంలో విఫలమైతే తీవ్రమైన పరిణామాలు మనం అంతా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒక్క చిన్న నిరక్ష ్యం మొత్తం పోలీసు వ్యవస్థపైనే మరక పడుతుంది. సింగయ్య వాహనం కింద పడిపోయి చనిపోతే కూడా ఎదురు ఆరోపణలు చేశారు. జగన్ కారు కింద పడిపోయినట్టుగా వీడియో వచ్చింది. కారు తొక్కేస్తే పొదల్లో పడేశారు. ప్రాణాలు కాపాడబోయిన పోలీసులపైనే నెపం పడింది. ఇబ్రహీంపట్నంలో రాజకీయ పార్టీ ర్యాలీలో రోడ్డుపై మోటారు సైకిల్ విన్యాసాలు ఏమిటి? పోలీసులపై కూడా దాడులు జరిగే పరిస్థితి ఉంది. ఏ పార్టీ అయినా రోడ్డుపై విన్యాసాలు చేసేందుకు అవకాశం లేదు. ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వెళ్లటం అన్ని పార్టీల బాధ్యత. రాజకీయ పార్టీ నేతలు కాబట్టి ఫ్రీగా వదిలేస్తామంటే శాంతిభద్రతల పరిస్థితి వస్తుంది. రాజకీయ పార్టీలకు ఇష్టానుసారం వ్యవహరించే లైసెన్సు ఇవ్వలేదు. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94శాతం మంది ఒక పార్టీ నుంచే ఉంటున్నారు. పరామర్శలకు వెళ్లటం తప్పేం కాదు. రోడ్లపై చేసే ప్రదర్శనల వల్లే ప్రజలకు ఇబ్బందులు. విశాఖపట్నంలో 3 గంటల పాటు రోడ్లను బ్లాక్ చేశారు. అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్లే వారు, ఆఫీసుకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే సిఎంగా నేను కూడా వాహన కాన్వాయ్ కుదించుకున్నాను. మానసిక పరిస్థితి సరిగాలేని కొందరు వ్యక్తులు చేసే నేరాలపై ప్రజల్లోనూ చర్చ జరగాలి. కొందరు రౌడీలే సామాజిక మాధ్యమాల్లో హీరోలుగా మారుతున్నార్షు అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**ఇక నెలవారీ పోలీసు పెర్ఫార్మెన్స్ రిపోర్టు**

"శాంతిభద్రతల విషయంలో ఏపి అత్యుత్తమ రాష్ట్రంగా ఉండాలన్నదే లక్ష ్యం. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, అసభ్య ప్రచారం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. నేర నిర్ధారణ రేటు పెరిగితే నేరాలు తగ్గుతాయి. పోలీసులు దర్యాప్తు చేసి విజయం సాధించిన కేసుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పూర్తి స్థాయిలో అమలు కావాలి. రాజకీయ పార్టీల ముసుగులో కొందరు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నారు. గతంలో మద్యం తాగించేవారు, ఇప్పుడు గంజాయి మత్తులో వీరంగం చేస్తున్నారు. కొన్ని సామాజిక మాధ్యమాల సాయంతో నేరస్తులుగా మారుతున్నారు. టెక్నాలజీ నేరస్తులను పట్టిస్తోంది, అదే సమయంలో నేరాలు పెంచుతోంది. బ్యాలెన్సింగ్, ప్రాపర్ పోలీసింగ్ ఉండాలి. పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం, సంఘ విద్రోహ శక్తులకు భయం కలగాలి. రాష్ట్ర అభివృద్ధితో పాటు శాంతిభద్రతలు కూడా కీలకం. అప్పుడే సుపరిపాలన సాధ్యం. డిజి కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్ వరకూ పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇక నుంచి ప్రతీ నెలా పోలీసు పెర్ఫార్మెన్సు రిపోర్టును విడుదల చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్, సక్సెస్ స్టోరీస్ సహా వివిధ అంశాలను ప్రజలకు వివరిద్దాం్ష అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీసు స్టేషన్ల నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సహా శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగాలకు చెందిన 1650 మంది అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సమావేశానికి హోం మంత్రి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డిజి ఎన్. మధుసూధన రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, ఈగల్ టాస్క్‌ఫోర్సు ఐజి రవికృష్ణ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## నీట్ యుజి పేపర్ లీక్ కేసు..

# సిబిఐ ఛార్జ్‌షీట్ ఓకే

- ఆ వివరాలు బయటకెలా వచ్చాయి
- ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆందోళన

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** నీట్ యుజి పేపర్ లీక్ కేసులో 13 మంది నిందితులపై సిబిఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ఢిల్లీ రైస్ అవెన్యూ కోర్టు బుధవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో దర్యాప్తు సంస్థ సమర్పించిన తుది నివేదికను ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా స్వీకరించారు. సిబిఐ ఛార్జ్‌షీట్ వివరాలు మీడియాకు వెల్లడి కావడంపై కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా మైనర్లతో సహా సాక్షుల వివరాలు బయటకు రావడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టులో వాదనలు జరగకముందే ఛార్జ్‌షీట్‌లోని అంశాలు ప్రచురితం కావడం తీవ్ర ఆందోళనకరమైన విషయమని రౌస్ అవెన్యూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా పేర్కొన్నారు. ఇటువంటి వెల్లడి చర్యలు క్రిమినల్ విచారణ ప్రక్రియ నిష్పాకతను దెబ్బతీసే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. మీడియా సహా సంబంధిత వర్గాలన్నీ, తమ కథనాల వల్ల కోర్టు విచారణ ప్రభావితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయని కోర్టు నొక్కి చెప్పింది. మైనర్లతో సహా సాక్షుల పేర్లను మీడియా కథనాలు బయటపెట్టాయని సిబిఐ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలపడంతో ఈ విషయం తెరపైకి వచ్చింది. నిందితులకు నిష్పాక్షక విచారణ పొందే హక్కుపై ఇటువంటి ప్రచారం ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటూ డిఫెన్స్ లాయర్లు కూడా ఈ కథనాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నీట్ యుజి ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో 13 మంది నిందితులపై సిబిఐ దాదాపు 20,000 పేజీల ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. దర్యాప్తు సంస్థ ప్రకారం, ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు ఢిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) కార్యాలయం నుండి పరీక్ష ప్రశ్నలను సేకరించి, వివిధ మార్గాల ద్వారా లీక్ చేశారు. అత్యంత గోప్యమైన విభాగం నుండి బయటకు వచ్చేటప్పుడు తనిఖీ విధానాలు లేకపోవడాన్ని నిందితులు తమకు అనుకూలంగా మలుచుకున్నారని కూడా ఆ సంస్థ ఆరోపించింది. కోర్టు ఛార్జ్‌షీట్‌ను స్వీకరించింది. అభియోగాల నమోదుపై వాదనలు ఆగస్టు 13 నుండి ప్రారంభమవుతాయని ఆదేశించింది. కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరుతూ సిబిఐ కూడా ఒక దరఖాస్తును దాఖలు చేసింది. తదుపరి దర్యాప్తు కోసం సిబిఐ దాఖలు చేసిన దరఖాస్తుపై నిందితుల నుంచి స్పందనలు కోరిన కోర్టు, గురువారం ఈ విషయాన్ని విచారించనుంది.

# ఇకపై నేరుగా తిరుపతికే

>> నేరుగా తిరుపతికి వచ్చి ఇక్కడి ఇమ్మిగ్రేషన్ తనిఖీల ద్వారా మన దేశంలోకి ప్రవేశించవచ్చు. ప్రధానంగా తిరుమలకు చేరుకునే వెసలుబాటు కలిగింది. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంగా రూపుదిద్దుకుంది. ఇప్పటికే 11వరకు విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. త్వరలోనే విదేశాలకు తిరుపతినుండే విమానాలు ఎగిరే రోజులు ఉన్నాయి. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో విదేశీ శ్రీవారి భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 15కి ముందే శుభవార్త చెప్పింది. కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రపంచ నలుమూలల నుండి విదేశీ భక్తులు వస్తున్నారు. వీరిసౌలభ్యం కోసం తిరుపతి రేణిగుంట విమానాశ్రయాన్ని ఇ వీసా ప్రవేశ పాయింట్‌గా గుర్తించింది. ఈ నిర్ణయంతో విదేశీ యాత్రికులు ఇకపై ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ కోసం ఇతర ప్రధాన నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా తిరుపతిలోనే ఆ ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చు. ప్రస్తుత నిర్ణయంతో ఇమ్మిగ్రేషన్ సమస్యకు పరిష్కారం లభించింది. ఇకపై విదేశీ భక్తులు నేరుగా తిరుపతి విమానాశ్రయంలోనే ఇవీసా ప్రక్రియ పూర్తి చేసుకుని, సులభంగా శ్రీవారి దర్శనానికి వచ్చే వెసలుబాటు కలిగింది. విదేశీ పౌరులు భారతదేశ పర్యటన కోసం ఆన్‌లైన్‌లో పొందే వీసానే ఇవీసా అంటారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకుని, ఫీజు చెల్లించి సేవలు అందుకుంటారు. ఇప్పటికీ తిరుపతి విమానాశ్రయానికి రెగ్యులర్ అంతర్జాతీయ విమాన సర్వీసులు లేనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ముందుగానే ఇ వీసా ఎంట్రీ పాయింట్‌ను మంజూరు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. భవిష్యత్తులో తిరుపతి నుండి అంతర్జాతీయ సర్వీసులను ప్రారంభించేందుకు మార్గం సుగమం చేస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తిరుపతిలో రన్‌వేను 2,286 మీటర్ల నుండి 3,819 మీటర్లకు విస్తరించారు. 2024 డిసెంబర్‌లో సింగపూర్ నుండి ఓ చార్టర్డ్ విమానం తిరుపతిలో ల్యాండ్ అవ్వడం కూడా ఈ దిశగా పడిన తొలి అడుగుగా భావిస్తున్నారు.ఈ నిర్ణయంతో తిరుపతి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అంతర్జాతీయంగా మరింత గుర్తింపు పొందింది. తిరుపతి విమానాశ్రయానికి శ్రీవేంకటేశ్వరస్వామి పేరు కూడా సార్థకం కానుంది.

# డియర్ యంగ్ ఫ్రెండ్స్

>> అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ "ప్రియమైన యువ మిత్రులారా, మీరే మా శక్తి. మీరే మా బలం. రేపటి ఆశ, వాగ్దానం మీర్షే అని పేర్కొన్నారు. ప్రతి యువతీ యువకుడు తమకు నచ్చిన మార్గాన్ని ఎంచుకుని, ఆశించిన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, అవకాశాలు కల్పించే భవిష్యత్తును నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష ్యమని పునరుద్ఘాటించారు. యువత కలలు కనడమే కాకుండా, వాటిని సాకారం చేసుకునేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. "మేము ఈ రోజు చేస్తున్న ప్రతి పని అంతిమంగా మీకు మెరుగైన రేపటిని అందించడం కోసమే. విస్తృత అవకాశాలు, కలలు కనే స్వేచ్ఛ, వాటిని నిజం చేసుకునేందుకు అవసరమైన మద్దతుతో కూడిన భవిష్యత్తును అందించడమే మా ధ్యేయమ్షి అని చంద్రబాబు వివరించారు. ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత కూడా భాగస్వాములు కావాలని, అందరం కలిసికట్టుగా నవ సమాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. యువతకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తనతో కలిసి రావాలని ఆహ్వానించారు.

## వారం - వర్జ్యం

13-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
తి.పాడ్యమి రా.8.46
న1.ఆశ్లేష ఉ.6.06, న2.మఖ తె.4.39
వ.1. ఉ.6.20-ఉ.9.18
వ.2. రా.9.19-రా.12.21
దు.1. ఉ.10.04-ఉ.10.55
దు.2. మ.3.10-సా.5.01
రాహు మ.1.30-మ.3.00 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** క్రీడలయందు ఆసక్తి కలిగి ఉంటారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది.

**వృషభం :** సంఘంలో గుర్తింపు కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుంటారు. ప్రయాణాలు. మిత్రుల కలయికతో విందు, వినోదాలు.

**మిథునం :** గృహనిర్మాణం ఆలోచనలు కొనసాగిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి.

**కర్కాటకం :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మొండి బాకీలు వసూలవుతాయి. స్వల్ప ధనలాభం పొందుతారు.

**సింహం :** అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వస్త్ర లాభం.

**కన్య :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**తుల :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. ప్రయాణాలు.

**వృశ్చికం :** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సకాలంలో ఋణాలు తీరుతాయి. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం :** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి.

**కుంభం :** చేపట్టిన పనులు సవ్యంగా పూర్తి చేస్తారు. నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం :** కొన్ని విషయాలలో పట్టిందల్లా బంగారంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం కురిసిన భారీ వర్షాలకు కాశ్మీర్ లోయలోని అవంతిపోరా గురుద్వారా జాతీయ రహదారి జలమయమయిన దృశ్యం

# ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి

>> చర్చించి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీ కంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదు' అని పేర్కొన్నారు. బుధవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ, ఐదేళ్లలో డిఎస్సీ చేయని వారు ఇప్పుడు మెగా డిఎస్సీపై వైసిపి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. డిఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని, నియామకాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధిత అధికారులు ఆధారాలతో వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, సిబిఐ విచారణ జరపాలని వైసిపి పదేపదే డిమాండ్ చేయడం రాజకీయ ప్రయోజనాల కోసం యువతలో అనుమానాలు సృష్టించే ప్రయత్నమేనన్నారు. 'ఐదేళ్ల అధికారంలో ఉండి ఒక్క డిఎస్సీని కూడా పూర్తి చేయలేని వారు... ఇప్పుడు ఉద్యోగాలు పొందిన తర్వాత అక్రమాలు జరిగాయని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. మీ వద్ద ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని హోంమంత్రి అనిత పునరుద్ఘాటించారు.

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై స్పందిస్తూ, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు శాసనసభలో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే బాధ్యత ఉందన్నారు. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు అదే మండలికి తమ పార్టీ ప్రతినిధులను పంపుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు ప్రజలు ఎన్నుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడం సమంజసం కాదన్నారు. 'ఎమ్మెల్యేగా గెలవడం ఎంత గొప్ప బాధ్యతో, నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. జగన్‌తో పాటు గెలిచిన వైసిపి ఎమ్మెల్యేలకు కూడా సభలో ప్రజల తరఫున మాట్లాడే అవకాశం ఉండాలి' అని అన్నారు.

**ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని అవమానించొద్దు:**

మెగా డిఎస్సీ నియామకాలన్నీ అక్రమమంటూ ఆరోపణలు చేయడం ద్వారా ప్రభుత్వం మీదనే కాకుండా, కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభపై కూడా అనుమానాలు కలిగిస్తున్నారని హోంమంత్రి పేర్కొన్నారు. ఐదేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ, కుటుంబాలకు దూరంగా ఉండి కోచింగ్ తీసుకుని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఎంతోమంది అభ్యర్థులు కష్టపడి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. 'ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన యువత ఇప్పుడు తమ భవిష్యత్తుపై భరోసాతో ముందుకు వెళ్తున్నారు. మొత్తం డిఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే వారి కష్టాన్ని, ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించినట్లే కాదా? రాజకీయాల కోసం యువత మనోభావాలతో ఆడుకోవద్దు' అని హితవు పలికారు. 'నిందలు వేయడం, అలజడి సృష్టించడం కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా చర్చించాలి. ప్రజలకు వాస్తవాలు తెలుసు. ప్రభుత్వం ప్రతి అంశంపై సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉంది' అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

# ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

>> చేశారు. సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అయ్యింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటి ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపిబి ఆమోదాన్ని తెలియచేసింది. తద్వారా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటి వరకూ జరిగిన 20 ఎస్ఐపిబి సమావేశాల ద్వారా 363 ప్రతిపాదనల ద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడు లకు ఆమోదం దక్కింది. ఈ పెట్టుబడుల ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. గ్రీన్ అమ్మోనియాతో పాటు లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాల్లో పెట్టుబడులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ రంగంలో పరిశ్రమల్ని ప్రోత్సహించేలా ఏం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని సిఎం సూచించారు. కొందరు పనిగట్టుకుని కాలుష్యకారకాలంటూ దుష్ప్రచారం చేస్తున్నారని అసత్యాలను నమ్మించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు.

ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నిటికీ 3.5 టిఎంసిల నీరు సరిపోతుందని అన్నారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సిఎం సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు రాజకీయ నిరుద్యోగులు సామాజిక మాధ్యమాల ద్వారా ఫేక్ ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపై విశాఖలోని పరిశ్రమలకు పుష్కలంగా నీటిని తీసుకెళ్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వస్తున్న పరిశ్రమల ద్వారా రాష్ట్రంలోని ఎకోసిస్టమ్‌కు ఎంత విలువ జోడిస్తున్నామన్న అంశాన్ని విశ్లేషించాలని సిఎం సూచించారు. ఎపికి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఆతిథ్య రంగంలో వస్తున్న హోటల్ భవనాలు ప్రత్యేక నిర్మాణాలుగా ఉండేట్టు చూడాలని అన్నారు.

**సెప్టెంబరు నాటికి అందుబాటులోకి 175 ఎంఎస్ఎంఇ పార్కులు**

రాష్ట్రంలో ఏర్పాటవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులన్నీ జాతికి గర్వకారణమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్సు, హిందుపూర్ సమీపంలో ఏరో స్పేస్ ప్రాజెక్టులు రావాలని సిఎం నిర్దేశించారు. మూలపేట పోర్టు డిసెంబరులో ప్రారంభించేలా నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్రంలో లాజిస్టిక్స్, ఆధునిక వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ ప్రాజెక్టులను అనుసంధానించాలని అన్నారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు వెళ్లేలా రోడ్ రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండాలన్నారు. గత యేడాది నుంచి కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలు, ఎస్ఐపిబిలో అనుమతి పొందిన ప్రాజెక్టులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ యేడాది సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఇ పార్కులను కూడా పూర్తి చేసి 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు అందుబాటులోకి రావాలన్నారు. వన్ ఫ్యామిలీ వన్‌ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా పెద్ద ఎత్తున చేపట్టాలని సిఎం నిర్దేశించారు.

**20వ ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు**

1. ఓకెయిర్ గ్రీన్ ఫ్యూయెల్స్ కర్నూలు జిల్లాలో రూ.616 కోట్ల పెట్టుబడి, 130 మందికి ఉద్యోగాలు2. జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్ కర్నూలు జిల్లాలో రూ.1533 కోట్ల పెట్టుబడి, 250 మందికి ఉద్యోగాలు3. ఎఫ్‌పిఇఎల్ రవ్వేద పవర్, విజయనగరం జిల్లాలో రూ.480 కోట్ల పెట్టుబడి, 275 మందికి ఉద్యోగాలు4. వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, కాకినాడ జిల్లాలో రూ.15000 కోట్ల పెట్టుబడి, 1500 మందికి ఉద్యోగాలు5. ఆరాధ్యా బయోగ్యాస్ , కర్నూలు జిల్లాలో రూ.143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు6. ఉషోదయా బయోగ్యాస్, నెల్లూరు జిల్లా, రూ.143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు7. డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా, విశాఖపట్నం, రూ.58,743 కోట్లు, 1250 మందికి ఉద్యోగాలు8. మునోథ్ లిథియం బ్యాటరీ లిమిటెడ్, తిరుపతి జిల్లాలో రూ.500 కోట్ల పెట్టుబడి, 240 మందికి ఉద్యోగాలు9. ఎఐఎల్ డిక్సన్ ఇండియా లిమిటెడ్, కడప జిల్లా కొప్పర్తి క్లస్టర్‌లో, రూ.450 కోట్ల పెట్టుబడి, 7000 మందికి ఉద్యోగాలు 10. రెన్యూ ఏపి గ్రీన్ డేటా సెంటర్, అనకాపల్లి జిల్లా, రూ.85,200 కోట్ల పెట్టుబడి, 1880 మందికి ఉద్యోగాలు11. ఎఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్, విశాఖ జిల్లా, రూ.31,387 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు12. సిఆర్ఆర్ హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పి, తిరుపతి జిల్లాలో రూ.192.02 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు13. ఆర్కే 2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తిరుపతి జిల్లాలో రూ.150 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు14. సన్ రైజ్ హోటల్స్ ఇండియా లిమిటెడ్, కాకినాడ జిల్లాలో రూ.54 కోట్ల పెట్టుబడి, 75 మందికి ఉద్యోగాలు15. జెఎస్పీ హోటల్స్, రిసార్ట్స్ ఎల్ఎల్‌పి, కృష్ణా జిల్లాలో రూ.63.79 కోట్ల పెట్టుబడి, 100 మందికి ఉద్యోగాలు

16. పావులూరి హోటల్స్, తిరుపతి జిల్లా, రూ.58.74 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు17. అగస్త్యా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ.7799.96 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు18. అక్షత్ గ్రీన్ టెక్ లిమిటెడ్, విశాఖపట్నం జిల్లా రూ.1600 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉద్యోగాలు19. కోరమాండల్ ఇంటర్నేషనల్, శ్రీకాకుళం జిల్లా, మూలపేట, రూ.2125 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు20. హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్, చిత్తూరు జిల్లా కుప్పంలో రూ.880 కోట్ల పెట్టుబడి, 447 మందికి ఉద్యోగాలు21. ఎస్ట్రేలా లాజిస్టిక్స్, విశాఖపట్నం జిల్లాలో రూ.90 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు 22. గణేష్ సాయి మోనిష స్టీల్ వైర్స్, విజయనగరం జిల్లాలో రూ.66 కోట్ల పెట్టుబడి, 120 మందికి ఉద్యోగాలు23. విపిఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెల్లూరు జిల్లా, మనుబోలు, రూ.500 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు (ప్రైవేట్ పార్క్)24. జయాదిత్యా ఆగ్రో లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ.300 కోట్లు పెట్టుబడి, 350 మందికి ఉద్యోగాలు25. ప్రిసోల్ ఆగ్రో ఇండస్ట్రీస్, నెల్లూరు జిల్లాలో, రూ.330.71 కోట్ల పెట్టుబడి, 1110 మందికి ఉద్యోగాలు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
13-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 194 పేజీలు: 16 వెల: 6.50

జలశక్తి కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అర్చనావర్మ

ఒమన్ తీరంలో నౌకపై హౌతీల దాడి 4లో

## స్టైపెండ్ పెంచాల్సిందే!

### కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల ఆందోళన

### ప్రభుత్వంతో ఫలించని చర్చలు



**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తమ స్టైపెండ్‌ను 30శాతం వరకు పెంచాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరసన రెండో రోజుకు చేరుకుంది. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో కనీసం 15శాతమైనా పెంచాలని జూడాలు విజ్ఞప్తి చేసినప్పటికీ అటు ప్రభుత్వం నుంచి మాత్రం సానుకూల స్పందన రావడంలేదు. దీంతో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని జూనియర్ డాక్టర్లు హెచ్చరిస్తు న్నారు. ఇదిలా ఉండగా హెల్త్ సెక్రటరీతో జూడాల ప్రతినిధులు జరిపిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బుధవారం విజయవాడతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 18 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో నిరసన కార్యక్రమాలను జూనియర్ డాక్టర్లు మరింత ఉధృతం చేశారు. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్న రీతిలోనే తమకు కూడా గౌరవప్రదమైన స్టైపెండ్ అందించాలని జూనియర్ డాక్టర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సమానమైన సేవలు అందిస్తున్నప్పుడు ఎపిలో తక్కువ స్టైపెండ్ ఇవ్వడం ఎంతవరకు సమంజస మని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జూనియర్ డాక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారు. అత్యవసర సేవలు, ఐసియు సేవలకి ఎలాంటి అంతరాయం కలగకుండా రోగులకు ఇబ్బంది లేకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వచ్ఛందంగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే జోక్యం చేసుకుని స్టైపెండ్ పెంపుపై స్పష్టమైన, సానుకూల ప్రకటన చేయాలని జూనియర్ డాక్టర్లు కోరుతున్నారు.

# నేరాల రూపం మారింది

## పోలీసింగ్ మారాలి

### క్రైమ్ దర్యాప్తులో గోల్డెన్ అవర్ కీలకం

### ఎపిపోలీస్ కీర్తి దేశమంతా మార్మోగాలి

### పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం

### ప్రతి నెలా పోలీస్ పెర్ఫార్మెన్స్ రిపోర్టు

### పరామర్శల పేరుతో రోడ్లపై విన్యాసాలతోనే ఇబ్బందులు

### రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే కఠినంగా ఉండండి

### రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ పోలీసు అధికారులతో సిఎం చంద్రబాబు



బుధవారం సచివాలయంలో డిజిపి, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల రూపం కూడా మారిపోయిందని, దీనికి అనుగుణంగానే పోలీసింగ్ మారాల్సిన అవసరం ఉందని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో తక్షణం ఆధారాలు కోల్పో కుండా చూడాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేర నియంత్రణలో గోల్డెన్ అవర్ అత్యంత కీలకమని ఆయన అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి డిజిపి నుంచి క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సిఎం సమావేశం నిర్వ హించారు. డిజిపి సహా రేంజ్ ఐజిలు, డిఐజిలు, డిఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సిఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. ఎపి పోలీసుల కీర్తి దేశమంతా మార్మోగాలని దానికి అనుగుణంగా సిద్ధం కావాలని అన్నారు. నేరాల దర్యాప్తులో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పెరగాలని సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ "డిజిపి నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకూ సమావేశం నిర్వహించటం ఇదే తొలిసారి. శాంతిభద్రతల విషయంలో లోటు పాట్లను సవరించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రానికి పెట్టు బడులు రావాలన్నా శాంతిభద్రతలు ముఖ్యం. రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసువిభాగం ఒక్షైడ్. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా అంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీసు, విజిబుల్ పోలీసింగ్ విధానం అమలు చేయాలి. గడచిన రెండేళ్లుగా కాగ్నిజబుల్ క్రైమ్స్ 14 శాతం మేర తగ్గాయి. కాలానుగుణంగా నేరాలు కూడా మారుతున్నాయి. డిజిటల్ క్రైమ్, డిజిటల్ అరెస్టులు తదితర నేరాలు కొత్త సవాళ్లుగా మారుతున్నాయి. దీనికి అనుగుణంగా సాంకేతిక తను పోలీసులు అందిపుచ్చుకోవాల్సి అని దిశా నిర్దేశం చేశారు

**పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం**

"2019-24 మధ్య ఉన్న పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని ప్రధాన సమస్యగా తయారు చేశారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. గౌరవం పెరిగేలా చర్యలు చేపడతాం. రాష్ట్రవ్యాప్తంగా 14,770 సిసి కెమెరాలతో పాటు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న కెమెరాలను కలిపి 1 లక్ష కెమెరాలను అనుసంధానించాం. నేరాల దర్యాప్తులో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, డిఎన్ఏ డిటెక్షన్ లాంటి ఆధునిక విధానాలు పెరిగాయి. వేగంగా నేరాలను గుర్తించగలుగుతున్నాం. టెక్నాలజీ, నాలెడ్జి, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను పోలీసుఅధికారులు సమర్థంగా అమలు చేస్తే శాంతిభద్రతలు నియంత్రణలోకి వస్తాయి. రాజకీయ నేరాలు, డిజిటల్ >>2



## సభలో సుదీర్ఘ చర్చకు సిద్ధమే 4లో

### స్పీకర్ ఓంబిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేఖ

### విపక్షాలకు తగిన సమాధానమిస్తామని వెల్లడి



## షార్ట్‌కట్‌లు నేర్చుకుంటే జీవితం షార్ట్ అవుతుంది

### మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణలో ప్రధానిమోడీ 4లో

## ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

- డిసెంబర్ నుంచి వేసేలా చర్యలకు శ్రీకారం
- పల్లెలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులు
- గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాలపై దృష్టి
- రూ.2,08,406 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబిలో ఆమోదం
- వివిధ ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ఉద్యోగాల కల్పన
- సిఎం చంద్రబాబు అధ్యక్షతన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ యేడాది డిసెంబరు నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఎస్క్రో ఖాతాలను అనుసంధానించాలని సిఎం సూచించారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇన్సెంటివ్‌లు తప్పనిసరి అయినా ఎంత వరకూ ఆ ప్రోత్సాహకాలను ఇవ్వగలమన్న అంశంపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం >>2

## డియర్ యంగ్ ఫ్రెండ్స్

- యువత కలలు సాకారం చేసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ, అవకాశాలు కల్పిస్తాం
- మెరుగైన భవిష్యత్ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: సిఎం సందేశం
- ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపు
- అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు "డియర్ యంగ్ ఫ్రెండ్స్" అంటూ రాష్ట్ర యువతకు శుభా కాంక్షలు తెలిపారు. యువతే మన శక్తి, బలంఅని, రేపటి భవిష్యత్తుకు వారే ఆశాకిరణాలని ఆయన అభివర్ణించారు. యువత ఆశయాలకు అనుగుణంగా, వారికి బంగారు భవిష్యత్తును >>2





## విదేశీ భక్తులు ఇకపై నేరుగా తిరుపతికే

### శ్రీవారి భక్తులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు

### తిరుపతి విమానాశ్రయానికి ఇ-వీసా ఎంట్రీ పాయింట్‌గా గుర్తింపు

### త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమయ్యే సూచనలు

**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశం నలుమూలల నుండేగాక విదే శాల నుండి ప్రతిరోజూ భక్తులు తరలివస్తున్నారు. విదేశాల నుండి వచ్చే భక్తులకు ఇదివరకు తిరుపతి విమానాశ్రయంలో ఇ వీసా తనిఖీ ప్రవేశించే కేంద్రం లేదు. దీనివల్ల విదేశీ భక్తులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విమానాశ్రయాల నుండి తిరుపతికి రావలసి ఉండేది. దీనివల్ల యాత్రికులకు సమయం వృథానేగాక డబ్బు కూడా అద నంగా భారమవుతుంది. ఈ కష్టాలతో చాలామంది విదేశీ హిందూ భక్తులు నేరుగా తిరుపతి విమానాశ్రయం చేరుకునే వీలులేకపో యింది. ఇప్పుడు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సిఎం చంద్రబాబు నాయుడుకు విదేశాల్లోని హిందూ భక్తుల నుండి వచ్చిన విజ్ఞప్తులతో కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈసమస్య తీసుకెళ్లారు. కేంద్ర విమానా యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తిరుమల భక్తుల పట్ల సానుకూలంగా స్పందించడంతో విదేశీ భక్తులు >>2

## ఎందుకంత జాప్యం



### షెడ్యూల్ ప్రకారం పుష్కర లిఫ్ట్ పూర్తి చేయాల్సిందే

### అధికారులకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం

### పైప్‌లైన్ పనుల ఆలస్యంపై ఏజెన్సీ ప్రతినిధులపై ఆగ్రహం

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనుల పురోగతిపై బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షలో పోలవరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహా మూర్తి, ఇఇలు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవల పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు వర్క్ షెడ్యూల్ అందజేశారని మంత్రి తెలిపారు. ఆ షెడ్యూల్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అన్నదానిపై ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించి మంత్రికి నివేదిక అందించారు. వర్క్ షెడ్యూల్ ఇచ్చి కూడా పనుల్లో వేగం పెంచకపోవడం ఏమిటని మంత్రి అధికారులను ప్రశ్నించారు. ప్రజాప్రయోజనాలకు సంబంధించిన అత్యంత కీలకమైన పనుల్లో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టు ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజాప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు >>2

## ఉప్పాడ తీర రక్షణకు కీలక ముందడుగు



బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఐఐటి మద్రాస్ ప్రతినిధులతో డి.సిఎం పవన్ సమక్షంలో ఎంఒయు కుదరిన దృశ్యం

### డి. సిఎం పవన్ సమక్షంలో ఐఐటి మద్రాస్‌తో ఒప్పందం

### రక్షణ గోడ డిజైన్, డిపిఆర్, పర్యవేక్షణ బాధ్యతలు వారిదే

### రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణం, నవంబర్ నుంచి పనులకు శ్రీకారం

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బతింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పడింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం లోని ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ మద్రాస్‌కు అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యా లయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రూ.323 కోట్లతో ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కానుంది. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్‌డిఎమ్ఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్‌డిఎమ్ఎ) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించ >>2

## టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ రాజీనామా 4లో



## జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి

- ఆధారాలతో చర్చకు మేం సిద్ధం
- డిఎస్పీపై ఆరోపణలు విడ్డూరం
- హోంమంత్రి అనిత

**మంగళగిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంపై వైసిపి చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. 'రోడ్లపై ఆరోపణలు చేయడంకాదు. జగన్‌మోహన్ రెడ్డికి ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి. వారివద్ద ఉన్న ఆధారాలను సభముందు ఉంచాలి. ప్రతి అంశంపై >>2

## జూనియర్ ఎన్టీఆర్‌కు సర్జరీ



### భుజానికి శస్త్ర చికిత్స విజయవంతమైంది

### కోలుకోవడానికి 2-3 నెలల సమయం

### హెల్త్ బులెటెన్ విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స విజయవంతం అయ్యింది. ఈమేరకు బుధవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలోసర్జరీ నిర్వహిం చినట్లు వైద్యులు తెలిపారు. సర్జరీఅనంతరం ఎన్టీఆర్ వైద్యుల పర్య వేక్షణలో ఉన్నారని ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలి >>2

# సభలో సుదీర్ఘ చర్చకు సిద్ధమే

## స్పీకర్ ఓంబిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేఖ

### విపక్షాలకు తగిన సమాధానమిస్తామని వెల్లడి





**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** నీట్ పరీక్ష వ్యవహారం పార్లమెంట్ ఉభయ సభలను కుదిపేస్తోంది. పేపర్ లీక్‌పై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా లేఖ రాశారు. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు సిద్ధమని చర్చకు ఎంత సమయం కావాలంటే అంత సమయం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలో తాను స్వయంగా పాల్గొని ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం ఇస్తానని తెలిపారు. చర్చకు ఎన్ని గంటలు లేదా ఎన్ని రోజులు సమయం కేటాయించాలనే విషయాన్ని ప్రతిపక్షంతో సంప్రదించి పరస్పర అంగీకారంతో నిర్ణయించాలని స్పీకర్‌ను కోరారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రభుత్వ తరఫున నీట్ అంశంపై చర్చకు అంగీకరించిన విషయాన్ని బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ప్రస్తావించినట్లు అమిత్ షా తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోపబ్లిక్ ఎగ్జామినేషన్స్ ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్‌మీన్స్ 2026ను ఇప్పటికే చర్చకు తీసుకున్నామని గుర్తుచేశారు. ఆ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఎవరూ నీట్ పరీక్ష అంశాన్ని లేవనెత్తలేదని తెలిపారు. అయినప్పటికీ ఈ అంశంపై మరోసారి చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పార్లమెంట్ వెలుపల బుధవారం మీడియాతో మాట్లాడిన అమిత్ షా ఏ అంశంపైనైనా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే ప్రతిపక్షం సభ కార్యకలాపాలను అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వం దాచాల్సిందేమీ లేదని, పార్లమెంట్‌లో ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పార్లమెంట్‌లో చర్చకు కొన్ని నిబంధనలు ఉంటాయని, కేవలం ప్రకటన చేసి వెళ్లిపోవడం ద్వారా చర్చ జరగదని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు, అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా నీట్ అంశంపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. దేశ ప్రజల ముందు అన్ని విషయాలు స్పష్టమయ్యేలా ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానని చెప్పారు. పార్లమెంట్‌కు తాను దూరంగా ఉంటున్నానన్న ఆరోపణలను కూడా ఖండించారు. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తాను క్రమం తప్పకుండా సభకు హాజరవుతున్నానని, సభలో గందరగోళం కారణంగా చర్చల్లో పాల్గొనే అవకాశం రాలేదని తెలిపారు. నీట్ విద్యార్థుల ఆందోళనలపై సమగ్ర చర్చకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఇప్పుడు చర్చకు సమయాన్ని నిర్ణయించడమే మిగిలిందని పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీ కౌంటర్**

మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. అమిత్ షా నుంచి ఎలాంటి ఉపన్యాసం వినేందుకు తాము ఆసక్తిగా లేమని అన్నారు. విద్యార్థుల నిరసనల సమయంలో పెల్లెట్ గన్స్ వినియోగించిన అంశాన్ని ప్రస్తావించారు.

వాటిని ప్రయోగించేందుకు అనుమతి ఎవరు ఇచ్చారో అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ వినియోగానికి ఆదేశాలు స్వయంగా అమిత్ షా ఇచ్చి ఉంటే ఆయన రాజీనామా చేయాలని, ఒకవేళ తాను ఆదేశించలేదంటే హోంమంత్రిగా అసమర్థతకు బాధ్యత వహించి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అమిత్ షా తన హాజరు గురించి మాట్లాడటంపైనా రాహుల్ స్పందించారు. బుధవారం ఆయన సభకు వచ్చారా లేదా అన్నది తమకు ప్రధాన అంశం కాదని, గత 20 రోజులుగా ఆయన సభకు ఎందుకు దూరంగా ఉన్నారన్నదే తమ ప్రశ్న అని అన్నారు.





## మోడీజీ! మీరు కొంచెం మారారు..

### మోడీ, ఖర్గేలమధ్య సరదా సంభాషణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే కుమార్తె వివాహ విందుకు పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే వంటి వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేతలు తమ రాజకీయ విభేదాలను పక్కన పెట్టి సరదాగా కాసేపు మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోడీ, ప్రియాంకాగాంధీ, ఖర్గేల మధ్య సరదా సంభాషణ జరిగింది. ప్రధాని మోడీ ప్రియాంకా గాంధీ గారు మీరు ఎలా ఉన్నారు.? అని ప్రశ్నించారు. దీనికి బదులుగా ప్రియాంకాగాంధీ నేను బాగున్నాను సార్, మీరు ఎలా ఉన్నారు? అని అడిగారు. దీనికి మోడీ స్పందిస్తూ నేను అంతే అంటూ బదులిచ్చారు. ఇదే సమయంలో ఖర్గే చర్చలోకి చేరి ప్రధాని మోడీతో సోదరా మీరు కొంచెం మారారుఅని అన్నారు. దీనికి ప్రధాని మోడీ స్పందిస్తూ అచ్చా అని అన్నారు. దీంతో అక్కడ ఉన్న నేతల మధ్య నవ్వులు విరబూశాయి. దీని తర్వాత ప్రధాని మోడీ అందరికి చేతులు జోడించి అభివాదం చేసి అక్కడి నుంచి వెళ్లారు. ఈ సమయంలో రాహుల్ గాంధీ కూడా అక్కడే ఉన్నారు. మోడీ, ఖర్గే మధ్య జరిగిన సంభాషణను విని రాహుల్ కూడా చిరునవ్వుతో కనిపించారు. ఖర్గే చేసిన మీరు మారిపోయారు అనే వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా డీకోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏ సందర్భానుసారం ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారా అని ఆలోచిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో విద్యార్థుల నిరసన నేపథ్యంలో జెన్‌జీ యువతను ఆకట్టుకోవడానికి మోడీ సెల్ఫీ తరహా ఇన్‌స్టాగ్రామ్ వీడియోలుచేశారు. ఈధోరణిపై ఖర్గే అన్నారని భావిస్తున్నారు. మరోవైపు, ఈ కార్యక్రమంలో ఎన్సీపీ ఎస్పీ నేత శరద్ పవార్‌తో మోడీ మాట్లాడుతూ కనిపించారు. ఎన్సీపీ ఎస్పీకి చెందిన ఎంపీలు ఎన్డీయే కూటమిలో చేరుతారనే వార్తలు వినిపించిన నేపథ్యంలో ఈ కలయిక ఆసక్తికరంగా మారింది.



## ఒమన్ తీరంలో నౌకపై హౌతీల దాడి

### యుద్ధంలోకి హౌతీల ఎంట్రీ

**సనా, ఆగస్టు 12:** ఇరాన్‌అమెరికా యుద్ధం మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ఇప్పుడీ యుద్ధంలోకి హౌతీలు కూడా చొరబడ్డారు. తాజాగా గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో ఒక నౌకపై హౌతీలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆరుగురు మరణించినట్లు యెమెన్ వెల్లడించింది. యెమెన్‌లోని ఉగ్రవాద సంస్థ హౌతీస్. ఈ సంస్థకు ఇరాన్ అండగా ఉంటుంది. అందుకే తాజా యుద్ధంలో ఇరాన్ తరఫున ఈ ఉగ్రవాదులుకూడా పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా తాము మూడు మిస్సైల్స్ ప్రయోగించినట్లు యెమెన్ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ వివరాల ప్రకారం గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో, ఎర్ర సముద్రం వద్ద ఈజిప్టుకు చెందిన తిహామా అనే నౌకపై హౌతీలు మిస్సైల్ దాడి చేశారు. ఈ ఘటనలో నౌకలోని నలుగురు మరణించారు. వీరిలో ముగ్గురు పాకిస్తానీలు, ఒక ఇండోనేసియన్ ఉన్నారు. ఆ తర్వాత ఈ నౌకలోని వారిని రక్షించేందుకు మరో రెస్క్యూ నౌక వచ్చింది. ఆ నౌకపై కూడా హౌతీలు దాడి చేశారు. ఈ ఘటనలో మరో రెస్క్యూవరు మరణించారు. హౌతీస్ జరిపిన దాడిలో ఇలా ఆరుగురు మరణించారు. ఆయుధాలతో వెళ్తున్న సౌదీ మిలిటరీ నౌకపై కూడా బాబ్ ఎల్‌మాండెబ్ వద్ద దాడి చేశామని హౌతీస్ సంస్థ ప్రకటించింది. ఈ దాడిపై సౌదీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు అమెరికా కూడా ఒక కార్గో నౌకపై దాడి చేసింది. పనామాకు చెందిన ఒక కార్గో నౌకకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ స్పందించలేదని, దీంతో అమెరికన్ నేవీకి చెందిన ఎంహెచ్60 హెలికాప్టర్ నుంచి రెండు మిస్సైల్స్ ప్రయోగించామని అమెరికా తెలిపింది. ఈ నౌక ఇరాన్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఈ దాడి చేశామని పేర్కొంది. ఇరాన్ పోర్టులకు ఎలాంటి నౌకలు వెళ్లకుండా జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలపై నిషేధం ఉన్నప్పటికీ పనామా నౌక వెళ్లేందుకు ప్రయత్నించడంతో దాడి చేశామని తెలిపింది.

## ప్రైవేటు ఆసుపత్రుల గదుల అద్దెలకు పరిమితి ఉండాలి

### పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** దేశంలోని మెట్రో నగరాల లో ప్రైవేటు ఆసుపత్రులు వసూలు చేస్తున్న గది అద్దెలకు పరిమితి విధించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. ఆయా ఆసుపత్రుల సమీపంలోని 3స్టార్ హోటళ్ల సగటు అద్దె కంటే ఈ ఛార్జీలు అధికంగా ఉండకూడదని స్పష్టంచేసింది. పెరుగుతున్న వైద్య ఖర్చులను అదుపులోకి తీసుకువచ్చి రోగులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కమిటీ ఈ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం తన 176వ నివేదికలో ఈ సిఫార్సులను పొందుపరిచింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల అందుబాటు, స్తోమత పేరిట రూపొందించిన ఈ నివేదికను ఈనెల 7న పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపెట్టారు. ఆసుపత్రుల్లోని మౌలిక సదుపాయాలు, సేవలను బట్టి గది అద్దెల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, తక్షణమే వీటిని హేతుబద్ధీకరించాలని కమిటీ సూచించింది. ఈనిబంధన కేవలం ప్రాథమిక గదిఅద్దెకేవర్తిస్తుందని, రెసిడెంట్‌డాక్టర్, నర్సింగ్, భోజనం ఖర్చులను ఆసుపత్రులు అదనంగా వసూలు చేసుకోవచ్చని స్పష్టంచేసింది. జాతీయ నమూనా సర్వే (2025) గణాంకాలను కమిటీ ఈ సందర్భంగా ఉటంకించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సగటు చికిత్స వ్యయం రూ.6,631 గా ఉండగా ప్రైవేటుఆసుపత్రుల్లో అది రూ.50,508గా ఉందని పేర్కొంది. ఉదాహరణకు ముంబైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో సింగిల్ రూమ్ అద్దె రోజుకు రూ.6,000నుంచి రూ.12,000వరకుఉండగా సమీపంలోని 3స్టార్ హోటళ్లలో అది రూ.2,500 నుంచి రూ.4,500 మధ్యే ఉందని నివేదికలో వివరించింది. గది అద్దెలతోపాటు ప్రైవేటు ఆసుపత్రులలోని కీలక చికిత్సలు, వ్యాధినిర్ధారణ పరీక్షల ధరలను కూడా నియంత్రించేలా ఒక చట్టబద్ధ మైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. చికిత్స ప్రారంభించడానికిముందే అంచనావ్యయాన్ని రోగులకువివరించాలని సూచించింది.

## రష్యా మధ్యవర్తిగా మాజీ సిజెఐ చంద్రచూడ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** రష్యా ఆక్రమించిన దేశంలోని కొన్ని ప్రాంతాలలో తాము ఆస్తులు, కార్యకలాపాలను కోల్పోయామని ఉక్రెయిన్ ప్రభుత్వ రంగ సంస్థ ఓషాడ్‌బ్యాంక్ దాఖలు చేసిన కొత్త పెట్టుబడి ఒప్పంద మధ్యవర్తిత్వంలో, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌ను రష్యా తన మధ్యవర్తిగా నియమించింది. గ్లోబల్ ఆర్బిట్రేషన్ రివ్యూ (జిఎఆర్) ప్రకారం, 1998 ఉక్రెయిన్ – రష్యా ద్వైపాక్షి క పెట్టుబడి ఒప్పందం కింద ఓషాడ్‌బ్యాంక్ వాదనను విచా రించే ముగ్గురు సభ్యుల మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్‌లో చంద్రచూడ్ ఉంటారు. కోస్టారికాకు చెందిన మధ్యవర్తి డయాలా జిమెనెజ్‌ను ఇరుపక్షాలు సంయుక్తంగా నియమించగా, ఆయన ట్రిబ్యునల్ అధ్యక్షురాలిగా ఉన్నారు. గ్రీకు మధ్యవర్తి, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ అయిన స్టావ్రోస్ బ్రెకౌలాకిస్‌ను ఓషాడ్‌బ్యాంక్ నియమించింది. ఈ నియామకం ముఖ్యమైనది, ఎందుకంటే, ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన మరో రెండు పెట్టుబడి ఒప్పంద కేసులలో తమ మధ్యవర్తిగా వ్యవహరించమని రష్యా గత సంవత్సరం చంద్రచూడ్‌ను సంప్రదించిందని జిఎఆర్‌నివేదించింది. ఆకేసులను జర్మన్ ఇంధన సంస్థ వింటర్ షాల్ డియా, ఉక్రేనియన్ ఇంధన సంస్థ ఉక్రెనెర్గో దాఖలు చేశాయి. చంద్రచూడ్ ఆ రెండు కేసులలోనూ వ్యవహరించడానికి నిరాకరించారు. శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం వింటర్‌షాల్ మధ్యవర్తిత్వంలో ఆయనను నియామక అధికారిగా నియమించినరోజే రష్యా చంద్రచూడ్‌ను సంప్రదించిందని జిఎఆర్ నివేదించింది.

## టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ రాజీనామా



**ముంబయి,ఆగస్టు 12:** టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆగస్టు 18న జరగనున్న కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.టాటా గ్రూప్‌లో తన 40 ఏళ్ల వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని చంద్రశేఖరన్ తెలిపారు. టాటా సన్స్‌ను గత దశాబ్ద కాలంగా నడిపించే అవకాశం దక్కడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఇది తనకు గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన పదవీకాలం ఫిబ్రవరి 2027 వరకు ఉంది. ఆ తర్వాత మరోసారి చైర్మన్‌గా కొనసాగేందుకు తాను ప్రయత్నించబోనని స్పష్టం చేశారు. వారసుడి ఎంపికను త్వరగా పూర్తి చేసి సజావుగా బాధ్యతల బదలాయింపు జరిగేలా చూడాలని బోర్డును కోరినట్లు వెల్లడించారు.చంద్రశేఖరన్ రాజీనామా వార్తల నేపథ్యంలో టాటా గ్రూప్‌కు చెందిన పలు కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. టాటా పవర్ 1.26 శాతం, టిసిఎస్ 3.9 శాతం, టాటా స్టీల్ 1.83 శాతం చొప్పున పడిపోయాయి. చంద్రశేఖరన్ పదవి కొనసాగింపుపై వాటాదారుల మధ్య నెలకొన్న విభేదాలు, టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటాతో ఆయనకు ఉన్న అభిప్రాయ భేదాలు రాజీనామాకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ఫిబ్రవరి 20, 2027 తర్వాత మరో ఐదేళ్లపాటు తన పదవీకాలాన్ని పొడిగించాలని సర్ దోరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లు ఏకగ్రీవంగా నిర్ణయించి సిఫారసు చేశాయని చంద్రశేఖరన్ తెలిపారు. ఈ ప్రతిపాదనను టాటా సన్స్ నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ, బోర్డు కూడా నమోదుచేసి సిఫారసుచేశాయని చెప్పారు. అయితే 2026 ఫిబ్రవరి 24న జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఈ ప్రతి పాదనకు ఒక బోర్డు సభ్యుడు మద్దతు ఇవ్వకపోవడంతో అది ఆమోదం పొందలేదని చంద్రశేఖరన్ వెల్లడించారు. ఏకగ్రీవ మద్దతు లేని పరిస్థితిలో తాను నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని ఎంచుకున్నట్లు తెలిపారు. టాటా సన్స్, టాటా ట్రస్ట్స్ మధ్య బోర్డులో ప్రాతినిధ్యం, గ్రూప్‌వ్యూహం, మైనారిటీ వాటాదారు షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ వైదొలగడం వంటి అంశాలపై విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## జస్టిస్ వర్మపై అభియోగాలు అన్నీ నిజమే

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేలాడు. అతడిపై మోపిన అభియోగాలు అన్నీ నిజమే అని లోక్‌సభ ప్యానెల్ నిర్ధరించింది. అయితే, ఈ విషయంలో అతడిపై ఏ చర్యలు తీసుకుంటారు అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి, రిటైర్డ్ జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉంటున్నాడు. గత యేడాది మార్చి 1415 తేదీల మధ్య అతడి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కొన్ని ఫొటోలు బయటపడ్డాయి. సంచలన విషయాలు వెలుగు చూశాయి. అగ్నిప్రమాదం జరిగిన యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలున్నాయి. ఇంటి స్టోర్ రూమ్‌లో ఈనోట్లకట్టలు చాలావరకు కాలిపోయాయి. కొన్ని ధ్వంసమయ్యాయి. అవన్నీ రూ.500 నోట్లకట్టలే. ఈ అంశం వివాదాస్పదం కావడంతో పోలీసులు, ఇతర అధికారులు ఆ ఇంటికి వెళ్లి ఆ ప్రదేశాన్ని సీజ్ చేశారు. అప్పటికే ఇంట్లోని సాక్షాలు తారుమారు అయ్యాయి. ఫొటోల్లో కనిపించిన కరెన్సీ నోట్లు ఆ సమయానికి అక్కడ లేవు. మొదట ఈ నోట్ల కట్టలకు, తనకు సంబంధం లేదని యశ్వంత్ వర్మ చెప్పాడు. అసలు, ఈ నోట్లు తన ఇంటికి సంబంధం లేదని చెప్పాడు. అయితే, ఒక రిటైర్డ్ జడ్జి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు కనిపించడం సంచలనంగా మారింది. జడ్జిల అవినీతి అంశం తెరమీదకు వచ్చింది. ఈ అంశంపై విచారణ జరిపేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక ప్యానెల్ ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్.. ఈ అంశంపై విచారణ జరిపింది. పలుమార్లు యశ్వంత్ వర్మను ప్రశ్నించింది. ఈ విచారణ తర్వాత అతడిని ప్యానెల్ దోషిగా గుర్తించింది. ఇందుకు ప్రధాన కారణాలు ఇవి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది అది ఎవరిది ఆ డబ్బు ఎంత ఉంటుంది వంటి వివరాలపై యశ్వంత్ వర్మ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో తనకు తెలియదన్నాడు. ఇతరులు తన ఇంటిని అక్రమంగా వాడుకునే అవకాశం ఉందని, ఎవరో తనకు తెలియకుండా డబ్బు తన ఇంట్లో పెట్టారని వర్మ చెప్పాడు. తనపై కుట్ర చేసి ఎవరో ఆ నోట్లు తన ఇంట్లో పెట్టారని చెప్పాడు.

## 20వేల పేజీలతో నీట్ పేపర్‌లీక్ కేసు సిబిఐ ఛార్జిషీటు

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** నీట్ పేపర్ లీక్ కేసులో సిబిఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను ఢిల్లీకోర్టు బుధవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో నిందితులపై అభియోగాలు నమోదు చేయాలా వద్దా అనే అంశంపై గురువారం, ఆగస్టు 13 నుంచి వాదనలు ప్రారంభించే అవకాశం ఉంది. పేపర్ లీకేజీలు, ప్రభుత్వ పరీక్షల్లో ఇతర అక్రమ మార్గాల వినియోగానికి సంబంధించిన క్రిమినల్ కేసులను విచారించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ముందు సిబిఐ ఇటీవల తుది నివేదికను సమర్పించింది.మొత్తం 20వేల పేజీల అభియోగ పత్రాన్ని సిబిఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా 13 మంది నిందితులపై దాఖలైన సిబిఐ తుది నివేదికను పరిగణనలోకి తీసుకున్నారు. గురువారం నుంచి అభియోగాలపై వాదనలు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.విచారణ సందర్భంగా సిబిఐ అధికారులు కీలక విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మీడియాలో పేర్లు ప్రచురితమవుతున్న కొంతమంది సాక్షులు మైనర్లుకూడా అయి ఉండవచ్చని తెలిపారు. ఛార్జిషీట్‌లోని కొన్నిభాగాలు నిరంతరం పత్రికల్లో ప్రచురితమవుతున్నాయని కోర్టుకు వివరించారు.దీనిపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కేసులోని సాక్షుల పేర్లను మీడియా ప్రచురించడంపై అభ్యంతరం తెలిపింది. ఇది చాలా దిగ్భ్రాంతికరం. కోర్టులో ఇంకా ప్రస్తావించని, ప్రస్తుతం ఛార్జిషీట్‌లో భాగంగా ఉన్న విషయాలన్నీ మీడియా ద్వారా బహిరంగం కావడం అత్యంత ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి విషయాలకు దూరంగా ఉండాలని సూచించింది.



## షార్ట్‌కట్‌లు నేర్చుకుంటే జీవితం షార్ట్ అవుతుంది

### మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణలో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 12:** ఆత్మకథ పుస్తకాలను యువత చదవాలని, ఇతరుల కష్టాలనుంచి వారు నేర్చుకోవాలని ప్రధాని మోడీ అన్నారు. ఇది రీల్స్ యుగం అని, కానీ కేవలం షార్ట్‌కట్‌లునేర్చుకుంటే, జీవితం షార్ట్ అవుతుందని కూడా ఆయన హెచ్చరించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆటో బయోగ్రఫీ 'ట్రింఫ్ ఆఫ్ ద ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' అనే బుక్‌ను ఇవాళ ప్రధాని మోడీ ఆవిష్కరించారు. ఆ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోవింద్ జీవితం పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కోవింద్ పట్టుదలతో చదివి, రాజ్యాంగ హోదాలో అత్యున్నత స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. రాష్ట్రపతి పదవి నుంచి వైదొలిగిన తర్వాతకూడా కోవింద్ ప్రజా జీవితంలో చురుకుగా ఉంటున్నారని, ఆఫీసు నుంచి తప్పుకున్న తర్వాత ఆయనేమీ రెస్టు తీసుకోలేదని, వన్ నేషన్ వన్ ఎలక్షన్ స్కీమ్‌పై ఆయన వర్క్ చేస్తున్నట్లు ప్రధాని చెప్పారు. భారత ప్రజాస్వామ్యంలో ఆయన చేస్తున్న కృషి కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నదని ప్రధాని తెలిపారు.

## జలశక్తి కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అర్చనావర్మ



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని జల వనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి అర్చనా వర్మ నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) ఆమోదం తెలిపింది. 1995 బ్యాచ్‌కు చెందిన అగ్‌మట్ కేడర్ అధికారి అయిన అర్చనా వర్మ ప్రస్తుతం ఇదే శాఖలో అదనపు కార్యదర్శిగా, జాతీయ జల మిషన్ మిషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నీటి నిర్వహణ, ప్రజా పరిపాలన, విధానాల అమలులో ఆమెకు ఉన్న విస్తృత అనుభవం కేంద్ర ప్రభుత్వంలోని కీలకమైన జల వనరుల శాఖకు మరింత ఉపయోగ పడనుంది. విస్తృత పరిపాలనా అనుభవంఅర్చనా వర్మ తన పరిపాలనా ప్రస్థానాన్ని అసోంలోని కర్బీ ఆంగ్‌లాంగ్‌లో సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్‌గా ప్రారంభించారు. అనంతరం గోల్‌పారా జిల్లా మేజిస్ట్రేట్‌గా పనిచేశారు.

ఈ సమయంలో తరచూ సంభవించే వరదలు, శాంతిభద్రతల సమస్యలను సమర్థంగా ఎదుర్కోవడంతో పాటు మహిళల స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం, అక్షరాస్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు.అసోంలో గ్రామీణాభివృద్ధి కమిషనర్, కార్యదర్శిగా, గువాహటి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, గోల్‌పారా జిల్లా మేజిస్ట్రేట్‌గా ఆమె వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు. పట్టణ పరిపాలన, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆమెకు ఉన్న అనుభవం క్షేత్రస్థాయిలో పాలన, ప్రజలకు ప్రభుత్వ సేవల అందుబాటుపై మంచి అవగాహనను కల్పించింది.

# సంక్షిప్త వార్తలు

## అరుణాచల్‌లో భారత్ చైనా సైనికుల సరిహద్దుఘర్షణ



**ఇటానగర్, ఆగస్టు 12:** ఇండియా-చైనాల మధ్య మరోసారి ఉద్రిక్త వాతావరణంఏర్పడింది. ఇరుదేశాల సైనికులు సరిహ ద్దులో పరస్పరం ఘర్షణకు దిగినట్లుతెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత సరిహద్దు ప్రాంతం లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్‌ఎసి)వద్ద గత నెలలో ఈ ఘటన జరిగినట్లు తెలు స్తోంది. దీనికి సంబంధించిన ఒక ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. దీనిపై భారత సైన్యం, ప్రభుత్వం మాత్రం అధికారికంగా స్పందించలేదు. గతనెల 26న ఈ ఘటన జరిగింది.

## చార్‌ధామ్ యాత్రకు పోటెత్తిన భక్తులు

**డెహ్రాడూన్, ఆగస్టు 12:** ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తుతున్నారు. వర్షాకాలం కారణంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ యాత్రికుల సంఖ్య రికార్డు స్థాయిలో నమోదవుతోంది. ఈ యాత్రా సీజన్ ప్రారంభమైన 114 రోజుల్లోనే మొత్తం 47,02,703 మంది భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 4,68,556 అధికం కావడం విశేషం. ఈ ఏడాది యాత్ర సరికొత్త రికార్డును నెలకొల్పే దిశగా సాగుతోంది. భక్తుల భద్రతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ ధామి స్పష్టంచేశారు.

## బాలి సమిపంలో సముద్రంలో పడవలో మంటలు

**బాలి, ఆగస్టు 12:** ఇండోనేషియాలోని బాలి సమీపంలో ఓ ఓడలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దాంతో ఆ ఓడలోని 172 మంది అందులో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు 131 మందిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ఒకరు మరణించారు. మిగతా వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సముద్రంలో పెద్ద ఎత్తున అలలు ఎగసిపడుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు.

## 250 దాటిన కొలంబియా భూకంప మృతులు

**పెరిరా, ఆగస్టు 12:** కొలంబియాలో భూకంప మృతుల సంఖ్య 250 దాటింది. సోమవారం 7.4 తీవ్రతతో ఆ దేశాన్ని భూకంపం షేక్ చేసిన విషయం తెలిసిందే. పెరిరా, కాలి ప్రాంతాల్లో భారీ సంఖ్యలో భవంతులు నేలమట్టం అయ్యాయి. ఆ శిథిలాల కింద ఇంకా వందల సంఖ్యలో జనం చిక్కుకుని ఉంటారని భావిస్తున్నారు. పర్వత ప్రాంతమైన పశ్చిమ కొలంబియాలో ప్రస్తుతం ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. ఆ ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇండ్లు, స్కూళ్లు, హెల్త్ సెంటర్ల భవనాలన్నీ పగుళ్లు వచ్చాయి. వేర్వేరు నగరాల్లో నమోదు అయిన డేటా ప్రకారం ఇప్పటి వరకు 254 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది.

## కావేరీ నీటి వివాదం: విచారణ 17కి వాయిదా

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కావేరీ నీటి విడుదలపై 'కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ' (సిడబ్ల్యుడబ్ల్యుఎ) తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేలా కర్ణాటకను ఆదేశించాలని కోరుతూ తమిళనాడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 17కి వాయిదా వేసింది. ఆగస్టు 13న ఈ అంశాన్ని విచారించాల్సి ఉన్న జస్టిస్ విక్రమ్ నాథ్ అనారోగ్యానికి గురయ్యారని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తెలిపారు.

## జపాన్‌పై ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

**టోక్యో,ఆగస్టు 12:** ఉత్తర కొరియా సైనిక చర్యలు అనూహ్యంగా ఉంటాయి. తాజాగా జపాన్‌పైకి ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఉత్తర కొరియా తన తీర ప్రాంతం నంచి జపాన్‌పైకి ఒక మిస్సైల్‌ను పరీక్షించింది. వోన్సమ్ ప్రాంతంలోని ఉత్తర తీరం నుంచి ప్రయోగించిన ఈ మిస్సైల్ జపాన్ స్పెషల్ ఎకనామిక్ జోన్ సమీపంలో పడ్డట్లు జపాన్ ప్రభుత్వం తెలిపింది.

13-8Pg5exHMNWJQEBP.qxd:13-8Pg5exHMNWJQEBP.qxd 1/1/02 6:11 AM Page 1



# తిరుమల సమాచారం



## గోవిందరాజస్వామి ఆలయంలో చక్రత్తాళ్వార్ సాత్తుమొర

**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం చక్రత్తాళ్వార్ సాత్తుమొర, ప్రతివాది భయంకరన్ అన్నన్ సాత్తుమొర వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణస్వామి ఆలయం నుండి ఉభయ నాంచారులతో వరదరాజ స్వామి, ప్రతివాది భయంకరన్ అన్నన్ స్వామివార్లను ఆలయ నాలుగు మాడ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుమల శ్రీవారి ఆలయం నుండి తీసుకొచ్చిన అప్పడి ప్రసాదాన్ని కోదండరామాలయం నుండి లక్ష్మీనారాయణస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి సాత్తుమొర నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, చక్రత్తాళ్వార్ స్వామివార్లను ఆలయ నాలుగు మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయాల డిప్యూటీ ఇఒ వి.ఆర్. శాంతి, ఎఇఒ ఎబి నారాయణ, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవ 'శిక్షకుడికి శిక్షణ'



**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడిలో శ్రీవారి సేవను మరింత బలోపేతం చేసి భక్తులకు ఇంకా నాణ్యమైన సేవలు అందించేందుకు శ్రీవారి సేవ శిక్షకుడికి శిక్షణ (ట్రైన్ ది ట్రైనర్స్) రెండో విడత శిక్షణ విజయవంతంగా ముగిసింది. ముఖ్యమంత్రి సూచనలతో ప్రభుత్వ ప్రణాళిక విభాగం సహకారంతో టిటిడి ప్రజా సంబంధాల శాఖ 43రోజులు నిర్వహించిన శ్రీవారి సేవ ట్రైన్ ది ట్రైనర్స్ బుధవారం ముగిసింది. జులై 1న ప్రారంభమైన ఈ రెండో విడత శిక్షణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రతో బాటు ఉత్తర భారత రాష్ట్రాలకు చెందిన 1,888 మంది శ్రీవారి సేవ గ్రూప్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. మొదటి బ్యాచ్‌తో కలిపి ఇప్పటి వరకు దాదాపు 3 వేల మంది గ్రూప్ సూపర్‌వైజర్లు శిక్షణ పొందారు. శ్రీవారి సేవకుల్లో సేవా నైపుణ్యాలు, సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. శిక్షణ పొందిన ట్రైనర్లు తమ తమ మండలాలు, జిల్లాల్లో ఆన్‌లైన్ ద్వారా శ్రీవారి సేవకు నమోదు చేసుకున్న సేవకులకు తిరుమలకు వచ్చే ముందే శిక్షణ అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. సేవకుల్లో సేవా నాణ్యత, అంకితభావం, బాధ్యతాయుత ప్రవర్తన మరింత పెరిగి, తిరుమలకు విచ్చేసే భక్తులకు సమర్థవంతమైన, క్రమశిక్షణతో కూడిన, భక్తి భావపూర్వక సేవలు అందించేందుకు దోహదపడుతుంది.

## 21న వరలక్ష్మీ వ్రతం.. నేడు టికెట్ల విడుదల



**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి ఆలయంలో ఈనెల 21న శుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరగనుంది. ఈ వ్రతాన్ని వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి జెఇఒ ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. తిరుచానూరులోని ఆస్థానమండపంలో బుధవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, క్యూలైన్లు, తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదం, పారిశుద్ధం, భద్రత తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జెఇఒ సూచించారు. వ్రతం సందర్భంగా అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, ఊంజల్‌సేవలను రద్దు చేసినట్లు తెలిపారు.

**నేడు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు:** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గురువారం (నేడు) ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో టికెట్లను విడుదల చేయనున్నారు. ఆఫ్ లైన్ టికెట్లను ఒక రోజు ముందు ఆలయ ముందు ఉన్న కౌంటర్‌లో విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్, ఎస్ఇ నరసింహామూర్తి, డిఇ రవిశంకర్‌రెడ్డి, అదనపు ఆరోగ్యఅధికారి డాక్టర్ సునీల్, ఎఇఒ దేవరాజులు, ఎవిఎస్ఒ శ్రీహరిరావు, కేటరింగ్ అధికారి విజయభాస్కర్, ఆలయ అర్చకులు, పాల్గొన్నారు.

## కోదండరామాలయంలో హనుమంత వాహనసేవ



**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహనసేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఖానస ఆగమం ప్రకారం వైష్ణవ ఆలయాల్లో పౌర్ణమి, అమావాస్య, శుక్ల ఏకాదశి, కృష్ణ ఏకాదశి, శ్రవణం, పునర్వసు నక్షత్రాలకు విశేష ప్రాధాన్యం ఉంది. ఉదయం సహస్ర కలశాభిషేకం సేవను ఆగమోక్తంగా నిర్వహించారు. 500 రూపాయలు చెల్లించి సేవలో పాల్గొన్న గృహస్తులకు (ఇద్దరికి) ఉత్తరీయం, రవికె, లడ్డూ, వడ ప్రసాదాలను అందజేశారు. బుధవారం రాత్రి 9గంటల వరకు హనుమంత వాహనసేవను వైభవంగా నిర్వహించారు. సర్వాలంకార భూషితులైన కోదండరామస్వామి తనకు అత్యంత ప్రీతిపాత్రమైన హనుమంత వాహనాన్ని అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒబి. నాగరత్న, సూపరింటెండెంట్ కె.శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## ఎస్వీ గోశాలలో ప్రపంచ ఏనుగుల దినోత్సవం

**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్వీ గోశాలలో టిటిడి ఆలయ ఊరేగింపుల్లో పాల్గొనే లక్షి ్మ, వైష్ణవి, పద్మావతి అనే మూడు ఆడ ఏనుగులకు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం గోశాల డైరెక్టర్ ఎ.వి.ఎన్. శివకుమార్ సమక్షంలో జరిగింది. ఆలయ సంప్రదాయాల్లో భాగంగా సేవలందిస్తున్న గజరాజులను టిటిడి ప్రేమతో, ఆధ్యాత్మిక భావంతో సంరక్షి స్తూ, వాటి ఆరోగ్యం, సంక్షే మానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టోంది. ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు గజరాజుల పట్ల భక్తులకున్న గౌరవం, అనుబంధాన్ని చాటాయి.



# తిరుమలలో అధునాతన బయోగ్యాస్ ప్లాంట్

● రూ.12.85 కోట్లతో ఏర్పాటు ● రోజుకు 40టన్నుల సామర్థ్యంతో ఉత్పత్తి



**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో రానున్న రోజుల్లో నిత్యావసరాలకు అవసరమైన బయో గ్యాస్‌ను వినియోగించుకునేందుకు టిటిడి పనులు చేపట్టింది. ఇప్పటికే ఈ ప్లాంట్ నిర్మాణం పనులు పూర్తికావడంతో పైప్‌లైన్ ఏర్పాటు పనులు సాగుతున్నాయి. తిరుమలలో కాకులమానుతిప్ప వద్ద రూ.12.85 కోట్ల అంచనాతో రోజుకు 40టన్నుల సామర్థ్యంతో బయోగ్యాస్ ఉత్పత్తి చేయనుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిర్వహణలో ఈ బయో గ్యాస్ ప్లాంట్ రూపుదిద్దుకుంది. తిరుమలకొండపై భక్తుల అవసరాలకు తగ్గట్లు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల తయారీకి కూడా అవసరమైన బయోగ్యాస్‌ను టిటిడి స్వతహాగా ఉత్పత్తి చేసుకోనుంది. శేషాచలకొండల్లోని కాకులమానుతిప్ప వద్ద బయోగ్యాస్ ప్లాంట్ 2.22 ఎకరాల్లో నిర్మించారు. 0.17ఎకరాల్లో కంపోస్టు నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్లాంట్ నిర్మాణంలో ఐఓసిఎల్ రూ.7.05 కోట్లు, టిటిడి రూ.5.80 కోట్లు వెచ్చించింది. ఈ ప్లాంట్ ద్వారా తిరుమలలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. తడి/ ఆహార వ్యర్థాలను ప్రాసెస్ చేయడం ద్వారా వ్యర్థాల నుండి గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు మంచి ఆదాయం టిటిడికి యేటా రూ.1.52 కోట్లు ఆదా చేస్తుంది. ఆర్థికంగా కూడా వెసులుబాటు కలుగుతుంది. ఇప్పటికే తిరుమలలో రోజువారీగా గ్యాస్ వినియోగం పెరిగింది. గతంలో 60వేల మంది యాత్రికులు అన్న ప్రసాదాలు స్వీకరించే వారి సంఖ్య ప్రస్తుతం లక్ష మంది నుండి 1.30లక్షల మంది వరకు రోజువారీగా ఉంటున్నారు. దీంతో తయారీ కూడా పెరిగింది. ఈ ప్లాంట్ అందుబాటులోకి వస్తే ఇక్కడ ఉత్పత్తి అయ్యే బయోగ్యాస్‌ను లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి వినియోగించేలా చూడనున్నారు. తిరుమలలో ప్రతి రోజు ప్రోగయ్యే 55 టన్నుల తడి వ్యర్థాల్లో 40 టన్నులు ఐఓసిఎల్ ప్లాంటుకు తరలిస్తారు. ఈ ప్లాంట్‌లో 45 మెట్రిక్ టన్నుల మెంబ్రేన్ స్టోరేజ్ వెసెల్స్, 1500 కిలోల వెయిబ్రేజ్, ఆగ్రిమాటిక యంత్రాంగం, స్ప్రింక్లర్ వ్యవస్థ, రెండు వాటర్ ట్యాంకులు, డీజిల్ జనరేటర్ సెట్, రిమోట్ ఆపరేటింగ్ వాల్వులు, గ్యాస్‌లీక్ అలారం, ట్యాంక్ లారీ డికాంటేషన్ వ్యవస్థ, సిసిటివి, ఐఎంఎస్, టిఎఫ్ఎంఎస్, ఎల్ఇఎన్‌డి వంటి అత్యాధునిక భద్రతా పరికరాలు ఏర్పాటు చేశారు. మిశ్రమపదార్థాల బయోగ్యాస్ అన్నప్రసాదాల తయారీకి వినియోగిస్తారు.

# మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ బాధితులకు న్యాయం చేస్తాం

ప్రజల వినతులపై బాధ్యతగా స్పందిస్తాం, పరిష్కరిస్తాం ● టిడిపి కేంద్ర కార్యాలయంలో హోంమంత్రి అనిత



**మంగళగిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:** ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజలు ఒక నమ్మకంతో తమ సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేస్తామని తెలిపారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 65 వినతులను స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకుని, పరిష్కారం సాధ్యమైన అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ వ్యవహారంలో డబ్బులు కోల్పోయామని పేర్కొంటూ పలువురు బాధితులు హోంమంత్రిని కలిసి తమ సమస్యను వివరించారు. ఈ వ్యవహారంలో దాదాపు 200 మంది బాధితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని హోంమంత్రి తెలిపారు. బాధితుల ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించిందని, వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు డిసిపి తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదులను పరిశీలించి, దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్మును నమ్మకంతో పెట్టుబడి పెట్టి నష్టపోయిన వారి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని హోంమంత్రి పేర్కొన్నారు.

**చిన్నారి చదువుకు భరోసా:** తండ్రికి ఉపాధిపై అధికారులతో మాట్లాడిన హోంమంత్రి ప్రజా వినతుల కార్యక్రమంలో నాయుడుపేట ప్రాంతం నుంచి తన ఏడేళ్ల కుమార్తెతో వచ్చిన ఓ తండ్రి కుటుంబ పరిస్థితిని హోంమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కుటుంబ పరిస్థితుల కారణంగా కుమార్తె చదువు కొనసాగించడం కష్టంగా ఉందని, తనకు కూడా స్థిరమైన ఉపాధి లేదని వివరించారు. వారి పరిస్థితిపై స్పందించిన హోంమంత్రి సంబంధిత జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. చిన్నారి చదువు ఆగకుండా అవసరమైన వసతి సదుపాయం ఉన్న హాస్టల్‌లో చేర్పించి విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తండ్రికి కూడా ఉపాధి అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను కోరారు.

# శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు పోరాడాలి

## ఎఐఎస్ఎఫ్ 90 వసంతాల వేడుకల్లో వక్తలు వెల్లడి



**అనంతపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త బ్యూరో:** డామిట్ కథ అడ్డం తిరిగింది అన్న రీతిలో భారత విద్యా వ్యవస్థ తయారైందని, భారత చరిత్రగానే ఉంచాలని, చరిత్రనే మార్చాలని యత్నిస్తున్నారని ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చరిత్రలో ముస్లిం రాజులకు పాత్ర ఎంతో ఉందని, వారి పాత్రను తీసివేసి హిందూ రాజుల పాత్రలోనే ప్రముఖంగా చూపాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారతదేశ చరిత్రని మార్చడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నిస్తూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో 90 వసంతాల వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసులు నాయుడు పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం 'భారత ప్రజాస్వామ్యం- విద్యార్థుల పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సులో వక్తలు ప్రసంగించారు.

ఈ సందర్భంగా రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించి ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేస్తున్నారని, పేద వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వై.విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్.డి.ఎ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శించారు. విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, అలాగే దేశ రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ కాక్రోచ్ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని హక్కుల కోసం పోరాడాలని, అవినీతి, అన్యాయాలను ప్రశ్నించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సహాయ కార్యదర్శి రాజారెడ్డి, మల్లికార్జున, రచయిత దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు వికె రంగారెడ్డి, తిరుపతయ్య, ఖమర్ బేగం, కె చెన్నకేశవులు, బండి నాగరాజు, ఒంటెద్దు గోపాల్ రెడ్డి, అంకన్న, బి.రమణయ్య, నిరంజన్ గౌడ్, రామాంజనేయులు, జి నరేష్, ఎం.మధు, చిరంజీవి, నిర్వహణ కమిటీ సభ్యులు నగేష్, అజయ్ కుమార్, రామాంజనేయులు, ఆంజనేయులు, నరసింహ యాదవ్, ఉమా మహేష్ మంజునాథ్, వంశీ, సమీర్, నవీన్, నాని, సాయి, బాబ్జాన్, సుస్రత్, ఆస్ఫాక్, లెనిన్, కల్లప్ప, రాజేష్ గౌడ్, ఆనంద్, గణేష్ వంశీ, దుర్గాప్రసాద్, ధనంజయ, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, రామదాస్, పుల్లయ్య, తిప్పేస్వామి, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది. వివిధ కళాశాలల విద్యార్థులు కూడా ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

# అమెరికాకు వెళ్లినా వ్యవసాయంపై తగ్గని మక్కువ

● కాలిఫోర్నియాలో పంటల పరిశీలన... సాగు విధానాలు, మార్కెటింగ్ తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



**అనంతపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త బ్యూరో:** నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ అభివృద్ధి, రాజకీయ కార్యక్రమాలతో బిజీ బిజీగా కనిపించే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు వ్యవసాయంపై తనకున్న మక్కువ ఏమాత్రం తగ్గలేదు. తరచూ తన వ్యవసాయక్షేత్రాన్ని సందర్శిస్తూ అక్కడే సమయం గడపటం, అలాగే రైతుల పొలాలను పరిశీలించడం వంటివి చేస్తుంటారు. అయితే తన వ్యక్తిగత పర్యటనలో భాగంగా అమెరికా వెళ్లిన ఆమె అక్కడ కూడా వ్యవసాయం పై ఆసక్తి చూపించారు. అక్కడ పంటలు ఎలా సాగుచేస్తున్నారో తెలుసుకోవాలన్న ఆసక్తితో క్యాలిఫోర్నియాలో పంట పొలాలను పరిశీలించారు. అక్కడి వ్యవసాయ విధానాలను, అలాగే పంటల ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి అంశాలను స్థానికంగా ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. భారత దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిన సమయంలో పంజాబ్ రాష్ట్రం నుంచి వలస వెళ్లిన సిక్కులు కాలిఫోర్నియాలో స్థిరపడగా.. ప్రస్తుతం ఓ సిక్కు రైతు 175 ఎకరాలలో ఆల్మండ్ (బాదం) పంట వేశారు. ఈ పంటను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. పంట ఎలా సాగు చేస్తున్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ పంట సాగు చేసి 8 సంవత్సరాలైందని.. ఒక ఎకరానికి 150 మొక్కలు నాటుతారని.. ఒక ఎకరానికి 1.6 టన్నుల దిగుబడి వస్తుందని వివరించారు. 100 ఎకరాల నుంచి 3వేల ఎకరాల దాకా ఒక్కో రైతు అక్కడ పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు.

పంటల నిర్వహణ విధానాన్ని తెలుసుకోవడంతో పాటు పంట కోత (హార్వెస్టింగ్) విధానాన్ని కూడా తెలుసుకున్నారు. మొత్తం యంత్రాల ద్వారానే హార్వెస్టింగ్ నిర్వహిస్తారని రైతులు వివరించారు. అమెరికాలో వ్యవసాయ విధానాలు చాలా సాంకేతికంగా ఉన్నాయని.. మార్కెటింగ్‌లో కూడా మనం తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయని ఎమ్మెల్యే సునీత తన అభిప్రాయాలను పంచుకున్నారు.

## ఏనుగు దాడి.. కార్మికుడికి తీవ్ర గాయాలు



**పలమనేరు, ఆగస్టు 12 ప్రభాతవార్త:** ప్రపంచ ఏనుగుల దినోత్సవం రోజే ఒంటరి ఏనుగు దాడి చేసింది. చిత్తూరు జిల్లా పలమనేరు- బంగారుపాళ్యం మొగిలిఘాట్ సమీపంలో ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద అటవీ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఏనుగు దాడి చేయడంతో రహదారి కార్మికుడు మనీష్‌సింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు ఇతన్ని వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుడు ప్రసాద్ ప్రథమ చికిత్స అనంతరం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో కార్మికుడు చికిత్స పొందుతున్నాడు.

## వరుణయాగం ఎందుకు నిర్వహించరు?

### - టిటిడిపై భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం



**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్నాయని, తిరుమల కొండపై కూడా జలాశయాలు ఎండిపోతున్నాయని వైసిపి జిల్లా అధ్యక్షుడు, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తిరుమలలో టిటిడి వరుణయాగం చేపట్టాలని డిమాండ్ చేశారు. కొండపై జలాశయాలు సైతం ఎండిపోతున్నా టిటిడి పాలకుల్లో చలనం లేకపోవడం శోచనీయమని మండిపడ్డారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తక్షణమే వరుణయాగం నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు సనాతన ధర్మ పరిరక్షణతో బాటు ప్రజాక్షేమం కోసం వెంటనే మేల్కొని వరుణయాగం చేపట్టాలని భూమన డిమాండ్ చేశారు.

# ద్రవిడ వర్సిటీలో రాష్ట్ర కమిటీ పర్యటన

**కుప్పం, ఆగస్టు 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్వర్యంలో అమలు చేస్తున్న రూసా 2.0పథకంలో భాగంగా ద్రవిడ వర్సిటీలో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను రాష్ట్రస్థాయి పరిశీలన కమిటీ బుధవారం పరిశీలించింది. ఎపి ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు, రూసా/పిఎం ఉషా నోడల్ అధికారి, ఎస్వీయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, పిఆర్ డిఇ గురవారెడ్డి, రూసా ప్రాజెక్ట్ అకౌంట్స్ అధికారి శంకరరావు, టిఎస్‌జి రూసా తిరుపతిరావు తదితరులు పనులు పరిశీలించారు. ఈసందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.సి. మల్లయ్య అధ్యక్షత సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల పురోగతి, నిధుల వినియోగం, ఆస్తుల సృష్టి అంశాలపై సమీక్షించారు. 20కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన జిప్లస్2 తరగతి గదుల సముదాయం, పురుషుల హాస్టల్, హరప్ప, భాషా భవన్‌ల ఆధునీకరణ పనులు పూర్తయి వినియోగిస్తున్నట్లు కమిటీ గుర్తించింది. రూసా నిధులతో కొనగోలు చేసిన డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, నెట్‌వర్క్ పరికరాలు, సిసి కెమెరాలు, సోలార్ లైట్లు, ఫర్నీచన్ తదితరాలు వినియోగంలో ఉన్నట్లు గుర్తించారు. పనుల నాణ్యతపై స ంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ ప్రాజెక్టు అమలుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రాజెక్ట్ డైరెక్టరేట్, ఉన్నత విద్యామండలి, వర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీసిటీని సందర్శించిన జర్మనీ కాన్సుల్ జనరల్

**సత్యవేడు, ఆగస్టు 12 ప్రభాతవార్త:** చెన్నైలోని జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో శ్రీసిటీ అంతర్జాతీయ పెట్టుబడి దారులకు అనువైన వేదికగా ఎదిగిందన్నారు. బెల్ ఫ్లేవర్స్, ప్రొగ్రెస్సెస్, నాఫ్, కాంక్యో బెర్ట్ వంటి జర్మనీ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. జర్మనీ నుంచి మరిన్ని పెట్టుబడులకు ఈ పర్యటన దోహదపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. శ్రీసిటీ సమగ్ర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ ద్వారా ఒనగూరే వివిధ ప్రయోజనాలను కాన్సుల్ జనరల్‌కు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పన్నురాయితీలు, సబ్సిడీలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పెట్టుబడి దారుల అనుకూల విధానాలపై అవగాహన కల్పించారు. పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీలోని పలు కీలక సదుపాయాలను సందర్శించారు. జర్మనీకి చెందిన నాఫ్ పరిశ్రమను సందర్శించి అక్కడి సిబ్బందితో ముచ్చటించారు. ప్లాంట్‌లో ఉత్పత్తి కార్యకలాపాలు, ఇతర అంశాలను ఆయన పరిశీలించారు. ఈ పర్యటన భారత్, జర్మనీ మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగుగా నిలవడంతో పాటు అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రముఖ గమ్యస్థానంగా శ్రీసిటీని మరింత బలోపేతం చేయనుంది.

## పైడిభీమవరం పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారుల బృందం విచారణ

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 12 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం మండలం పారిశ్రామికవాడ పైడిభీమవరం గ్రామ పంచాయతీకి చెందిన రూ.7.50 కోట్లు సాధారణ నిధుల దుర్వినియోగం వ్యవహారంపై ఆరోపణలు వెల్లువెత్తడంతో సమగ్ర విచారణ జరిపేందుకు ప్రభుత్వం నియమించిన పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ విజయకుమారి, విశాఖ జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి, పంచాయతీరాజ్ జాయింట్ డైరెక్టర్ రామనాథరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ ఎస్.రఘురామిరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డీఈ డి.సత్యనారాయణ, పలాస డీడీఓ ఎం.సతీష్, డీఎల్పీఓ ఎ.చక్రవర్తి, గ్రేడ్1 పీడీఓ తిరుపతిరావు, టెక్కలి జూనియర్ అసిస్టెంట్ పి.లోకేశ్వరరావు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక బృందం బుధవారం విచారణ చేపట్టి సంబంధించిన రికార్డులను పరిశీలించింది. అనంతరం గత ఏడాది ఏప్రిల్ 1 నుండి గ్రామ పంచాయతీలో సాధారణ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వాటి వ్యయం తదితర వివరాలపై క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ జరిపింది. అయితే చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించకుండా పనులను చేపట్టినట్లు వారు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బృందంలో జిల్లా పంచాయతీ అధికారి ఆర్ స్వరూపరాణి ఉన్నారు.

## అన్న క్యాంటీన్‌లో భోజనం చేసిన కలెక్టర్



**విజయనగరంచీపురుపల్లి, ఆగస్టు 12 ప్రభాతవార్త :** చీపురుపల్లిలోని అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి బుధవారం సందర్శించారు. క్యాంటీన్‌లో భోజన నాణ్యత, పరిశుభ్రత, అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా డబ్బులు చెల్లించి టోకెన్ తీసుకుని క్యాంటీన్‌లో భోజనం చేశారు. భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం అన్న క్యాంటీన్‌కు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడి భోజనం రుచి, నాణ్యత, అందుతున్న సేవలపై వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అన్న క్యాంటీన్‌లో భోజనం నాణ్యంగా, రుచికరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పేదలు, సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా అన్న క్యాంటీన్ సేవలను నిర్వహించాలని సూచించారు.

## రేపల్లె సబ్ జైలులో ఖైదీ ఆత్మహత్యాయత్నం

**రేపల్లె, ఆగస్టు 12, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా రేపల్లె సబ్ జైలులో బుధవారం రిమాండ్ ఖైదీ ఉయ్యూరు శ్రీనివాసరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వృద్ధురాలి హత్య కేసులో శ్రీనివాసరావు రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. సబ్ జైలు వంట గదిలో కూరగాయలు కోసే కత్తి తీసుకున్న శ్రీనివాసరావు కంఠం కింద కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.గమనించిన సబ్ జైలు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స చేశారు. పోలీసుల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని శ్రీనివాసరావు వెల్లడించాడు. రిమాండ్ ఖైదీ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసరావు వ్యవహారంపై పూర్వాపరాలను పరిశీలించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నిద్రిస్తున్న వ్యక్తిపై గొడ్డలితో దాడి, హత్య

**దుర్గి, ఆగస్టు 12 ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా దుర్గి మండలం ఓబులేసునిపల్లె గ్రామంలో అర్ధరాత్రి వేళ ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఇంటి బయట నిద్రిస్తున్న వ్యక్తిపై దుండగులు గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణాలు తీశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులేసునిపల్లె గ్రామానికి చెందిన కొమ్ము ఇమ్మానుయేలు (35) అనే వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి వేళ తన ఇంటి బయట నిద్రిస్తున్నాడు. అదనుగా చూసుకున్న గుర్తుతెలియని దుండగులు, ముందస్తు పథకం ప్రకారం గొడ్డలితో ఆయనపై దాడికి తెగబడ్డారు. తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో ఇమ్మానుయేలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం ఉదయం ఈ ఉదంతం వెలుగులోకి రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గురజాల డిఎస్పీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సిఐ భాస్కర్, ఎస్సై గోపాల్ మరియు క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, క్షేత్రస్థాయిలో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. ఈ హత్యకు పాత కక్షలు లేదా వ్యక్తిగత వివాదాలే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు.

విశాఖపట్నం అనకాపల్లి అల్లూరి సీతారామరాజు
26
వార్త
గురువారం 13, ఆగస్టు 2026




## జాతీయ సహకార సవరణ బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు..

**సహకార రంగంలో సీఎం చంద్రబాబు కృషి అద్భుతం: రాజ్యసభలో ఎంపీ చింతకాయల విజయ్**

విశాఖపట్నం-ప్రభాతవార్త

జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ (సవరణ) బిల్లు-2026కు 8వ పేజీలో

### రాజ్యసభలో 'కేరళం' బిల్లుకు మద్దతు తెలిపిన

## టీడీపీ ఎంపీ చింతకాయల విజయ్

విశాఖపట్నం-ప్రభాతవార్త

రాజ్యసభలో కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చే 'కేరళ ఆల్టరేషన్ ఆఫ్ నేమ్ బిల్ 2026'కు తెలుగుదేశం పార్టీ తరఫున ఎంపీ చింతకాయల విజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. భారతదేశ బలం భిన్నత్వంలో ఏకత్వంలోనే ఉందని, ప్రతి రాష్ట్ర భాష, సంస్కృతి, భౌగోళిక గుర్తింపును గౌరవించడం సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. 'కేరళం' అనే పేరు మలయాళ భాషా సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుందని, ఈ బిల్లు ద్వారా ఆ రాష్ట్ర భాషా, సాంస్కృతిక గుర్తింపునకు 8వ పేజీలో

### రెండేళ్లలో భూగర్భ విద్యుత్

## కేబుల్ పనులు పూర్తి చేస్తాం...

**పాత నగరంలో ఫేజ్-2 పనులు -రూ.973 కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం : సిఎండి పృధ్వీ తేజ్**

జ్ఞానాపురం, ఆగస్టు 12, ప్రభాతవార్త



విశాఖ మహానగరంలో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ మరో రెండేళ్లలో పూర్తి చేయనున్నారు. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాలోల అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు పూర్తికాగా పాత నగరంలోని చాలా ప్రాంతాల్లో పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని ఇపిడిసిఎల్ చైర్మన్ ఇమంది పృధ్వీ తేజ్ తెలిపారు. భూగర్భ పనులు పూర్తియిన ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ స్థంబాల తొల గింపు వెంటనే చేపడుతున్నట్టు సిఎండి తెలిపారు. భూగర్భ కేబుల్ పనులు పూర్తయితే చాలా వరకు విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కావని ఆయన తెలిపారు. ఫేజ్-1లో బాగంగా చేపట్టిన పనులు పూర్తయినట్టు ఆయన తెలిపారు. 876 కిలోమీటర్ల పరిదిలో భూగర్భ కేబుళ్ళ పనులు రూ.664 కోట్లతో పూర్తి చేశారు. రెండో విడతలో భాగంగా పాత నగరం నుంచి భూగర్భ కేబుల్ పనులు సుమారు రూ.973 కోట్లతో చేపట్టనున్నారు. ఈ పనులన్నీ రానున్న రెండేళ్ళలో పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సిఎండి తెలిపారు. పాత పోస్టాఫీస్ ప్రాంతం నుంచి పూర్ణామార్కెట్, జ్ఞానాపురం, కంచరపాలెం, మర్రిపాలెం, ఎనఎడి తదితర ప్రాంతాలన్నీ భూరగ్భ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం చేయనున్నట్టు పృధ్వీ తెలిపారు. భూగర్భ కేబుళ్ళు వేసే సమయంలో ఆయా ప్రాంతాల్లో కొంత అవస్థలు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపద్యంలో ప్రజల సహకారం అవసరమన్నారు. రెండేళ్ళ తర్వాత విశాఖ మహానగరంలో విద్యుత్ కేబుళ్ళు వేలబడే పరిస్తితి ఉండదన్నారు. అలాగే వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్‌ల ఆధునాతన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు.

## గ్యాస్ వినియోగదారులకు ఈ-కేవైసీ



**దీపం పథకం లబ్ధిదారుల్లో తీవ్ర గందరగోళం! -ఈ నెల 16 ఈ -కేవైసీకి ఆఖరి గడువు పొడిగించాలి**

విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త

రాష్ట్రంలోని వంటగ్యాస్ వినియోగదారులకు ఈ-కేవైసీ ప్రక్రియ మోయలేని భారంగా మారింది. గ్యాస్ ఏజెన్సీలు ఆగస్టు 16న ఈ-కేవైసీ పూర్తి చేయడానికి ఆఖరి గడువుగా నిర్ణయించడమే కాకుండా, ప్రక్రియ పూర్తికాని పక్షంలో గ్యాస్ సిలిండర్ డెలివరీని నిలిపివేస్తుండటంతో సామాన్య వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా 'దీపం' పథకం ద్వారా కనెక్షన్లు పొందిన వేలాది కుటుంబాలు ఈ నిబంధన వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

### పేరు మార్పు సదుపాయం లేక నష్టపోతున్న 'దీపం' లబ్ధిదారులు..

కోవిడ్ సంక్షోభ సమయంలో రాష్ట్రంలో అనేక కుటుంబాల్లో పెద్ద దిక్కును లేదా గ్యాస్ కనెక్షన్ కలిగిన వ్యక్తిని కోల్పోయిన సంఘటనలు అధికంగా ఉన్నాయి. ఇప్పుడు ఈ-కేవైసీ అప్‌డేట్ చేస్తుంటే, మరణించిన వారి పేర్లపై ఉన్న కనెక్షన్లు బయటపడుతున్నాయి. నిబంధనల ప్రకారం లబ్ధిదారుడు నేరుగా వేలిముద్రలు (బయోమెట్రిక్) లేదా ఐరిస్ సదుపాయం ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే కనెక్షన్ ఉన్న వ్యక్తి మరణించడంతో, ఆ కనెక్షన్‌ను కుటుంబంలోని ఇతర సభ్యుల పేరు మీదకు మార్చాలని వినియోగ దారులు ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు.

### సాఫ్ట్‌వేర్‌లో వెసులుబాటు కరువు..

ప్రస్తుతం గ్యాస్ కంపెనీలు సేవలు అందిస్తున్న సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌లో 'దీపం' పథకం కింద ఉన్న కనెక్షన్ల పేరు మార్పు (నేమ్ ట్రాన్స్‌ఫర్) ప్రక్రియకు సరైన ఆప్షన్ లేదా వెసులుబాటు లేకపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. ఆటోమేటిక్ క్యాన్సిలేషన్: ఈ-కేవైసీ కాకపోతే బుకింగ్ నిలిచిపోతోంది. **సిస్టమ్ పరిమితులు :** మరణ ధృవీకరణ పత్రాలు (డెత్ సర్టిఫికెట్స్) వారసత్వ పత్రాలు సమర్పించినప్పటికీ, ఏజెన్సీ నిర్వాహకులు పేరు మార్చలేకపోతున్నారు.

### చేతులెత్తేస్తున్న గ్యాస్ ఏజెన్సీలు.. ఏమీ చేయలేమని వెల్లడి

ఇటు పాత కనెక్షన్‌లో పేరు మార్చలేక, అటు అదే కుటుంబానికి కొత్త గ్యాస్ కనెక్షన్ మంజూరు చేయలేక గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. నిత్యం ఏజెన్సీల వద్దకు వచ్చి ప్రశ్నిస్తున్న వినియోగదారుల కు ఏం సమాధానం చెప్పాలో తెలియక నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **ఏజెన్సీల అసహాయత :** కనెక్షన్ కోల్పోయే ప్రమాదం ఉందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండటంతో, ఏజెన్సీ సిబ్బంది, నిర్వాహకులు వారికి సమాధానం చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు నిత్యావసరాల ధరలు మండిపోతున్న తరుణంలో, మరోవైపు అర్హులైన 8వ పేజీలో

## భోగాపురంలో ప్రత్యేక విమానం ల్యాండింగ్



8లో

**న్యూఢిల్లీ నుంచి వచ్చిన గంటా, సీఎం రమేష్**



## నేడు విశాఖ నగరానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాక

విశాఖపట్నం, ఆగస్టు 12.ప్రభాతవార్త



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం విశాఖ నగరంలో పర్యటించనున్నారు. ఇందుకోసం డిసీఎం 12వ తేదీ బుధవారం సాయంత్రం వాయు మార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుని ఒక హోటల్‌లో రాత్రి బస చేస్తారు. 13వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుండి కేంద్ర మంత్రులు, అధికారులతో కలసి రాడిసన్ బ్లూలో, ప్రపంచ ఏనుగుల దినోత్సవం (వరల్డ్ ఎలిఫెంట్ డే) సందర్భంగా జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం నుండి వాయు మార్గంలో విజయవాడ వెళతారు.

### ఢిల్లీ చేరిన పంచదార్ల పంచాయితీ

## విశాఖ జిల్లాలో అక్రమ మైనింగ్ అడ్డుకోండి

**లేకుంటే వారసత్వ సంపదకు తీవ్ర నష్టం -సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోండి -కేంద్ర గనుల మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన వైసీపీ బృందం**



## పోర్ట్‌ను సందర్శించిన భారత వైద్య పరిశోధనా మండలి శాస్త్రవేత్తలు

విశాఖపట్నం-ప్రభాతవార్త



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖ పట్నం నిర్వహిస్తున్న ఎం-కెరీర్ మేనేజ్‌మెంట్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్లో భాగంగా భారత వైద్య పరిశోధనా మండలికు చెందిన 44 మంది శాస్త్రవేత్తల బృందం బుధవారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీని సందర్శిం చింది. దేశంలోని ప్రముఖ మేజర్ పోర్టుల్లో ఒకటైన విశాఖపట్నం పోర్ట్ కార్యకలాపాలు, లాజిస్టిక్స్, మౌలిక వసతులు, వ్యూహాత్మక ప్రాధాన్యతపై ప్రత్యక్ష అవగా హన కల్పించడం ఈ సందర్శన ప్రధాన ఉద్దేశ్యం. ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలకు పోర్ట్ అధికారులు సాదర స్వాగతం పలికి, పోర్టు పనితీరు, పోర్ట్‌లో జరుగుతున్న వివిధ కార్యకలాపాలను వివరించారు. పోర్టులోని విస్తృత మౌలిక వసతులు, కార్గో నిర్వహణ కార్యకలా పాలు, లాజిస్టిక్స్ వ్యవస్థలు, 8వ పేజీలో

## మూడోసారి మెగా జాబ్ మేళా



8లో

**280 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరు -"ప్రతి ఇంటిలో ఒక ఉద్యోగం" : ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్**

## గీతం ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మశీ కోర్సులలో ప్రవేశాలు

విశాఖపట్నం-ప్రభాతవార్త

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ (బి.టెక్, ఎమ్.టెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్.ఫార్మశీ), ఆర్కిటెక్చర్ (బి.ఆర్క్, ఎమ్.ఆర్క్), మేనేజ్‌మెంట్ (ఎంబిఎ, బిబిఎ, బికామ్), సైన్స్ (ఎమ్మెస్సీ, బిఎస్సీ, ఎమ్‌సిఎ, బిసిఎ), లా కోర్సులు, హ్యుమానిటీస్, నర్సింగ్, ఫిజియోథెరిపి మరియు పారామెడికల్ కోర్సులలో 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతున్నాయని అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు.

### ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్ కోర్సులకు..

ఇంజనీరింగ్ కోర్సులతో పాటు బిఫార్మశీ, ఎమ్.ఫార్మశీ, బిఆర్క్, ఎమఆర్క్ కోర్సులలో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇంటర్మీడియట్ సైన్స్ కోర్సులతో పూర్తి చేసిన విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 4 సంవత్సరాల బిఎస్సీ (ఆనర్స్) కోర్సులు ఆడ్మిషన్ల డైరక్టర్ తెలిపారు. అలాగే 3సంవత్సరాల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిజి స్థాయిలో అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో పెరుగుతున్న ఉపాది అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విశాఖ ప్రాంగణంలో బిఎస్సీ మెడికల్ ల్యాబోరేటరీ టెక్నాలజీ, బిఎస్సీ ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజియోథెరిపి, నర్సింగ్ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి సంబంధించి పూర్తి వివరాల కోసం గీతం వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చునన్నారు.

# మూడోసారి మెగా జాబ్ మేళా

యలమంచిలి, ఆగస్టు12, ప్రభాతవార్త

యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో యలమంచిలి నియోజకవర్గంలో మూడోసారి మెగా జాబ్ మేళాను నిర్వహించారు.అచ్యుతాపురం మండలంలోని ఏపీ ఐని వన్ స్టాప్ సెంటర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ జాబ్ మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 280 మంది యువతీ యువకులు పాల్గొని వివిధ సంస్థల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఇంటిలో ఒక ఉద్యోగం ఉండాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అని అన్నారు. సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం ఉన్నప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా లభిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి అని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి వెనుకబడకూడదని, విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.

### భవిష్యత్ ప్రణాళికలు

యలమంచిలి నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తూ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మహిళల కోసం ఉమెన్స్ సెంటర్లను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన చోట సిఎస్ ఆర్ నిధులను వినియోగిస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

# పోర్టును సందర్శించిన భారత వైద్య పరిశోధనా మండలి శాస్త్రవేత్తలు

7వ పేజీ తరువాయి ..

దిగుమతి-ఎగుమతి కార్యకలాపాలు, పోర్టు ద్వారా కార్గో రవాణా విధానం తదితర అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పోర్ట్ అధికారులు శాస్త్రవేత్తలతో పరస్పరం చర్చించి, పోర్టు కార్యకలాపాలు, మౌలిక వసతుల అభివృద్ధి, లాజిస్టిక్స్, భారతదేశ వాణిజ్యం, ఆర్థికాభివృద్ధిలో పోర్టుల మారుతున్న పాత్రకు సంబంధించిన వారి సందేహాలను నివృత్తి చేశారు. పోర్ట్ సందర్శన సందర్భంగా లభించిన సాదర స్వాగతం, సమాచారపూర్వక పరస్పర చర్చ, పోర్టు కార్యకలాపాలు, మౌలిక వసతులు, లాజిస్టిక్స్ మరియు వ్యూహాత్మక ప్రాధాన్యతపై విలువైన అవగాహన కల్పించినందుకు ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ యాజమాన్యం, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వివరాలను పోర్ట్ కార్యదర్శి శంకరీబాబు మీడియాకు వెల్లడించారు.

# భోగాపురంలో ప్రత్యేక విమానం ల్యాండింగ్

విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకల సందడి మొదలైంది. వాస్తవానికి ఈనెల 17 వ తేదీ తర్వాత రెగ్యులర్ విమాన సర్వీస్ లు ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ ప్రకటించింది. అయితే ఆ సమయానికన్నా ముందే ప్రత్యేక విమానాల ల్యాండింగ్ మొదలైంది. ఢిల్లీ నుంచి భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ లు బుధవారం ప్రత్యేక విమానంలో భోగాపురం విమానాశ్రయంలో దిగారు.. మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు తదితరులు ప్రత్యేక విమానంలో వెళ్తూ కాకతాళీయంగా కలుసుకున్నారు. ఇక్కడ విమానాల టేక్ ఆఫ్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలను కల్పించారు. అలాగే విశాఖ నుంచి కనెక్టివిటీ కోసం మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఎలివేటెడ్ బీచ్ కారిడార్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఆర్టీసీ 16 ఎలక్ట్రికల్ బస్సులను భోగాపురం విమానాశ్రయం వరకు ఇప్పటికే ట్రయిల్ రన్ నడిపారు. మెట్రో కూడా సాధ్యమైనంత త్వరగా పట్టాలెక్కేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రత్యేక విమానాల రాకపోకలు మొదలవడంతో ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్ గా చెప్పుకునే భోగాపురం విమానాశ్రయం హడావిడి ప్రారంభమై సందడి షురూ అయ్యింది.

# రాజ్యసభలో 'కేరళం' బిల్లుకు మద్దతు తెలిపిన..

7వ పేజీ తరువాయి ..

రాజ్యాంగబద్ధమైన హోదా లభిస్తుందని పేర్కొన్నారు. కేవలం పేరు మార్పుగానే కాకుండా, ఇది ఆ రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించే చర్యగా అభివర్ణించిన ఆయన.. ఈ బిల్లు దేశంలో భిన్నత్వంలో ఏకత్వమనే స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తుందన్న విశ్వాసాన్ని సభలో వ్యక్తం చేశారు. మాతృభాషపై తమకు ఎనలేని మక్కువ ఉందని, భాషాభిమానానికి తమ పార్టీకి ఉన్న అనుబంధాన్ని విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం నందమూరి తారక రామారావు గారు తెలుగుదేశం పార్టీని స్థాపిస్తే, ఆ స్ఫూర్తిని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు బలంగా ముందుకు తీసుకెళ్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. అలాగే మలయాళ భాష, అక్కడి సినిమాల పట్ల కూడా తమకు ఎంతో గౌరవం ఉందని, ఎన్నో మలయాళ చిత్రాలు తెలుగులో అనువాదమై విశేష ఆదరణ పొందాయని అన్నారు. తోటి సభ్యుడు, ప్రముఖ హీరో సురేశ్ గోపి నటించిన ఎన్నో సినిమాలు తెలుగులో కూడా ఘన విజయం సాధించాయని గుర్తుచేస్తూ ఆయనపై ప్రశంసలు కురిపించారు. కేరళకు తెలుగు ప్రజలు విహారయాత్రల కోసం తరచూ వెళ్తుంటారని, అక్కడి ప్రజలు ఎంతో ఆత్మీయంగా స్వాగతం పలుకుతారని, వంటకాలు కూడా అద్భుతంగా ఉంటాయని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతికి మద్దతు తెలిపిన పార్లమెంట్ సభ్యులందరికీ ఎంపీ విజయ్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాజ్యాంగ విలువలపై కనీస అవగాహన లేని కొందరు వ్యక్తులు గతంలో అమరావతికి ముప్పు తెచ్చే ప్రయత్నం చేశారని పరోక్షంగా గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. అయితే, అత్యున్నత చట్టసభలో ఒక బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఎవరూ దానికి వ్యతిరేకంగా వెళ్లకూడదన్న రాజ్యాంగ స్ఫూర్తిని ఆయన గుర్తుచేశారు. ?దేశవ్యాప్తంగా ఉన్న వలసవాద పేర్లను పారద్రోలి, భారతదేశపు అసలైన మూలాలను, సంప్రదాయాలను కాపాడుతున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఎంపీ చింతకాయల విజయ్ ముక్తకంఠంతో ప్రశంసించారు. భారతీయ సంస్కృతికి బలాన్నిస్తున్న ప్రధానికి ఆయన ధన్యవాదాలు తెలియజేస్తూ, సభ ఈ కేరళ పేరు మార్పు బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరుతూ తన ప్రసంగాన్ని ముగించారు.

# గ్యాస్ వినియోగదారులకు..

7వ పేజీ తరువాయి ..

పేద కుటుంబాలు ఈ-కేవైసీ సాంకేతిక లోపాల వల్ల సబ్సిడీని, గ్యాస్ కనెక్షన్‌ను శాశ్వతంగా కోల్పోయే పరిస్థితి దాపరించింది. ఈ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 16 గడువును పొడిగించాలి. దీపం పథకం లబ్ధిదారుల్లో మరణించిన వారి వారసులకు కనెక్షన్ బదిలీ చేసేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్/వెసులుబాటును కల్పించాలి. కొత్త కనెక్షన్లు ఇచ్చే విధంగా గ్యాస్ ఏజెన్సీలకు మార్గనిర్దేశం ప్రభుత్వం చేయాలి. గ్యాస్ ఏజెన్సీల వద్ద ప్రత్యేక గ్రీవెన్స్ సెల్స్ ఏర్పాటు చేసి, ఈ సాంకేతిక సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి. ప్రభుత్వం, సంబంధిత గ్యాస్ కంపెనీలు వెంటనే జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకపోతే, వేలాది కుటుంబాలు వంటగ్యాస్ సదుపాయానికి దూరం కాక తప్పదని వంట గ్యాస్ వినియోగదారులు వాపోతున్నారు.

# విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

పీఎం పాలెం, ఆగస్టు 12, ప్రభాతవార్త



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వరరావు విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య, ఆరోగ్య సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈహెచ్‌ఆర్, అభా ఐడీ రిజిస్ట్రేషన్, ఐవీఆర్ఎస్ ద్వారా ఆసుపత్రి సేవలపై ప్రజల అభిప్రాయాలు, పబ్లిక్ పర్సెప్షన్, కేపీఐ ఇండికేటర్స్, ఆర్‌బీఎస్‌కే సేవలు, ఓపీ, ఐపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత, ఎఫ్ఆర్ఎస్ హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు వైద్య సేవలు సమర్థవంతంగా, సకాలంలో అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ వస్తా: గంటాతో సద్గురు జగ్గీ

విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త

విశాఖ అంటే తనకెంతో ఇష్టమని, త్వరలోనే అక్కడకు వస్తానని ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవన్ చెప్పారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఢిల్లీ విమానాశ్రయంలో కలుసుకున్నప్పుడు ఆయన ఈ విషయాన్ని తెలిపారు. 2014-19 మధ్యలో విద్యా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఈషా సంస్థలను నెలకొల్పడం కోసం సద్గురుతో కలిసి విశాఖ, విజయవాడలలో గంటా పర్యటించారు. ఆ విషయాలను సద్గురు గుర్తు చేసుకున్నారు. గతంలో ప్రతిపాదించినట్టు ఆదియోగి పేరుతో విశాఖలో ఆధ్యాత్మిక సంస్థ నెలకొల్పడానికి ఇప్పటికీ తనకు ఆసక్తి ఉందని సద్గురు చెప్పగా విశాఖ రావాలని గంటా ఆహ్వానించారు. తప్పకుండా వస్తానని, ఆ ప్రాంతమంటే తనకు ఎంతో ఇష్టమని వెల్లడించారు. గతంలో విశాఖ ఉత్సవ్‌లో తన కుమార్తె నృత్య ప్రదర్శన అంశాన్ని కూడా ప్రస్తావించారు.

# అనీమియా రహిత జిల్లా సాధనే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలి

**12X12 క్యాంపెయిన్ అమలును సమీక్షించిన జేసీ గొబ్బిళ్ల విద్యాధరి -12 ఏళ్ల వయస్సు విద్యార్థులకు కనీసం 12 పాయింట్ల హిమోగ్లోబిన్ ఉండాలి**

విశాఖపట్నం, ఆగస్టు 12 ప్రభాతవార్త



జిల్లాలోని పాఠశాల విద్యార్థులను రక్తహీనత బారి నుంచి బయటపడేసి, డిసెంబర్ -2026 నాటికి అనీమియా రహిత పాఠశాలలుగా తీర్చిదిద్దాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం చేపడుతున్న "12×12 క్యాంపెయిన్" అమలుపై బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. 12 సంవత్సరాల వయస్సు గల ప్రతి విద్యార్థిలో కనీసం 12 గ్రాముల హిమోగ్లోబిన్ స్థాయి ఉండేలా చూడడమే "12×12 క్యాంపెయిన్" ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటికే నిర్వహించిన తొలి విడత హిమోగ్లోబిన్ పరీక్షల ఫలితాలను పరిశీలించగా గణనీయ సంఖ్యలో విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు తేలిందని, దీని నివారణకు ఈ విద్యాసంవత్సరం ముగిసే నాటికి విద్యార్థులందరినీ అనీమియా రహితులుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పని చేయాలని పేర్కొన్నారు. రక్తహీనత తీవ్రతను బట్టి విద్యార్థులకు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా అందిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితిని నిరం తరం పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాలలో చురుకైన విద్యార్థులను హెల్త్ అంబాసిడర్లుగా గుర్తించి ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కింద అందిస్తున్న చిక్కీ, రాగిజావ వంటి పోషకాహార పదార్థాలను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తీసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రక్తహీనత వల్ల కలిగే దుష్పరిణామాలపై తల్లిదండ్రుల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఇందుకు వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖలు సంయుక్తంగా పనిచేయాలని సూచించారు. ప్రత్యేకంగా కౌమార బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించాలని పేర్కొన్న జాయింట్ కలెక్టర్, రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఐరన్ అవసరం వంటి అంశాలపై పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. డిసెంబర్ 2026 నాటికి విశాఖపట్నం జిల్లాను "అనీమియా రహిత పాఠశాలల జిల్లా"గా తీర్చిదిద్దేందుకు అన్ని స్థాయిల్లో సమన్వయంతో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్, ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.వి. రమణ, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పంపిణీ వ్యవస్థ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలి

**జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి**

విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త



ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నాణ్యమైన సరుకులు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, రేషన్ పంపిణీ, దీపం-2 పథకం, ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు, మీ మార్ట్ కార్యక్రమాల పురోగతిని ఆమె సమీక్షించారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ అమలులో ఎటువంటి లోపాలకు తావు లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 642 ఫెయిర్ ప్రైస్ దుకాణాల ద్వారా 5,28,863 రేషన్ కార్డులకు చెందిన సుమారు 16 లక్షల మంది లబ్ధిదారులకు సేవలు అందుతున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో రేషన్ సరుకుల నాణ్యత, సరఫరా, పంపిణీ ప్రక్రియలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జేసీ సూచించారు. అన్ని ఫెయిర్ ప్రైస్ దుకాణాల్లో ఈ-పాస్ విధానం సమర్థవంతంగా అమలవుతోందని, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే డోర్ డెలివరీ సేవలనుమరింత మెరుగు పరచాలని ఆమె సూచించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల న్నారు. ఐసీడీఎస్, ప్రధానమంత్రి పోషణ శక్తి నిర్మాణ్ పథకాల కింద పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సంక్షేమ హాస్టళ్లకు కేటాయించే బియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీపం-2 పథకం అమలులో అర్హులైన లబ్ధిదారులందరికీ సబ్సిడీ ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని, ఎల్పీజీ కనెక్షన్లకు సంబంధించిన సేవలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలని ఆమె పేర్కొన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ కింద రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాల పనితీరును సమీక్షించిన ఇంచార్జి కలెక్టర్, నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు వినియోగదారులకు అందించేందుకు చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా బహిరంగ మార్కెట్లో ధరల నియంత్రణకు తోడ్పాటు అందించాలన్నారు. అలాగే జిల్లాలో 75 ఫెయిర్ ప్రైస్ దుకాణాల్లో అమలు చేస్తున్న "మీ మార్ట్" కార్యక్రమాన్ని మరింత విస్తరించి, రేషన్ కార్డు దారులకు అవసరమైన నిత్యావసర వస్తువులు ఒకేచోట లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఫెయిర్ ప్రైస్ దుకాణాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందిం చడమే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికా రులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్వో భాస్కరరావు, ఏఎస్వో కళ్యాణి, సివిల్ సప్లైస్ డీఎం సృజన, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేశ్, లీగల్ మెట్రాలజీ ఏసీ రాధాకృష్ణ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, పలువురు డీలర్లు, చెకింగ్ ఇన్స్పెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# శస్త్రచికిత్సలపై సమ్మె ప్రభావం తీవ్రం

**ఓటీ జాబితాల కుదింపు -పలు సర్జరీలు వాయిదా -రెండో రోజు జూడాల సమ్మె కు అమావాస్య సెంటిమెంట్ సెగ -ఓపీ వైద్య సేవలపై పాక్షిక ప్రభావం -వార్డు వైద్య సేవాలకూ అంతరాయం సమ్మె కు ప్రభుత్వ వైద్యుల సంఘం మద్దతు**

విశాఖపట్నం, ఆగస్టు 12 ప్రభాతవార్త




స్టైఫండ్ పెంపు, ఇతర దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జూనియర్ వైద్యులు సంఘం (ఏపీజేయూడిఎ) ఇచ్చిన పిలుపు మేరకు ఆంధ్రా వైద్య కళాశాల పరిధిలోని కెజీహెచ్, విజీహెచ్, ప్రాంతీయ కంటి, ఈఎన్టీ,ఛాతి, మానసిక, రాణిచంద్రమణిదేవి తదితర ఎఎంసీ అనుబంధ ఆసు పత్రుల్లో జూనియర్ వైద్యులు రెండవ రోజు బుధవారం తమ సమ్మెను యధావిధిగా కొనసాగించారు. దశలవారీ నిరవధిక సమ్మెలో భాగంగా రెండో రోజు అన్ని అనుబంధ ఆసుపత్రులలో అత్యవసర వైద్య సేవలు మినహా అన్ని విభాగాల అవుట్ పేషెంట్(ఓపీ),వార్డు ఇతర సాధారణ వైద్యసేవలనుపూర్తి స్థాయిలో బహిష్కరించారు. అయితే రెండో రోజు బుధవారం జూనియర్ డాక్టర్లు సమ్మెకు అమావాస్య సెంటిమెంట్ సెగ తగిలింది. బుధవారం అమావాస్య, సూర్య గ్రహణం కారణంగా ఆసుపత్రులకు వైద్యం కోసం వచ్చిన రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దాని వల్ల ఆసుపత్రుల ఓపీ లకు, ఆసుపత్రి లో చేరేందుకు తక్కువ మంది రోగులు రావడంతో మధ్యాహన్నం పన్నెండు న్నరసమయానికేఅన్ని అనుబంధ అస్పత్రుల ఓపీ కౌంటర్లులో రోగులు రద్దీ బాగా తగ్గిపోయింది. ఫలితంగా బుధవారం నాటిఅన్ని రకాల ఓపీ వైద్య సేవలపైనా జూడాల సమ్మె ప్రభావం పాక్షికంగా కనిపించింది.ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఓపీ లో వైద్యులు కొరత కారణం గా మధ్యాహన్నాం దాటినా ఓపీ కౌంటర్లులో రోగుల రద్దీ తగ్గలేదు. మిగిలిన అన్ని ఆసుపత్రుల్లో ఓపీ సేవలపైన సమ్మె ప్రభావం పెద్దగా కనిపించలేదు. అయితే సాధారణ వార్డు వైద్య సేవల మాత్రం సకాలంలో అందక అన్ని వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు ఇబ్బందులును ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలోచిన్న పిల్లలు వార్డు వైద్యసేవలకు తీవ్రంగా అంతరాయము కలిగిందని రోగులు వాపోయారు. శస్త్ర చికిత్సలపై తీవ్ర ప్రభావం ఓటీ జాబితాల కుదింపు శస్త్ర చికిత్సలపై మాత్రం సమ్మె ప్రభావం బుధవారం తీవ్రంగా చూపింది.భోధనాసుపాత్రుల్లో శస్త్ర చికిత్సల సమయంలో పీజీ వైద్యులు జూనియర్ డాక్టర్లు ఆపరేషన్ దియేటర్లల్లో కీలకం గా వ్యవహారిస్తూ ఉంటారు.సమ్మె కారణంగా వారు విధులుకు దూరంగా ఉండడంతో రోజు వారీగా జరిగే ఆపరేషన్ల మీద కూడా సమ్మె ప్రభావం తీవ్రంగా కనిపించింది. ఫలితంగా ప్రతి ఆపరేషన్ దియేటర్లోను మాములు రోజులులో రోజువారీ జరిగిన ఆపరేషన్‌లలో సగం సర్జరీ లు మాత్రమే బుధవారం జరిగినట్టుతెలిసింది. వాటిలో కూడా అత్యవసర సర్జరీలు మినహా మిగిలిన సర్జరీ లను వాయిదా వేసినట్టు తెలిసింది. సమ్మె కారణంగా ఆమేరకు ఓటీ జాబితాలను కుదించుకున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా జూనియర్ డాక్టర్లు సమ్మెలో విధులను బహిష్కరించి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూఎఎంసీ, కేజీహెచ్ పరిధిలో నిరస ప్రదర్శన నిర్వహించారు. కేజీ హెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బైటయించి జూనియర్ డాక్టర్ల సమ్మెలో భాగంగా రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. జూనియర్ డాక్టర్ల సమ్మె కు రాష్ట్ర ప్రభుత్వవైద్యుల సంఘం నేతలు బుధవారం తమ మద్దత్తు ను ప్రకటించారు. సమ్మె కు ఎఎంసీ జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు దినకర్ సాయి శ్రీనివాస్. ఉపాధ్యక్షుడు రవీంద్ర కోశాధికారి డాక్టర్ సిరాజ్‌లు నాయకత్వం వహించారు.

# మత్తు వల.. సైబర్ మాయ.. రూట్ మారుస్తున్న నవతరం!

**పెడదారి పడుతున్న యువత ! -ఈజీ మనీ వ్యామోహం.. సింథటిక్ డ్రగ్స్, సైబర్ ముఠాల వలలో పసిడి భవిష్యత్తు -పబ్ కల్చర్, ఆన్లైన్ బెట్టింగ్‌ల ఉచ్చులో రూట్ మారుస్తున్న విద్యార్థులు**

గాజువాక,ఆగస్టు 12,ప్రభాతవార్త




నగరంలో శరవేగంగా మారుతున్న జీవనశైలి, సోషల్ మీడియా తెచ్చిపెడుతున్న ఆడంబరాలు, శ్రమ లేకుండా డబ్బు సంపాదించాలనే సులభ ఆలోచనలు నేటి తరం బంగారు భవిష్యత్తును చిదిమేస్తున్నాయి. నవ్యాంధ్రప్రదేశ్ విద్యా రాజధానిగా, ఉపాధి కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న విశాఖపట్నంలో కొందరు నవతరం యువకులు దారితప్పుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒక్కసారి అలవాటుపడితే జీవితాంతం కోలుకోలేని 'మత్తు, మాయ, మనీ'ల ముగ్గులోకి జారిపోతూ సొంత భవిష్యత్తుతో పాటు కుటుంబాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారు.

### అలవాటుగా మొదలై.. పెడ్లర్లుగా మారి!

జిల్లాలోని కొన్ని కళాశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో గంజాయితో పాటు ఎం డి ఎం ఎ వంటి అత్యంత ప్రమాదకరమైన సింథటిక్ డ్రగ్స్ సంస్కృతి విస్తరిస్తోంది. సరదాగా, స్నేహితుల ఒత్తిడితో మొదలయ్యే ఈ అలవాటు కొద్దిరోజుల్లోనే తీవ్రమైన వ్యసనంగా మారుతోంది. రోజువారీ మత్తు అవసరాలు తీర్చుకోవడానికి, దానికి అయ్యే ఖర్చుల కోసం చివరకు వీరే డ్రగ్స్ సరఫరా చేసే "పెడ్లర్లు"గా రూపాంతరం చెందుతున్నారు. పట్టుబడితే జీవితం జైలు పాలవుతుందని తెలిసి కూడా క్షణికావేశంలో ముఠాల వలలో చిక్కుకుంటున్నారు.

### కొద్దిపాటి కమీషన్ ఆశ.. సైబర్ బోనులో జీవితం!

ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు విశాఖ యువతను, ముఖ్యంగా నిరుద్యోగులు, విద్యార్థులను ప్రధాన లక్ష్యంగా చేసుకుంటున్నారు. "ఖాతా ఇస్తే నెలకు ఇంత కమీషన్ ఇస్తాం" అంటూ ఆశచూపి వారి బ్యాంక్ వివరాలను చేజిక్కించుకుంటున్నారు. ఇలాంటి మ్యూల్ అకౌంట్ల ద్వారా దేశవ్యాప్తంగా జరుగుతున్న వేల కోట్ల రూపాయల సైబర్ దోపిడీ సొమ్ము చేతులు మారుతోంది. ఖాతా తెరిచి ఇచ్చిన అమాయక విద్యార్థులు కేవలం కొన్ని వేల రూపాయల కమీషన్ కోసం చివరకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల పోలీసుల కేసులు, ఎఫ్ఐఆర్‌లలో ప్రధాన నిందితులుగా మారి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

### ఆన్లైన్ బెట్టింగ్‌లు.. రాత్రిపూట ఆడంబరాలు..

లేట్ నైట్ పార్టీలు, పబ్‌లు, విలాసవంతమైన ప్రదర్శనలకు అలవాటుపడి, తమ వద్ద లేని ధనాన్ని ప్రదర్శించేందుకు విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఆన్లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లలో త్వరితగతిన డబ్బు సంపాదించవచ్చనే ఆశతో ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. ఆపై చేసిన అప్పులు తీర్చడానికి దొంగతనాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ డీలరింగ్ వంటి అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు.

### ముందస్తు నిఘా..తల్లిదండ్రుల పర్యవేక్షణ..

పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు, వారు ఎవరితో తిరుగుతున్నారు, రాత్రివేళల్లో వారి కదలికలేమిటి అనేది తల్లిదండ్రులు గమనించాలి. ముఖ్యంగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి వస్తున్న అనుమానాస్పద లావాదేవీలపై కన్నేసి ఉంచాలి. పోలీస్ నిఘా కౌన్సెలింగ్: విద్యాసంస్థల సమీపంలో, హాస్టళ్ల వద్ద నిఘా పెంచడంతో పాటు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే తీవ్ర పరిణామాలపై విస్తృత స్థాయి అవగాహన సదస్సులు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# జాతీయ సహకార సవరణ బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు..

7వ పేజీ తరువాయి ..

తెలుగుదేశం పార్టీ తరపున రాజ్యసభలో ఎంపీ చింతకాయల విజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ బిల్లుపై సభలో ఆయన మాట్లాడుతూ సహకార సంస్థలను స్వయం సమృద్ధిగా, పటిష్టంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'సహకార్ సే సమృద్ధి' విజన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి అందించారని కొనియాడారు. 2021లో ప్రత్యేకంగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ప్రధానికి, అలాగే ఈ ఉద్యమానికి సంస్థాగత వేగాన్ని అందించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా కృషికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి రైతుల సహకార సంఘం పనితీరును ఆయన సభలో ఉదహరించారు. ఒక రైతు ఒంటరిగా మార్కెట్‌కు వెళితే బేరసారాలు ఆడే శక్తి పరిమితంగా ఉంటుందని, అదే రైతులు సహకార సంఘాల ద్వారా ఏకమైతే వారి బలం అనేక రెట్లు పెరుగుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులు కేవలం ఉత్పత్తిదారులుగానే మిగిలిపోకుండా సమీకరణ, ప్రాసెసింగ్, మార్కెట్ యాక్సెస్ వంటి వాటిలోనూ భాగస్వాములు అవుతారని విజయ్ వివరించారు. ప్రస్తుతం దేశంలో 8.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ సహకార సంఘాలు ఉండగా, వాటిలో 6.6 లక్షల సంఘాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయని ఎంపీ విజయ్ సభ దృష్టికి తెచ్చారు. దాదాపు 32 కోట్ల మంది సభ్యులతో గ్రామీణ భారతదేశంలో 98 శాతం మందికి ఇవి చేరువయ్యాయని, 30కి పైగా రంగాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా సుమారు 10 కోట్ల మంది మహిళలు ఇందులో భాగస్వాములయ్యారని తెలిపారు. 2014-2019 మధ్యకాలంలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు, కౌలు రైతులను కూడా సహకార రంగంలోకి తీసుకురావడంలో చంద్రబాబు పోషించిన అద్భుతమైన పాత్రను విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. 1962 నాటి సహకార చట్టాన్ని 2026 నాటి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కొత్త బిల్లు ద్వారా ఎన్‌సిడిసిని కేవలం వ్యవసాయం, రుణాలకే పరిమితం చేయకుండా ఫుడ్ ప్రాసెసింగ్, స్టోరేజ్, హెల్త్‌కేర్, ఎగుమతులు, విత్తనాలు, సేంద్రీయ ఉత్పత్తులు, డిజిటల్ సేవలతో పాటు మొబిలిటీ వంటి కొత్త రంగాలకు విస్తరిస్తుండటాన్ని ప్రశంసించారు. దీనికి ఉదాహరణగా, డ్రైవర్లను ఓనర్లుగా మార్చేలా జీరో కమిషన్‌తో పనిచేసే 'భారత్ టాక్సీ' అనే వినూత్న సహకార నమూనాను ఆయన ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ, అమిత్ షాలకు ఎంపీ విజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లోని సుమారు 91 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగు చేస్తున్న రైతులు ఇటీవల తీవ్రమైన ధరల పతనంతో ఇబ్బందులు పడ్డారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రంలోని గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఎంపీ విజయ్ ఒక కీలక సూచన చేశారు. ఎన్‌సిడిసి ద్వారా గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకంగా డెయిరీ కోఆపరేటివ్ ఫైనాన్సింగ్ విండోను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా పాల శీతలీకరణ కేంద్రాలు, టెస్టింగ్, కలెక్షన్ సెంటర్లతో పాటు పశుగ్రాసం, పశువైద్య సేవలు, సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడానికి వీలవుతుందని, ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు ఎంపీ చింతకాయల విజయ్ విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీ చేరిన పంచదార్ల పంచాయితీ

న్యూఢిల్లీ, ఆగస్టు 12, ప్రభాతవార్త



విశాఖపట్నం జిల్లాలోని పంచదార్ల పరిసరాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలపై కేంద్రం తక్షణం జోక్యం చేసుకుని, వాటిని నిలిపివేయాలని వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల బృందం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కోరింది. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సంరక్షిత ప్రాంతమైన బౌద్ధ పురావస్తు ప్రదేశమని, అలాగే ఇక్కడ పురాతన శ్రీ ధర్మలింగేశ్వర స్వామి ఆలయం కూడా ఉందని, వీటికి సమీపంలో భారీ ఎత్తున జరుగుతున్న క్వారీ కార్యకలాపాల వల్ల వీటికి తీవ్ర నష్టం కలుగుతోందని వైసీపీ ప్రతినిధులు కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. చారిత్రాత్మక ప్రాముఖ్యత కలిగిన ఈ వారసత్వ ప్రదేశాన్ని పరిరక్షించడానికి కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని వారు కోరారు. ఈ ప్రాంతంలో విచక్షణారహితంగా జరుగుతున్న క్వారీ కార్యకలాపాలు, తవ్వకాలు పురావస్తు ప్రదేశానికి ముప్పు కలిగిస్తున్నాయని, ఆ ప్రాంత పవిత్రతను, వారసత్వ స్వరూపాన్ని దెబ్బతీస్తున్నాయని వైసీపీ ప్రతినిధుల బృందం కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి తెలిపింది. ఇక్కడ జరుపుతున్న లోతైన తవ్వకాలు, పేలుళ్ల వల్ల బౌద్ధ క్షేత్రంలోని పురావస్తు అవశేషాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, శతాబ్దాల నాటి ఆలయం ప్రభావితం కావచ్చని బృందం ఆందోళన వ్యక్తంచేసింది. ఇటువంటి కార్యకలాపాలు పంచదార్ల కొండ భూగర్భ స్థిరత్వాన్ని కూడా దెబ్బతీసి, భూగర్భ జలాలు, సహజ మురుగునీటి వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపింది. కాబట్టి ఈ తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని కోరింది. ఆ ప్రదేశాన్ని పరిశీలించడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని, ఉల్లంఘనలు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన వైసీపీ ప్రతినిధుల బృందంలో ఎంపీలు గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, గుమ్మ తనుజారాణి, మద్దిల గురుమూర్తి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఉన్నారు. వెయ్యి కోట్ల కుంభకోణం: కరణం ధర్మశ్రీ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్‌ను ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కలిశామని, పంచదార్లలో పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లామని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. పంచదార్ల మైనింగ్ పరిశీలనకు కేంద్ర బృందాన్ని పంపుతామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. టిడిపి నేతలు రాష్ట్రంలో కొండలను ఇష్ట రాజ్యంగా కొల్లగొడుతున్నారని, పంచదార్లలో అక్రమ మైనింగ్ తో 1000 కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడుతున్నారని ధర్మశ్రీ ఆరోపించారు. ఈ దోపిడీకి సీఎం రమేష్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పంచదార్ల 82 కిలోమీటర్ల పరిధిజూరకై నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలన్నారు. కాగా, పంచదారల మైనింగ్ పరిశీలనకు కేంద్ర బృందాన్ని పంపుతామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ హామీ ఇచ్చారని తెలిపారు. పాండవులు నడయాడిన నేల పంచదార్ల. అక్కడ స్థానిక ప్రజలు భక్తితో పూజలు చేస్తుంటారు … ఐదు దారలు రాకుండా ఇష్టారాజ్యంగా మైనింగ్ చేస్తున్నారు.. సీఎం రమేష్, ఆయన మేనల్లుడు దౌర్జన్యంగా మైనింగ్ చేస్తున్నారు. అడ్డుకుంటే లారీలతో తొక్కించి చంపేస్తామని బెదిరిస్తున్నారు. అధికారులుచూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. మైనింగ్ పెద్దలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదుని ధర్మశ్రీ పేరర్కొన్నారు. దీనిపై ఎంపీ సీఎం రమేష్ స్పందించాలని డిమాండ్‌చేశారు.

vsp9:vsp9.qxd 12-08-2026 21:25 Page 1






## ఎగ్జోటిక్ కూరగాయల సాగుతో రైతులకు మరింత ఆర్థిక పురోగతి

దుంబ్రిగుడ, ఆగస్టు 12, ప్రభాతవార్త:



ఎగ్జోటిక్ కూరగాయల సాగుతో వ్యవసాయ రైతులకు మరింత ఆర్థిక పురోగతి సాధించగలరని డిఆర్డిఏ పిడి జైకృష్ణ చెప్పారు. సొవ్వ పంచాయతీ పరిధిలోగల దేముడువలస, గొప్పులవలస డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు ఎగ్జోటిక్ కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎగ్జోటిక్ కూరగాయల సాగు విధానం, విత్తనాల ఎంపిక, పంటల నిర్వహణ, దిగుబడులు, మార్కెటింగ్, తదితర అంశాలపై రైతులకు ఆయన స్పష్టంగా వివరించారు. ఎగ్జోటిక్ కూరగాయల విత్తనాలను సబ్సిడీ రూపంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతులు పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, మార్కెటింగ్ సదుపాయం కల్పించే బాధ్యతను తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అలాగే పండించిన కూరగాయలను భద్రపరచేందుకు స్టోరేజ్ భవన నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎగ్జోటిక్ కూరగాయల సాగు ద్వారా సాధారణ పంటలతో పోలిస్తే మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే రైతుల జీవనోపాధి మరింత మెరుగు పడుతుందని ఆయన రైతులకు వివరించారు. మండల మహిళా సమాఖ్య ఏపిఎం సుందరమ్మ, ఎఫ్‌పిఓ ఏపీఎం ఈశ్వరరావు, సీసీ శ్రీరా ములు, హెచ్ డి సిసి త్రినాథ్, సొవ్వ క్లస్టర్ సీసీ ఈశ్వరరావు, అల్లూరి సీతారామరాజు జిల్లా వివోల ఉపాధ్యక్షులు భాస్కరరావు, వివోలు కె. నాగేశ్వరరావు, కె. పార్వతీ, ఏ. నాగేశ్వరరావు , డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అడపవలస జిపిఎస్‌టిడబ్ల్యూ పాఠశాల తనిఖీ



దుంబ్రిగుడ, ఆగస్టు 12, ప్రభాతవార్త:

మండలంలోని అడప వలస జిపిఎస్ టి డబ్ల్యూ పాఠశాలను బుధవారం మండల విద్యాశాఖ అధికారి-2 జి గెన్ను తనిఖీ చేశారు. స్వయంగా విద్యార్థిని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహార రుచి, శుచి , పోషక విలువలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వంట గదిలో పాటించే శుభ్రత ప్రమాణాలు మెనూ అమలు తీరును పరిశీలించారు. ముందుగా విద్యార్థులు ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠ్యాంశాలకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థుల అభ్యాసన స్థాయి చదవటం, రాయటం, లెక్కలు చేసే సామర్థ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకున్నారు. విద్య ప్రమాణాలను పరిశీలించిన ఎంఈఓ -2 వారు ఉత్సహంగా సమాధానాలు చెప్పటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల రికార్డులు, మౌలిక వసతులు, మరుగుదొడ్ల నిర్వహణలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు విలువైన పలు రకాల సలహా సూచనలను అందించారు. సిడబ్ల్యూఎస్ఎన్ ఏ. కిరణ్ పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రచార కార్యక్రమాలు

### 10 నుంచి 15 వరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో..

పాడేరు, ఆగస్టు12,ప్రభాతవార్త:



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రచార కార్యక్రమాలను అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు విస్తృతంగా నిర్వహిస్తు న్నారు. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు, యువత, ప్రభుత్వ సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనీ కలెక్టర్ టి. నిశాంతి పిలుపునిచ్చారు.

## రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయండి

### సర్వే శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వీఎస్ఎన్.కుమార్

పాడేరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:



భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సర్వే శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.ఎన్. కుమార్ ఆదేశించారు. బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరం నందు జిల్లా సర్వే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత పారదర్శకంగా అందించేందుకు రెవెన్యూ, సర్వే అధికారులు కృషి చేయాలని ఆయనసూచించారు. సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఆయా శాఖల అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతలుగా ఈ రీ సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మొత్తం 1400 గ్రామాలలో రీ సర్వే చేయుటకు నిర్ణయించి మొదట విడతగా 493 గ్రామాలు సర్వే ప్రారంభించడం జరిగిందన్నారు. రెండవ విడతలో 454, మూడో విడత 450 గ్రామాలలో సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటి విడత లోని 493 గ్రామాల్లో 96 గ్రామాలు విస్తీర్ణం 24,640 ఎకరములు రీ సర్వే పూర్తి అయ్యిందన్నారు.11 మండలాల పరిధిలో సర్వేయర్లకు, రీ సర్వే డీటీలకు రెవెన్యూ సేవలకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిబంధదల మేరకు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిడి హరికృష్ణ, జిల్లా సర్వే అధికారి ఈశ్వర దొర, డిఐఓఎస్ జి.వెంకటరావు, సునీల్ వరాహలరావు సిల్వర్ లైన్ టెక్నో సొల్యూషన్స్ ప్రతినిధి, సర్వే శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 13 కొత్త 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలు ప్రారంభం

పాడేరు,ఆగస్టు12,ప్రభాతవార్త:



జిల్లా లో 13 నూతన తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, పాత వాహనాల స్థానంలో నూతన వాహనాల పునరుద్ధరణ, రెండు విడతల్లో మొత్తం 23 వాహనాల ఆధునీకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ వాహనాలు రోజుకు సగటున 50 మంది బాలింతలు, నవజాత శిశువులకు సురక్షిత ఉచిత రవాణాప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, నవజాత శిశువులను సురక్షితంగా ఇళ్లకు చేర్చే ఉచిత రవాణా సేవల కోసం కేటాయించినట్లు 13 కొత్త 'తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను బుదవారం జిల్లా కలెక్టర్ టి.నిశాంతి షాంతి.మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇతర అధికారులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ప్రస్తుతం నడుస్తున్న పాత వాహనాల స్థానంలో ఈ నూతన వాహనాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా మొత్తం 23 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి, మాజీ ఎంపీపీలు బొర్ర విజయ రాణి, రమణమూర్తి, జిల్లా వైద్యారోగ్య అధికారి పాల్గొన్నారు.



## న్యాయ విజ్ఞాన సదస్సు

పాడేరు,ఆగస్టు12,ప్రభాతవార్త:

పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, ప్రథమ శ్రేణి జుడిషియల్ మెజిస్ట్రేట్ పాడేరు ఏ.రాము ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో విద్యార్థులకు న్యాయ సంబంధిత విషయాలపై అవగాహన కలిగించారు. నేటి విద్యార్థులకు న్యాయవిద్య కూడా ఎంతో అవసరం. సమాజంలో మనం ఎదుర్కొంటున్న అనేక విషయ పరిష్కారాల కొరకు న్యాయ విజ్ఞాన సదస్సు పరిష్కారం చూపిస్తుందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ సిహెచ్ రమాదేవి, వర్మ మహేష్ క్రాంతి కుమార్ జయలక్ష్మి హదస ప్రవీణ సంజీవరావు మన్మధరావు అరుణ్ విశ్వనాథం, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు

అనకాపల్లి, ఆగస్టు 12, (ప్రభాతవార్త):



చినరాజుపేటలో వేంచేసియున్న శ్రీ చౌడేశ్వరి, సాంబశివ దేవాలయంలో ఆషాఢ అమావాస్య బుధవారం చౌడేశ్వరి అమ్మవారి వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయం ఐదు గంటల నుండి అభిషేకములు, 108 కలిశాభిషేకం కుంకుమ పూజలు, సంకీర్తనలు అలాగే అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో అశేష భక్తుల సమక్షంలో ఎంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. భక్తుల విరాళంతో చౌడేశ్వరి సాంబశివుల ఊరేగింపునకు రథము తయారుచేసి ప్రారంభించారు. కార్యక్రమంలో చౌడేశ్వరి సాంబశివ దేవాలయ కమిటీ , ప్రధాన అర్చకులు కొమళ్ళపల్లి నందన్ శర్మ అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గోడ పత్రికలు, కరపత్రాలు ఆవిష్కరణ



పాడేరు,ఆగస్టు 12, ప్రభాతవార్త:

అంతర్జాతీయ యువజన దినోత్సవం ఆగస్టు 12 పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా హెచ్ఐవి/ఎయిడ్స్ పై ప్రజలు, యువతలో సమగ్ర అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. బుధవారం పాడేరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.నిశాంతి , జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఇతర జిల్లా అధికారులతో కలిసి హెచ్ఐవి నివారణ, వివక్ష నిర్మూలన , వ్యాప్తి నిరోధక చర్యలపై రూపొందించిన ప్రత్యేక గోడపత్రికలు (పోస్టర్లు), సమాచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు, ఆర్డీవో భుజంగరావు, జిల్లా వైద్యాధిక శాఖ అధికారి, ఎన్సిడి అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 100% డిజిటల్, ఆర్థిక సంతృప్త గ్రామాలుగా ప్రకటన

పాడేరు,ఆగస్టు12,ప్రభాతవార్త;



అల్లూరి జిల్లా పాడేరు మండలంలోని లిలికిండంగి, అడ్డుమాండ, సంగోడి గ్రామాలను 100% డిజిటల్ మరియు ఆర్థిక సంతృప్త గ్రామాలు గా జిల్లా కలెక్టర్ టి. నిషాంతి ప్రకటించారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో కిండంగి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన డిజిటల్ మరియు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఈ ప్రకటన చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, బీమా, పెన్షన్ తదితర ఆర్థిక సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, డిజిటల్ చెల్లింపులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోనారి రత్నకుమారి, మాజీ ఎంపీపీ బొర్ర విజయరాణి, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ మాధురి, మతూ నాయుడు, ఎంపీడీఓ రమేష్, మండల తహశీల్దార్ శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ బాలకృష్ణ, బ్యాంక్ మేనేజర్లు భాను శేఖర్, నారాయణరావు, ప్రజాప్రతినిధులు, బ్యాంకు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్లకి ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగింపు



గూడెంకొత్తవీధి, ఆగస్టు 12, ప్రభాతవార్త:

మండలం దామనాపల్లి పంచాయతీ దొడ్డికొండ-2 గ్రామంలో స్వచ్ఛ భారత్ (స్వచ్ఛతా) కార్యక్రమంలో భాగంగా జెసిబితో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి ఆర్. లక్ష్మి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పేసా కార్యదర్శి మాదిరి చంటిబాబు, వెటర్నరీ అసిస్టెంట్ సత్యనారాయణ, క్లాప్ మిత్రులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అభ్యర్థులకు 17న ప్రత్యేక శిక్షణ తరగతులు

పాడేరు,ఆగస్టు12,ప్రభాతవార్త;



గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈ నెల 10న అరకు వ్యాలీ లో నిర్వహించిన ఆదివాసీ ఉత్సవాల సందర్భంగా చేసిన ప్రకటన మేరకు, త్వరలో డీఎస్సీ పరీక్ష జరగనున్న నేపథ్యంలో పాడేరు డివిజన్ పరిధిలోని డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు.ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు పాడేరులోని శంకరన్ ఆడిటోరియంలో ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. గతంలో డీఎస్సీ పరీక్షల్లో టాపర్లుగా నిలిచి, ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఈ ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు పరీక్షా సన్నద్ధత, పరీక్షా విధానం, ముఖ్యమైన అంశాలు, మెరుగైన ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై వారు మార్గదర్శకత్వం అందించనున్నారని తెలిపారు. డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఈ నెల 17న శంకరన్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు జరిగే శిక్షణ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై ప్రయోజనం పొందాలని కలెక్టర్ కోరారు.

## హై పవర్ కమిటీలో ఉద్యోగస్తులను నియమించొద్దు



పాడేరు,ఆగస్టు12,ప్రభాతవార్త:

ప్రభుత్వ ఉద్యోగులు లేదా ప్రభుత్వం నుంచి వేతనాలు/జీతాలు పొందే వారిని హైపవర్ కమిటీలో నియమించవద్దు. ప్రభుత్వనికి అనుకూలంగా మరే అవకాశం ఉంది.ఇప్పటికే ఉద్యోగస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆ సమయంలో ప్రభుత్వానికి సరందర్ అయిపోతారూ. ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామనీ కో ఆర్డినేటర్ కూడ రాధ కృష్ణ స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హైపవర్ కమిటీ ఏర్పాటు కోసం నిర్వహించిన సమావేశం నుండి బహిష్కరించారు.. అనంతరం గిరిజన సంఘం కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివిధ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విధి విధానాలు స్పష్టంగా ప్రకటించకుండానే "హైపవర్ కమిటీ" పేరుతో ఆదివాసి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తున్నాం.జీఓ నెంబర్ 3 రిజర్వేషన్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం ఇంకా అన్వేషించకుండా, 1/70 చట్ట రక్షణ కోసం సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకుండా, కొంతమంది ఉద్యోగ సంఘ నాయకులు, జేఏసీ నాయకులను ప్రలోభాలకు గురిచేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాం.అల్లూరి జిల్లాలోనే హైపవర్ కమిటీ ఏర్పాటు చేయడం, మిగతా జిల్లాల్లో ఎలాంటి కమిటీలు ఏర్పాటు చేయకపోవడం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన, ప్రజా సంఘాలను పూర్తిగా విస్మరించడం దారుణం. ఇది ఆదివాసులకు ద్రోహం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగమేనని భావిస్తున్నామన్నారు. హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కాంగు సుభ, ఆదివాసి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ ఐమావతి, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతల నాగేశ్వరరావు, వాలంటర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సత్యారావు, కిలో రాజారావు, నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఖర్జవై కుమార్, భాను సిహెచ్ రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తిక్ శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాంగి చిన్నారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వంతల కృష్ణ , ఆదివాసి సేన నాయకులు చుంచు రాజబాబు, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు కిల్లో రాజారావు, సిఐటియు జిల్లా నాయకులు శంకర్రావు, గిరిజన గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఆర్ బాలికల కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన

గూడెంకొత్తవీధి, ఆగస్టు 12, ప్రభాతవార్త :



మండలంలోని ఏ.పీ.డబ్ల్యూ. ఆర్ బాలికల కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చింతపల్లి డీఎస్పీ తిరుమలరావు, జీకే వీధి సీఐ సుధాకర్, ఎస్ఐ సురేష్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మహిళలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను వినియోగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకూడదని సూచించారు. భావితరాల నిర్మాణంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినుల శారీరక ద్రుడత్వం పెంపొందించేందుకు పోలీసు శాఖ తరఫున వాలీబాల్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి పై ఆయా దండన..తల్లిదండ్రుల ఆవేదన



గూడెంకొత్తవీధి, ఆగస్టు 12, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారిపై ఆయా దండనకు దిగుతు న్నారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణ పేరుతో వారిపై మొరటుగా ప్రవర్తిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలంటేనే భయపడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టలని బాధిత చిన్నారుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆగస్టు 15న మండల కేంద్రంలో సైకిల్ ర్యాలీ

గొలుగొండ, ఆగస్టు 12, ప్రభాతవార్త:

స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆగస్టు 15 మండల కేంద్రంలో భారీ సైకిల్ ర్యాలీ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. ఆగస్టు 15 ఉదయం 9 గంటల కల్లా మండల కేంద్రం చేరుకోవాలన్నారు. 80వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సైకిల్ ర్యాలీ ఏర్పాటు చేస్తున్నామని ప్రజా ప్రతినిధులు, యువతీ, యువకులు, ఉద్యోగులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. 80 ఏళ్ల స్వతంత్ర వేడుకల్లో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ఆయన అన్నారు.

## గోవాడ షుగర్‌కు గ్రహణం!

### రైతులకు రూ.30 కోట్ల బకాయిలు.. కార్మికులకు వేతనాలూ కరువు



బుచ్చయ్యపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త :

ఒకప్పుడు వేలాది మంది చెరకు రైతుల కుటుంబాలకు అండగా నిలిచిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ నేడు సంక్షోభంలో చిక్కుకుందని జాతీయ రైతు పరిరక్షణ సమితి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆడారి కన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ పరిధిలో 2024-25 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి సుమారు రూ.30 కోట్ల చెరకు బకాయిలు రైతులకు చెల్లించకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు.34 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 20 భారీ చెరకు కాటాలు ఉన్నాయని, సుమారు 23,500 మంది రైతులు, 60 మంది ఉద్యోగులు, 300 మంది ఎన్ఎంఆర్ కార్మికులు ఫ్యాక్టరీపై ఆధారపడి జీవిస్తున్నారని కన్నారావు పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ఫ్యాక్టరీ 'బంగారు బాతు'లా రైతుల కుటుంబాలకు ఆదా యాన్ని అందించేదని, నేడు అదే ఫ్యాక్టరీలో బకాయిలు, వేతనాల సమస్యలు నెలకొనడం బాధాకరమన్నారు.

## శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా...ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు

### మంజూరు పత్రాలు అందజేసిన చింతకాయల పద్మావతి



గొలుగొండ ఆగస్టు 12, ప్రభాతవార్త:

తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా మండలంలో ఆలయాలు నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. పప్పుశెట్టిపాలెం, ఏఎల్‌పురం గ్రామాల్లో రెండు దేవాలయాలు మంజూరు పత్రాలను ఆయా గ్రామాల టిడిపి నాయకులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు అందజేశారు. నిర్మాణానికి 40 లక్షలు చొప్పున రెండు ఆలయాలకు 80 లక్షల మంజూరయ్యాయని అన్నారు. పప్పు శెట్టిపాలెంలో రామాలయం, ఏ ఎల్ పురంలో భక్త మార్కండేయ ఆలయం నిర్మించేందుకు నిధులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. ఎన్నో ఏళ్లగా ప్రజల నిరీక్షణకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చారని 40 లక్షల రూపాయలు మంజూరు కావడంపై గ్రామ నాయకులు ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు చిటికెలు తారక వేణుగోపాల్, అనకాపల్లి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రాయిపురెడ్డి నాని బాబులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు జాలుమూరి రాజేష్, మాజీ సర్పంచ్ బొడ్డేటి రాజు బాబు, దట్టిం వెంకటరమణ, అప్పలనాయుడు, చంటి, రాజు, బ్రహ్మయ్య, బంగారు బాబు, ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల స్వచ్ఛతే లక్ష్యంగా స్వచ్ఛ పదం

గొలుగొండ, ఆగస్టు 12, ప్రభాతవార్త:

గ్రామాలన్నీ స్వచ్ఛంగా ఉండాలని సంకల్పంతో ప్రతి బుధవారం స్వచ్ఛ పదం కార్యక్రమం ద్వారా పరిశుభ్రత కార్యక్రమం చేపడుతున్నట్లు. ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు అన్నారు. గొలుగొండ పంచాయతీ శివారు గ్రామం శ్రీరాంపురంలో బుధవారం స్వచ్ఛ పదం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సహకారంతో మరింత మెరుగైన పారిశుద్ధ్య కార్యక్రమాలు జరగాలని అన్నారు. ప్రతినిత్యం సమకూర్ చెత్తను తడి పొడి వేరుచేసి చెత్తబుట్లలో వేయాలని సూచించారు. సేకరించి సంపత్ కేంద్రాలకు తరలించే కార్యక్రమం చేపడతామని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని క్లాస్ మిత్రులకు సహకరించి గ్రామాలను స్వచ్ఛంగా ఉంచేందుకు చేయి చేయి కలుపుదామని ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ అధికారి, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కల్లాల వద్ద దాహం తీరేలా!

### జడ్పీటీసీ దొండా రాంబాబు చొరవతో సీఏల్సీ నుంచి మంజూరు

బుచ్చయ్యపేట, ఆగస్టు 12, ప్రభాత వార్త :



గ్రామంలో యాదవులు కల్లాల వద్ద తాగునీటి ఇబ్బందులు పడకుండా బోరు ఏర్పాటు చేసినట్లు జడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. తన సిఫార్సుతో సీఏల్సీ నుంచి బోర్‌వెల్ మంజూరు చేయించినట్లు ఆయన పేర్కొన్నారు.కల్లాల వద్ద తాగునీటి సదుపాయం లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి బోరు మంజూరుకు చర్యలు తీసుకున్నట్లు రాంబాబు తెలిపారు. గ్రామంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ప్రాంతాలను గుర్తించి మరిన్ని బోర్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. బోర్‌వెల్ మంజూరుకు సహకరించిన సీఏల్సీ ప్రతినిధులకు జడ్పీటీసీ దొండా రాంబాబు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆటో డ్రైవర్ మృతి

(నక్కపల్లి, ప్రభాతవార్త)ఆగస్టు 12:

మండలంలోని అడ్డు రోడ్డు జాతీయ రహదారి పై ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి హఠాత్తుగా వాహనం ఆగడంతో ఆటో అదుపుతప్పి కిందపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11న రాత్రి 7.30 గంటల సమయంలో ఎస్ రాయవరం మండలం తిమ్మాపురం శివారు కోన వాణి పాలెం కి చెందిన కోనరాజు ( 38) తుని నుంచి అడ్డరోడ్డు వైపు వస్తున్న ఆటో జాతీయ రహదారి ఆనుకునున్న శ్రీనివాసులు లాడ్జి ఎదురుగా ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ రాజు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నారు.

## రాజయ్యపేట ఎంజెపి పాఠశాల తాత్కాలిక భవనం పరిశీలన



(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని రాజయ్యపేటలో నూతనంగా ఏర్పాటు చేయనున్న మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) పాఠశాల భవనాన్ని బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన గదులు, శౌచాలయాలు, వంట గది, భోజన శాలలతో పాటు మంచినీటి వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మిగిలి ఉన్న పనులను త్వరిత గతిన నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే ప్రవేశాలు ప్రారంభమవుతాయని, మత్స్యకారులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలకు అవసరమైన వసతులను త్రాగునీటిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ సి ఎస్ ఆర్ నిధులు ద్వారా కృషి చేయాలని హెటీరో ప్రతినిధులు ఎస్. కుల్లయ్య రెడ్డి, శర్మ తదితరులతో మాట్లాడారు. సి ఎస్ ఆర్ నిధుల ద్వారా పాఠశాల అభివృద్ధికి సహకరించేందుకు ముందుకు వచ్చిన హెట్టిరో సంస్థను అభినందించారు. గ్రామానికి వచ్చిన జిల్లా కలెక్టర్ దృష్టికి మా గ్రామానికి చెందిన మత్యకారులు పది సమస్యలు తెలియజేశారు. మత్స్యకార భృతి పది మందికి రావాల్సిన రూ.20 వేల నగదు సాయం అందలేదని ఎంపీటీసీ పీక్కి సత్తయ్య, తదితరులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మత్స్యకారులు వినతిని తెలుసుకున్న కలెక్టర్ పరిష్కారం చూపుతా మని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని ఉద్దండపురం లోని ఉన్న పైలెట్ తాగునీటి ప్రాజెక్టు పనుల ను తనిఖీ పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి ట్యాంకుల నిర్మాణం, ప్రాజెక్టు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ) రామస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) అనిల్‌ను కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) రామలక్ష్మి, డీఈఈ జయరాం, ఎంఆర్ఓ చిన్నికృష్ణ, ఇంచార్జ్ ఎంపీడీఓ దెందుకూరి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ



(నక్కపల్లి,ప్రభాతవార్త) :

మండలంలో ఉన్న అంగన్వాడి కార్యకర్తలకు స్థానిక బాలురు ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి పైన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ నరేష్‌తో పాటు గణేష్ , ప్రసాద్ , రమేష్ లు శిక్షణ ఇచ్చారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ సత్యవతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎండి నిషా ఉన్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



ఆనందపురం, ఆగస్ట్ 12, ప్రభాతవార్త

క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షబీనా భాను సూచించారు. ఆనందపురం గ్రామ సచివాలయంలో టీబి ఎన్ఎంపీ 2.0పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షబీనా భాను మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, కఫం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. క్షయ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు మందులను క్రమం తప్పకుండా పూర్తి కోర్సు తీసుకోవాలని చెప్పారు. క్షయ వ్యాధి ప్రధానంగా గాలి ద్వారా వ్యాపించే అవకాశం ఉన్నందున రోగులు దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు నోరు, ముక్కును కప్పుకోవాలని, ఇళ్లలో గాలి, వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా క్షయ వ్యాధిని నియంత్రించవచ్చని షబీనా భాను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పిఎన్ సౌందర్య, ఆరోగ్య కార్యకర్త రత్నకుమారి, కె.లక్ష్మణమూర్తి, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో వంద శాతం సంతృప్తి ఫలితాలు సాధించాలి

ఆనందపురం, ఆగస్టు 12, ప్రభాతవార్త



ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ప్రతి నెలా పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (ఐవిఆర్ఎస్)లో 100 శాతం సంతృప్తి ఫలితాలు సాధించేలా సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర సెర్ప్ (సోషల్ సెక్యూరిటీ పెన్షన్స్) డైరెక్టర్ బి.సుధాకరరావు సూచించారు. ఆనందపురం మండలంలోని 18 స్వర్ణ గ్రామం విద్య, సంక్షేమ సహాయకులతో బుధవారం వేములవలస స్వర్ణ గ్రామంలో పింఛన్ల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు నెలలుగా పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్లో వరుసగా ప్రతికూల ఫలితాలు నమోదైన వేములవలస గ్రామాన్ని సుధాకరరావు సందర్శించి, పరిస్థితులపై ఆరా తీశారు. గ్రామంలో సుమారు 15 మంది పింఛన్ లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి పింఛన్ పంపిణీపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సిబ్బంది సకాలంలో ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తున్నారని, పంపిణీ సమయంలో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారని, ఎలాంటి అదనపు డబ్బులు వసూలు చేయడం లేదని లబ్ధిదారులు తెలిపారు. అయితే ఐవిఆర్ఎస్లో ప్రతికూల ఫలితాలు ఎందుకు వస్తున్నాయనే అంశంపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించి, స్వర్ణ గ్రామం విద్య, సంక్షేమ సహాయకులకు అవసరమైన అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శిని రాష్ట్ర సెర్ప్ డైరెక్టర్ ఆదేశించారు. పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా, పారదర్శకంగా, మర్యాదపూర్వకంగా సేవలందించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇన్చార్జ్ ఎంపీడీఓ పి.వి. రత్నం, స్వర్ణ గ్రామ పంచాయితీ, స్వర్ణ వార్డ్ డిప్యూటీ ఎంపీడీఓ జి.ఏ.వి. శ్రీరామ్మూర్తి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక శాస్త్రాలపై పునరాలోచన అవసరం

### గీతం సంవాద్లో ప్రొఫెసర్ సుజాత పటేల్

విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త



సామాజిక శాస్త్రాలలో శతాబ్దాలుగా వస్తున్న విదేశీ ఆధిపత్యాన్ని వదిలి సామాన్య మానవుడి రోజువారీ జీవన అనుభవాలకు ప్రతిభింబంగా ఉండేలా మార్పు చేసుకోవాలని హైదరా బాద్ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్, ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ సుజాత పటేల్ పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో మానవీయ, సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంవాద్ ఉపన్యాసంలో భాగంగా ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐరోపా, ఉత్తర అమెరికా దేశాల్లో ఆవిర్భవిం చిన సిద్ధాంతాలు మాత్రమే ప్రపంచ మొత్తానికి ప్రామాణికం కావని పేర్కొన్నారు. బ్రిటిష్ కాలంనాటి పాలన భారతీయ సమాజంపై ఎంతటి విపరీతమైన ప్రభావం చూపిందో వివరించారు. బ్రిటిష్ పాలకులు తమ పాలిట అనుకూలంగా సమాజాన్ని రెండు కృత్రిమ రంగాలుగా విభజించారని ఆమె పేర్కొన్నారు. మొదటిది ఆర్థిక, రాజకీయ, వ్యాపార లావాదేవీలతో కూడిన బహిరంగం కాగా రెండవది కులం, మతం, తెగలు, కుటుంబ కట్టుబాట్లతో కూడిన వ్యక్తిగత లేదా సాంప్రదాయ రంగం అని తెలిపారు. ఈ రకమైన కృత్రిమ వర్గీకరణ ద్వారా భారతదేశాన్ని కేవలం ప్రాచీన ఆచారాల్లో నిలిచిపోయిన ఒక వెనకబడిన సమాజంగా నాటి బ్రిటీష్ పాలకులు చిత్రీకరించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి భారతీయ ప్రజలు ఎదుర్కొన్న వాస్తవిక అనుభవాలను నాటి పాలకులు పూర్తిగా మరుగున పరిచారని దీనివల్ల భారతదేశం సొంతంగా ఆధునికతను సాధించలేని దేశంగా అపార్థం చేసుకోబడిందని ఆమె స్పష్టం చేశారు. ప్రాశ్చాత్య పరిశోధనా నమూనాలను యధాతదంగా అనుకరించడం వల్ల స్థానిక సామాజిక వాస్తవాలను అర్థం చేసుకోవడంలో లోపం ఏర్పడుతోందన్నారు. శతాబ్ధాలుగా పేరుకుపోయిన ఈ మేధోపరమైన పరాధీనత నుండి బయటపడటానికి పరిశోధకులు, విద్యార్థులు, పౌరులు "పెరిఫెరల్ గేజ" లేదా పరిధీయ దృష్టిని అలవాటు చేసుకోవాలని ప్రొఫెసర్ పటేల్ ఉద్బోధించారు. పాశ్చాత్య ప్రమాణాలపైన పూర్తిగా అధారపడకుండా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల (గ్లోబల్ సౌత్) ప్రజల నిజజీవిత పోరాటాలు, విజ యాలు, చారిత్రిక అనుభవాల దృక్కోణం నుండి ప్రపంచాన్ని వీక్షించడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఐరోపా నమూనాలను అనుకరించకుండా మన స్థానిక చరిత్ర సంస్కృతులను వాటి సొంత ప్రతిపాదికన అర్థం చేసుకోవడమే నిజమైన మేధో విముక్తి అని ఆమె పునరుధ్ఘాటించారు. విశ్వవిద్యాలయాల సరిహద్దులు దాటి ప్రజా పోరాటాలు, సాధారణ ప్రజల అనుభవాల ఆధారంగా నూతన సామాజిక శాస్త్రాలను నిర్మంచడమే నిజమైన మేధో స్వాతంత్ర్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గీతం హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ సుష్మాస్వరాజ్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 100 శాతం 'డోర్ టు డోర్' పూర్తి చేసిన 26 బూత్ల నాయకులకు ఘన సత్కారం

విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త



'ఇంటింటికీ ప్రగతి సందేశం' కార్యక్రమంలో భాగం గా వంద శాతం డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయ వంతంగా పూర్తి చేసి ఆదర్శంగా నిలిచిన 26 బూత్ల నాయకులు, ఇంచార్జ్లు, కార్యకర్తలను చింతకాయల పద్మావతి ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సత్కరిం చారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ ఆదేశాల మేరకు, టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సందేశాన్ని చేరవేస్తూ.. అత్యంత క్రమశిక్షణ, సమన్వయం, అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ పద్మావతి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు సత్కారంతో పాటు ప్రత్యేక విందు భోజనాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఇప్పటికే 26 బూత్లలో వంద శాతం లక్ష్యాన్ని చేరుకోగా, ఇదే స్ఫూర్తితో మిగిలిన ప్రతి బూత్లోనూ వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని వారు పిలుపునిచ్చారు.

## చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్గా హరి వెంకట రమణ

విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాతవార్త



విశాఖ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటి ఛైర్మన్గా బి.హరి వెంకటరమణ నియమతులయ్యారు. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా డాక్టర్ డి.ఉదయ్ కుమార్, ఎస్.శ్యామ్కుమార్, పి.రాజేశ్వరిలను నియమించారు. నగరానికి చెందిన హరి వెంకటరమణ గత ఇరవై సంవత్సరాలుగా బాలలకు సంబంధించిన అంశాలపై పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో పని చేశారు. ఆయనకు 2012 సంవత్సరానికి గాను జాతీయ యువజన అవార్డు అందుకున్నారు. 2022లో పిల్లల అంశాలపై అమెరికా అధ్యయన యాత్ర చేశారు. మానవ అక్రమ రవాణాపై పుస్తకాన్ని రచించారు. పిల్లలకు సంబందించిన పలు నెట్వర్క్, ఫోరమ్స్ లో ఆయన సభ్యులుగా వున్నారు. పిల్లల అంశాలపై పత్రికలలో అనేక వ్యాసాలు రచించారు. పలు పుస్తకాలు ఎడిట్ చేసారు. బాల్య వివాహాల నిరోధం, బాలల అక్రమ రవాణా, పిల్లల విద్య, సంరక్షణ అంశాలపై వినూత్నంగా విశాఖలోని మురికివాడల్లో, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పనిచేసారు.

## డీఎస్సీపై వైకాపావి తప్పుడు ఆరోపణలు: ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక,ఆగష్టు 12,ప్రభాతవార్త



డీఎస్సీ నియామకాలపై వైకాపా నాయకులు తప్పుడు, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని గాజు వాక తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు మండిపడ్డారు. పాత గాజువాక పార్టీ కార్యాలయంలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తుంటే, అభ్యర్థుల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో నిరుద్యోగులు పడిన ఇబ్బందులను ప్రజలు మరచిపోలేదని, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని వారు ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా డీఎస్సీని రాజకీయాలకు వేదికగా మార్చవద్దని హితవు పలికారు. మేధావులు మండిపడుతున్నా వైకాపా నేతల్లో మార్పు రావడం లేదని, 2029లో ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు శివ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు బైపిల్లి గాంధీ, కొయిలాడ శంకరరావు, దొడ్డి సత్యారావు, వెంకటేశ్వరరావు, సింగంపల్లి దేముడు, రాజు, ఏదూరి రాజేష్ పాల్గొన్నారు.

## పసుపులేటి బాలరాజును కలిసిన ఇల్లపు రాము

గాజువాక,ఆగష్టు 12,ప్రభాతవార్త



వైకాపా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇల్లపు రాము.. మాజీ మంత్రి, నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు గాను ఆయనకు శాలువా కప్పి, పూలదండతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా నిలుస్తూ, గాజువాకలో పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రగఢ వేణుబాబు, ముద్దపు దామోదర్, గుంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలు



గాజువాక,ఆగష్టు 12,ప్రభాతవార్త

గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలని, ప్రజా చైతన్య వేదికలని జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పద్మశ్రీ ఎస్.ఆర్. రంగ నాథన్ 135వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను క్రమబద్ధీకరించి, విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దిన ఘనత 'గ్రంథాలయ శాస్త్ర పిత' రంగనాథన్దేనన్నారు. ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రంగనాథన్ ప్రతిపాదించిన ఐదు సూత్రాలు సమాజ విజ్ఞానానికి ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి, జె.ఆదినారాయణ, పరమేశ్వరి, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

### ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు

మాధవధార, ఆగస్టు 12, ప్రభాతవార్త



ముఖ్యమంత్రి సహాయని చెక్కులను ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు బుధవారం పంపిణీ చేశారు. ఉత్తర నియోజక వర్గం మాధవధారలో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు వారి ఇంటికి వెళ్లి చెక్కులను అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను రామకృష్ణకు రూ.1,71,000, మదన్ మోహన్కు రూ.92,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం పొందేందుకు ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉంటే, తమ సమస్యను తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు సనపల కీర్తి, సనపల వరప్రసాద్, కూన వెంకట్రావు, పద్మజ, లోహిత్ రావు, పృధ్వి, రామకృష్ణ, సుజాత, సనపల రామకృష్ణ, లలిత, బంగారు రాజు, గోపాల్ రావు, దిలీప్, కార్తీక్, రాంబాబు, పాతూరి చౌదరి, అధిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేతో జర భద్రం ..

### మందుతాగి స్టేషన్లో ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు - రైల్వే అస్థుల పరిరక్షణ కోసం రక్షణ గోడ ఏర్పాటు




జ్ఞానాపురం, ఆగస్టు 12 , ప్రభాతవార్త

రైల్వే పరిసరాల్లో అసంఘటిక కార్యక్రమాలు నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు రైల్వే ఉన్నతాదికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు చూసి చూడనట్టు వ్యవహరించిన రైల్వే పోలీసులు రైల్వే ఆస్థులు, ఇతరత్రా వాటిపై సీరియస్గా ఉండే అవకాశాలు ఉన్నాయి. తాజాగా రైల్వే బోర్డు విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం దేశ వ్యాప్తంగా 19700 కిలోమీటర్ల రైల్వే ట్రాక్లకు రక్షణ కవచం ఏర్పాటు చేయనున్నారు. రైల్వేకు ప్రత్యేక భద్రతను కల్పించడంలో భాగంగా ఈ రక్షణ కల్పి స్తున్నట్టు అదికారులు తెలిపారు. రైల్వే ఆస్తులు తస్కరించడం, రైల్వేకు సంబందించిన ఏవైనా పాడు చేసినా అలాంటి వారిపై చర్యలు తీసుకోనున్నారు. విశాఖ రైల్వేలో రక్షణ వ్యవస్థ మరింత పటిస్టంగా నిర్వహిం చేందుకు చర్యలు చేపడుతున్నట్టు అదికారులు తెలిపారు. రైల్వే ఆస్తుల సమీపంలో మద్యం సేవించి పట్టుబడి నప్పటికీ వారిపై చర్యలు తప్పవన్నారు. అధికారులతో దురుసుగా వ్యవహారించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు అదికారులు చెబుతున్నారు. రాష్ట్రస్థాయిలో సెక్యూరిటీ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు పర్యవేక్షణ బాధ్యతలు కూడా కమిటీ నిర్వహించనున్నట్టు అదికారులు చెబుతున్నారు. ఈ కమిటీకి డిజిపి స్థాయి అధికారి చైర్మన్గా వ్యవహారించనున్నారు. తొలిదశలో దేశంలోని బీహార్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న సుమారు 19వేల 700 కిలోమీటర్ల పరిధిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఏపిలో ప్రధాన కేంద్రమైన విశాఖలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. రైల్వే పరిసర ప్రాంతాల్లో మద్యం సేవించడం, రైల్వే గోడల వెంబడి అసంఘటిత కార్యక్రమాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు రైల్వే తీసుకోనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

## జ్ఞానపురంలో డెంగ్యూ కేసు నమోదు.. అప్రమత్తమైన వైద్య సిబ్బంది

### జ్ఞానపురంలో డెంగ్యూ కేసు.. లార్వా నిర్మూలనకు చర్యలు

పీఎం పాలెం, ఆగస్టు 12, ప్రభాతవార్త



సౌత్ జోన్ 41వ వార్డు జ్ఞానపురం ప్రాంతంలో 8 ఏళ్ల బాలుడికి డెంగ్యూ జ్వరం నిర్ధారణ కావడంతో జిల్లా మలేరియా అధికారి జి. వరప్రసాద్రెడ్డి, సహాయ మలేరియా అధికారి బి. నాగభూషణరావు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాలుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. అనంతరం బాలుడి ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో లార్వా కోసం తనిఖీలు చేపట్టారు. ఇంట్లో వినియోగిస్తున్న కుండలో లార్వా గుర్తించి వెంటనే నిర్మూలించారు. సమీపంలోని మరో ఇంట్లో ఫ్రిజ్ వెనుక ఉన్న తొట్టిలో కూడా లార్వా గుర్తించి తొలగించారు. ప్రజలకు కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తూ, లార్వాను ప్రత్యక్షంగా చూపించి దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి తొలగించాల్సిన ఆవశ్యకతను వివరించారు. స్థానిక ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, జీవీఎంసీ, మలేరియా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. లార్వా నిర్మూలన చర్యలను నాణ్యతతో నిర్వహించడంతో పాటు వెంటనే స్ప్రేయింగ్ చేపట్టాలని ఆదేశించారు. పరిసర ప్రాంతంలోని 100 నుంచి 200 ఇళ్లలో ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరపీడితులు, అనుమానిత కేసులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సబ్ యూనిట్ సిబ్బంది, జీవీఎంసీ, మలేరియా సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్



విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త

దేశభక్తి స్ఫూర్తిని చాటేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్ పిలుపునిచ్చారు. బుధవారం బి ఎస్ లేఔట్ లో గల ఆమె క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకోనున్న నేపథ్యంలో ఆమె విశాఖలో మాట్లాడారు. 2022లో 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించామని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు జాతీయ జెండా ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. ఆన్లైన్ పోర్టల్ ద్వారా కూడా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చని చెప్పారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎర్రకోట వద్ద 'వందేమాతరం' గీతాన్ని పూర్తిగా ఆలపించనున్నట్లు తెలిపారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని అన్నారు. 2030లో భారత్లో కామన్వెల్త్ క్రీడలు నిర్వహించనున్నట్లు సుహాసిని ఆనంద్ పేర్కొన్నారు.

## రైల్వే స్టేషన్లో ఎమర్జెన్సీ మెడికల్

విశాఖపట్నం, ఆగస్టు 12 ప్రభాతవార్త

విశాఖ రైల్వే స్టేషన్లో ఎమర్జెన్సీ మెడికల్ రూమ్ను బుధవారం డీఆర్ఎం లలిత్ బొహారా ప్రారంభించారు. రైల్వే, పినాకిల్ హాస్పిటల్ సంయుక్తంగా విశాఖ రైల్వే స్టేషన్లో ఈ ఎమర్జెన్సీ మెడికల్ రూమ్ను ఏర్పాటు చేశారు. అనంతరం డీఆర్ఎం లలిత్ బొహారా మాట్లాడుతూ విశాఖ రైల్వే స్టేషన్లో పినాకిల్ హాస్పిటల్తో కలిసి ఈ ఎమర్జెన్సీ మెడికల్ రూమ్ను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 24 గంటలూ నర్సింగ్ స్టాఫ్, మధ్యాహ్నం సమయంలో వైద్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రయాణ సమయంలో అనారోగ్యానికి గురైన వారికి నామమాత్రపు ఛార్జీలతో వైద్యం అందిస్తామన్నారు. ప్రమాదానికి గురైన ప్రయాణికులకు ఉచిత వైద్యం అందిస్తారన్నారు. విశాఖ, విజయనగరం రైల్వే స్టేషన్లలో ఎమర్జెన్సీ మెడికల్ రూములు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్లో మరిన్ని రైల్వే స్టేషన్లలో ఈ రూమ్ ఏర్పాటు చేస్తామని వివరించారు.

## నేటి నుండి 3 రోజులు ఇళ్లపై జాతీయజెండా

### కాళీమాత గుడి వద్ద గురువారం ఉదయం 7 గంటలకు ర్యాలీ -ఈ నెల 14న తిరంగా ర్యాలీ -ఇంచార్జ్ కలెక్టర్ జి. విద్యాధరి

విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త



80వ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా దేశ భక్తిని పెంపొందించే పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగా ఈ నెల 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇంచార్జ్ కలెక్టర్ జి.విద్యాధరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ఉదయం 7గంటలకు కాళీమాత గుడి వద్ద నుండి జిల్లా స్థాయిలో తిరంగా ర్యాలీ జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ రాలీ లో జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ ర్యాలీ కోసం జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ తిరంగా ర్యాలీలను జిల్లాలోని అన్ని మండలాల్లో, జోనల్ స్థాయిలో నిర్వహించా లని, విద్యార్థులు, యువత, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రతి ఇంటిపై,వాణిజ్య సంస్థలపై, ప్రభుత్వ కార్యాలయాలపై రాబోయే 3 రోజుల పాటు (13 నుండి 15 వరకు) జాతీయ జెండా ఎగురవేసి ఉంచాలని, 14వ తేదీ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొవాలని, ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లు త్రివర్ణ విద్యుత్ దీపాలతో అలంకరించాలని, 15వ తేదీన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొవాలని కోరారు.

## ఏపీజేఎఫ్ విశాఖ జిల్లా కన్వీనర్గా రవికాంత్

### కో-కన్వీనర్లుగా పీఏ రావు, నాగేశ్వరరావు, దుర్గా ప్రసాద్

### -ఉమ్మడి విశాఖ అడహాక్ కమిటీ ప్రకటించిన ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు






విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా అడహాక్ కమిటీ కన్వీనర్గా సీనియర్ జర్నలిస్టు బి.రవికాంత్, కో-కన్వీనర్లుగా పి.ఏ.రావు, వై.నాగేశ్వరరావు, వి.దుర్గాప్రసాద్ నియమితుల య్యారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం ఫౌండర్ చెవుల కృష్ణాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షులు శివ రాజేష్ ఈ అడహాక్ కమిటీని బుధవారం ప్రకటించారు. నగరంలోని మేఘాలయ హోటల్లో జరిగిన సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా అడహాక్ కమిటీని వారు ప్రకటించారు. త్వరలో జరగబోయే విశాఖ ఉమ్మడి జిల్లా మహాసభ ఏర్పాట్లు, కార్యక్రమాలను ఈ ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని వారు చెప్పారు. ఈ సందర్భంగా వారిరివురూ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళున్న సంఘం ఏపీజేఎఫ్ అని అన్నారు. వ్యక్తిగత లబ్ధి తమ ధ్యేయం కాదని, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీజేఎఫ్ కన్వీనర్ గా నియమితులైన సీనియర్ జర్నలిస్టు బి.రవికాంత్ మాట్లాడుతూ ఏపీజేఎఫ్ మహాసభను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులందరూ సహకరించాలని కోరారు.త్వరలోనే మహాసభ వేదిక, తేదీ ప్రకటిస్తామని చెప్పారు.

## విశాఖలో హెచ్ఐవీ-ఎయిడ్స్పై చైతన్య యాత్ర ప్రారంభం



విశాఖపట్నం, ఆగస్టు 12, ప్రభాతవార్త

హెచ్ఐవీ/ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు విశాఖపట్నం జిల్లాలో 'హెచ్ఐవీ/ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర' ప్రచార రథాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వరరావు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం లక్ష్యాల సాధనలో భాగంగా ఈ ఎల్ఈడీ ఐఈసీ ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కరదీపికలు, అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ ప్రచార రథం 15 రోజుల పాటు జిల్లాలోని వివిధ మండల కేంద్రాలు, పట్టణాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో పర్యటించనుంది. వాహనంలోని ఎల్ఈడీ తెరల ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ, పరీక్షలు, చికిత్స, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆరోగ్య సేవలపై వీడియోలు, యానిమేషన్ల ద్వారా అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా డా.జగదీశ్వరరావు మాట్లాడుతూ తల్లి నుంచి బిడ్డకు సంక్రమించే హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి వ్యాధుల నివారణపై ప్రత్యేక అవగాహన అవసరమన్నారు. గర్భం నిర్ధారణ అయిన వెంటనే ప్రతి గర్భిణీ మొదటి మూడు నెలల్లో హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షలు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లి ఆరోగ్యాన్ని, శిశువు భద్రతను కాపాడటంతో పాటు సకాలంలో చికిత్స ప్రారంభించవచ్చన్నారు.

### ప్రచారం ప్రధాన లక్ష్యాలు

హెచ్ఐవీ, ఎయిడ్స్పై ప్రజల్లో సమగ్ర అవగాహన పెంచడం. హెచ్ఐవీ వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలపై ప్రజలకు సమాచారం అందించడం. కండోమ్, లైంగిక వ్యాధుల పరీక్షలు, చికిత్స తదితర ఆరోగ్య సేవలను ప్రజలు వినియోగించుకునేలా ప్రోత్సహించడం. హెచ్ఐవీ/ఎయిడ్స్ (నివారణ, నియంత్రణ) చట్టం-2017పై అవగాహన కల్పించి బాధితులపై ఉన్న కళంకం, వివక్షను తగ్గించడం. వివిధ ప్రభుత్వ శాఖలు, భాగస్వామ్య సంస్థల సమన్వయంతో హెచ్ఐవీ నివారణ కార్యక్రమాలను బలోపేతం చేయడం. "ప్రతి ఒక్కరూ ఈ ప్రచారాన్ని సద్వినియోగం చేసుకుని హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలి. ముందస్తు నిర్ధారణ, సకాలంలో చికిత్స ద్వారా హెచ్ఐవీని నియంత్రించవచ్చు" అని అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డా. రోణంకి రమేష్, జిల్లా సూపర్వైజర్ భద్రీ, ఆరోగ్య శాఖ సిబ్బంది, దిశా టీం, టీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రజలందరూ సహకరించి అవగాహన ప్రచారాన్ని విజయవంతం చేయాలని జిల్లా యంత్రాంగం కోరింది.

13-8Pg7exHMNWJQE.qxd:13-8Pg7exHMNWJQE.qxd 1/1/02 6:21 AM Page 1



## సాయికృష్ణ లాకప్ డెత్ కేసు...
# సిట్ అదుపులో హోంగార్డు

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రౌడీ షీటరు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో పనిచేసే హోంగార్డును సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హోంగార్డు వెంకటరాజును అధికారులు ప్రశ్నిస్తున్నారు. స్టేషన్‌లోని సిసి కెమెరాల డేటా తొలగించాడని హోంగార్డుపై ఆరోపణలు ఉన్నాయి. సిఐ నాగరాజు ఆదేశాలతోనే డివిఆర్ తొలగించినట్లు సిట్ గుర్తించింది. అలాగే లాకప్‌డెత్ కేసులో కీలక ఆధారమైన సిసి ఫుటేజ్ ధ్వంసం చేశారని గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి సిట్‌కు హోంగార్డు అనుమ్యామైన సమాచారం అందించినట్లు తెలుస్తోంది.

## జిజిహెచ్‌లో జూనియర్ వైద్యుల సమ్మె ఉధృతం
### అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలకు విరామం..
### ఉపకార వేతనం పెంచాలని డిమాండ్

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 12:(ప్రభాత వార్త)** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం చేపట్టిన సమ్మె బుధవారం ఉధృతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో జూనియర్ వైద్యులు అత్యవసరం కాని వైద్య సేవలను నిలిపివేసి నిరసన కొనసాగిస్తున్నారు. అత్యవసర చికిత్సలు, అత్యవసర శస్త్రచికిత్సలు, అత్యవసర విభాగాల్లో సేవలను మాత్రం కొనసాగిస్తున్నారు. దీంతో సాధారణ వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ ఉపకార వేతనాన్ని పెంచాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు మించకుండా చూడాలని కోరారు. జాతీయ వైద్య మండలి నిబంధనల ప్రకారం ఎంఎస్సీ, పీహెచ్‌డీ నియామకాలు 15 శాతానికి లోపే ఉండాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని, తమ సమస్యలపై ప్రభుత్వం పునరాలోచించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ వైద్యులకు ఆంధ్రప్రదేశ్ కంటే సుమారు 30 శాతం అధికంగా ఉపకార వేతనం అందుతున్నట్లు తెలిపారు. సమ్మె కొనసాగుతున్నప్పటికీ అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సేవలు అందిస్తున్నామని ఈశ్వర్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం త్వరగా సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతిపాదన ఏమిటంటే..జూనియర్ వైద్యుల డిమాండ్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం వార్షిక ప్రాతిపదికన ఉపకార వేతనం పెంచే ప్రతిపాదనను చర్చల్లో ఉంచినట్లు సమాచారం. ఇందులో పీజీ వైద్యులకు సంవత్సరానికి 3 శాతం, ఇంటర్న్‌లకు 5 శాతం చొప్పున పెంపు ప్రతిపాదించినట్లు వెల్లడైంది. అయితే రెండేళ్లకు 15 శాతం, ప్రస్తుతం 30 శాతం పెంపు కోరుతున్న జూనియర్ వైద్యుల సంఘం ఈ ప్రతిపాదనపై సంతృప్తి చెందలేదు. దీంతో చర్చలు ఫలించలేదు. ప్రభుత్వం-వైద్యుల మధ్య కుదరని ఏకాభిప్రాయం...సమ్మె నేపథ్యంలో జూనియర్ వైద్యుల ప్రతినిధులు వైద్య విద్యాశాఖ ఉన్నతాధికారులతో వరుసగా చర్చలు జరిపారు. సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించినప్పటికీ రెండు రోజుల చర్చల్లోనూ స్పష్టమైన నిర్ణయం రాకపోవడంతో ఆందోళనను కొనసాగించాలని సంఘం నిర్ణయించింది. రోగులపై ప్రభావం..జీజీహెచ్‌కు ప్రతిరోజూ గుంటూరు జిల్లాతో పాటు పల్నాడు, బాపట్ల, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. జూనియర్ వైద్యుల సమ్మెతో సాధారణ వైద్య సేవలు మందగించడంతో వైద్యుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొంతమంది రోగులు చికిత్స వాయిదా వేసుకోవాల్సి వస్తుండగా, మరికొందరు ప్రత్యామ్నాయ వైద్య సేవలను ఆశ్రయించాల్సి వస్తోంది. జూనియర్ వైద్యుల డిమాండ్లు-ప్రభుత్వ ప్రతిపాదనల మధ్య వ్యత్యాసం తొలగి, త్వరగా పరిష్కారం లభించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సంఘం హెచ్చరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తుండగా, రోగులకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర వైద్య సేవలు కొనసాగించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

## సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీ
### గంజాయి స్వాధీనం... ఐదుగురు మహిళలు అరెస్టు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,** ఆగస్ట్ 12 (ప్రభాతవార్త): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్లో బుధవారం జి.ఆర్.పి పోలీసులు జరిపిన తనిఖీలలో గంజాయి రవాణా సాగిస్తున్న ఐదుగురు మహిళలు పట్టుబడినట్లు జి అర్ పి రాజమండ్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఎస్ఐ వాసు తెలిపారు. సామర్లకోట రైల్వే స్టేషన్ లో గంజాయి రవాణా కబడుతున్న సమాచారం మేరకు రైల్వే స్టేషన్లో తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. స్థానిక రైల్వే స్టేషన్లోని ప్లాట్ఫారం నెంబర్ రెండు, మూడులో కొందరు మహిళలు అనుమానాస్పదంగా కనిపించటంతో పూర్తి స్థాయి తనిఖీలు నిర్వహించామన్నారు. ఆ మహిళల వద్ద ప్లాస్టిక్ బ్యాగ్ లలో 60 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. దీని విలువ సుమారు 4 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. రైల్వే ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ ఎస్ ఐ వాసు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న మహిళలలు నెల్లూరు జిల్లా బిట్రగుంట ప్రాంతానికి చెందిన వారని, వారినీ అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టులో ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. పట్టుబడిన గంజాయి సుమారు 30 లక్షలు పైగా విలువ ఉంటుందని పోలీసులు గుర్తించారు.

## వరికి బీమా గడువు ఇక నాలుగు రోజులే!..

**విజయవాడ.,ఆగస్టు 12, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు ఈ నెల 15తో ముగియనుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి సాగు రైతులు పంటల బీమాలో నమోదు చేసుకోవటానికి ఇదే చివరి అవకాశం. గడువు లోగా బీమా ప్రీమియం చెల్లిస్తే.. ఈపంట నమోదు వివరాలను తర్వాతైనా చేయించుకోవచ్చని వ్యవసాయ శాఖ తెలిపింది. ముందస్తు పంటల బీమాకు ఈపంట నమోదు అవసరం లేదని స్పష్టం చేసింది. కేవలం పంట సాగుపై స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి, గడువులోగా బీమా ప్రీమియం చెల్లిస్తే చాలని పేర్కొంది. ఎల్.నినో పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కోసం ప్రతి రైతు పంటల బీమాలో నమోదు కావాలని సూచించింది. కాగా, పప్పు ధాన్యాల కొనుగోలుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఫార్మర్ ఐడీ క్యూఆర్ కోడ్ను డౌన్లోడ్ చేసుకుని, రిజిస్టర్ చేయించుకోవాలని సూచించింది.

## విద్యుత్ ఉచ్చుకు అటవీశాఖ ఆఫీసర్ బలి



**బూర్గంపహాడ్, ఆగస్టు 12 ప్రభాతవార్త:** అడవి జంతువులను అక్రమంగా వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చు అటవీశాఖ ఉద్యోగి ప్రాణాలను బలిగొంది. వన్యప్రాణుల వేటకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు అందిన సమాచారంతో సంఘటనా ప్రాంతానికి వెళ్లిన బీట్ ఫారెస్ట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) బానోతు నవీన్ విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందిన విషాద ఘటన బూర్గం పహాడ్ మండలం నకిరేపేట గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసు కుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నకిరేపేట గ్రామపరిధిలో కొంతమంది వ్యక్తులు అడవి జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారు లకు సమాచారం అందింది. దీంతో డీఆర్ఓ కురుసం అనార్కలి, ఎఫ్‌బీఓ బానోతు నవీన్‌తో పాటు అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని విద్యుత్ తీగలను గుర్తించడంతో పాటు సంబం ధిత వ్యక్తుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు ఎఫ్‌బీఓ బానోతు నవీన్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. అక్రమ వేటను అడ్డుకునే విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన ఉద్యోగి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడంతో అటవీశాఖలో విషాదం నెలకొంది. నవీన్ మృతికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్ష్మీ ్మపురం గ్రామానికి చెందిన ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్ఓ కురుసం అనార్కలి బుధవారం బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ఆర్టీసి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఆధునిక వైద్య పరీక్షల సదుపాయం

### నూతన ల్యాబ్ పరికరాలను ప్రారంభించిన ఆర్టీసి ఎండి

**విజయవాడ, ఆగస్టు 12 (ప్రభాతవార్త):** ఆర్టీసి ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఆధునిక వైద్య పరీక్షలు నిర్వహించేందుకు రూ.22 లక్షలతో విజయవాడ, విద్యాధరపురంలోని ఆర్టీసి ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను ఆర్టీసి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బాలసుబ్రహ్మణ్యం బుధవారం ప్రారంభించారు. ఈ పరికరం సహాయంతో ఆర్టీసి ఉద్యోగులకు ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. థైరాయిడ్ ప్రొఫైల్స్, మెదడులో ఏర్పడే కణతులు, అడ్డంకులు, గుండె రక్త నాళాలలో ఏర్పడే అడ్డంకులను పరీక్షి ంచడం, విటమిన్ పరీక్షలు, వైరల్ మార్కర్లు, మధుమేహం (షుగర్) పరీక్షలు ఫాస్టింగ్, ఇన్సులిన్, మధుమేహ రకాల గుర్తింపునకు సహకారం, వివిధ ఇన్ఫెక్షన్ వ్యాధుల మార్కర్ల పరీక్షలు, రక్తంలోని ఔషధ స్థాయిల పరీక్షలు, రక్త నమూనాలోని అతి స్వల్ప పదార్థాలను గుర్తించే పరీక్షలు. ఈ వైద్య పరికరాల ద్వారా నిర్వహిస్తారు. ఆర్టీసి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ హాస్పిటల్‌లో అధునాతన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగానే ఈ నూతన పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బాలసుబ్రహ్మణ్యం ఈ సందర్భంగా తెలిపారు. ఈ పరికరం అందుబాటులోకి రావడంతో పలు ముఖ్యమైన వైద్య పరీక్షలను ఆర్టీసి ఆసుపత్రిలోనే నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని, తద్వారా ప్రైవేటు ప్రయోగశాలలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో పాటు సమయం, వైద్య పరీక్షలపై అయ్యే ఖర్చు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ పరికరం ద్వారా 99 శాతానికి పైగా ఖచ్చితత్వంతో పరీక్షా ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ఒకేసారి 60 నమూనాలను 30 నిమిషాల్లో, ఒక గంటలో 100 నమూనాల వరకు పరీక్షి ంచే సామర్థ్యం ఈ పరికరానికి ఉంది. దీంతో వ్యాధులను ముందుగానే గుర్తించడం, సరైన చికిత్సను నిర్ణయించడం, వేగవంతమైన వైద్య నిర్ధారణ అందించడం ద్వారా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో ఆర్టీసిఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కె.ఎస్.బి. రెడ్డి (అడ్మిన్), జి.వి.రవివర్మ(ఇంజినీరింగ్), ఎస్.టి.పి. రాఘవ కుమార్(ఆపరేషన్స్), ఛీఫ్ మెడికల్ ఆఫీసర్డా. ఆర్. శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ వైద్యులుడా కె. అమృతవల్లి, డా. ఎస్.ఎస్. స్వామిఇతర పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా మరో ముందడుగు

- జిజిహెచ్ లో మాతా, శిశు సంరక్షణకు 18 కొత్త వాహనాలు ప్రారంభం..
- బాలింతలు, నవజాత శిశువుల సంరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయం..
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్..



తల్లీబిడ్డ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే నశిర్ ఆహ్మద్...

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 12:(ప్రభాత వార్త )** ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులను ప్రోత్సహించి మాతా, శిశు మరణాలను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రవేశపెట్టినట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖ మాత్యులు కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం గుంటూరు నగరంలోని జిజిహెచ్ ప్రాంగణంలో గల కానూరి జింఖానా స్త్రీ శిశు ఆరోగ్య కేంద్రం వద్ద స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తో కలిసి మంత్రి 18 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గర్భిణులను ఆస్పత్రికి తీసుకురావడం, ప్రసవానంతరం బాలింతలను, బిడ్డలను సురక్షి తంగా ఇంటికి చేర్చడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. ఎయిర్ కండిషన్ తో కూడిన, ఎయిర్ బ్యాగ్‌లు కలిగిన పూర్తి సురక్షితమైన వాహనాలన్నారు. గర్భిణులు మరియు బాలింతలు 102 కాల్ సెంటర్ కు ఫోన్ చేసి ఉచితంగా ఈ సేవలను పొందవచ్చునన్నారు. వారికి తోడుగా ఆసుపత్రి సిబ్బంది కూడా వాహనంలో ఉంటారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిన్న ప్రారంభమైన ఈ కార్యక్రమంను గుంటూరు జిల్లాలో ఈరోజు ప్రారంభించామని, జిల్లాకు 18 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యసాధనలో భాగంగా ఈ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. దుర్గాప్రసాద్, డిఎంహెచ్ఓ డా. విజయలక్ష్మి ్మ, డిసిహెచ్ఎస్ డా. రంగారావు, ఆర్ డి ఓ శ్రీనివాసరావు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ సహకార సవరణ బిల్లుకు టిడిపి మద్దతు

### సహకార రంగంలో సిఎం చంద్రబాబు కృషి అద్భుతం: రాజ్యసభలో ఎంపి చింతకాయల విజయ్

**విశాఖపట్నం, ప్రభాతవార్తబె:** జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ (సవరణ) బిల్లు2026కు తెలుగుదేశం పార్టీ తరఫున రాజ్యసభలో ఎంపీ చింతకాయల విజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ బిల్లుపై సభలో ఆయన మాట్లాడుతూ.. సహకార సంస్థలను స్వయం సమృద్ధిగా, పటిష్టంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఖిసహాకార్ సే సమృద్ధిఖ విజన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి అందించారని కొనియాడారు. 2021లో ప్రత్యేకంగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ప్రధానికి, అలాగే ఈ ఉద్యమానికి సంస్థాగత వేగాన్ని అందించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా కృషికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి రైతుల సహకార సంఘం పనితీరును ఆయన సభలో ఉదహరించారు. ఒక రైతు ఒంటరిగా మార్కెట్‌కు వెళితే బేరసారాలు ఆడే శక్తి పరిమితంగా ఉంటుందని, అదే రైతులు సహకార సంఘాల ద్వారా ఏకమైతే వారి బలం అనేక రెట్లు పెరుగుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులు కేవలం ఉత్పత్తిదారులుగానే మిగిలిపోకుండా సమీకరణ, ప్రాసెసింగ్, మార్కెట్ యాక్సెస్ వంటి వాటిలోనూ భాగస్వాములు అవుతారని విజయ్ వివరించారు. ప్రస్తుతం దేశంలో 8.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ సహకార సంఘాలు ఉండగా, వాటిలో 6.6 లక్షల సంఘాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయని ఎంపీ విజయ్ సభ దృష్టికి తెచ్చారు. దాదాపు 32 కోట్ల మంది సభ్యులతో గ్రామీణ భారతదేశంలో 98 శాతం మందికి ఇవి చేరువయ్యాయని, 30కి పైగా రంగాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా సుమారు 10 కోట్ల మంది మహిళలు ఇందులో భాగస్వాములయ్యారని తెలిపారు. 20142019 మధ్యకాలంలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు, కౌలు రైతులను కూడా సహకార రంగంలోకి తీసుకురావడంలో చంద్రబాబు పోషించిన అద్భుతమైన పాత్రను విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. 1962 నాటి సహకార చట్టాన్ని 2026 నాటి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కొత్త బిల్లు ద్వారా ఎన్‌సిడిసిని కేవలం వ్యవసాయం, రుణాలకే పరిమితం చేయకుండా ఫుడ్ ప్రాసెసింగ్, స్టోరేజ్, హెల్త్‌కేర్, ఎగుమతులు, విత్తనాలు, సేంద్రీయ ఉత్పత్తులు, డిజిటల్ సేవలతో పాటు మొబిలిటీ వంటి కొత్త రంగాలకు విస్తరిస్తుండటాన్ని ప్రశంసించారు. దీనికి ఉదాహరణగా, డ్రైవర్లను ఓనర్లుగా మార్చేలా జీరో కమిషన్‌తో పనిచేసే భారత్ టాక్సీ అనే వినూత్న సహకార నమూనాను ఆయన ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ, అమిత్ షాలకు ఎంపీ విజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లోని సుమారు 91 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగు చేస్తున్న రైతులు ఇటీవల తీవ్రమైన ధరల పతనంతో ఇబ్బందులు పడ్డారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన సిఎం చంద్రబాబు ఆయన అభినందించారు. రాష్ట్రంలోని గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఎంపీ విజయ్ ఒక కీలక సూచన చేశారు. ఎన్‌సిడిసి ద్వారా గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకంగా డెయిరీ కోఆపరేటివ్ ఫైనాన్సింగ్ విండోను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా పాల శీతలీకరణ కేంద్రాలు, టెస్టింగ్, కలెక్షన్ సెంటర్లతో పాటు పశుగ్రాసం, పశువైద్య సేవలు, సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడానికి వీలవుతుందని, ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు ఎంపీ విజయ్ విజ్ఞప్తి చేశారు.

## కదిరిలో రౌడీ షీటర్ శివ కుటుంబం ఆత్మహత్యయత్నం

- అరెస్టు వారెంట్ జారీ చేసిన ఎస్సీ, ఎస్టీ కోర్టు
- అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులపై

### తిరగబడిన శివ కుటుంబం



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రౌడీ షీటర్ శివ ■ సిఐతో వాగ్వివాదం దిగిన రౌడీ షీటర్ శివ తండ్రి చంద్రశేఖర్

**కదిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో రౌడీ షీటర్ శివ కుటుంబం ఆత్మహత్య యత్నానికి పాల్పడటం కలకలం రేపింది. వివిధ కేసుల్లో నింధితుడిగా ఉన్న శివ న్యాయ స్థానంలో వాయిదాలకు హాజరు కాకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం శివ అరెస్టుకై అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో కదిరి పట్టణ పోలీసులు రౌడీ షీటర్ శివను అరెస్టు చేయడానికి బుధవారం పట్టణ సిఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి వారి నివాసం వద్దకు వెళ్లగా దాదాపు 2 గంటలపాటు వారి ఇంటి వద్ద హై డ్రామా నెలకొంది. రౌడీ షీటర్ శివకుటుంబం ఇంటిలోనే వుండి లోపల గడియ తీయకపోవడంతో పోలీసులు అక్కడ రెండు గంటలపాటు ఉండి పోవాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీసులు ఎంత సేపటికీ వెళ్లకపోవడంతో శివ, శివ భార్య యాసికా, తల్లి నరసు మరుగుదొడ్లు శుభ్రంచేసే ద్రావకం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. విషయాన్ని గమనించిన పోలీసులు హుటాహుటిన స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు. రౌడీ షీటర్ శివ తండ్రి చంద్రశేఖర్ పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతోపాటు నానాదుర్భాషలాడాడు. పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పలు కేసుల్లో నింధితుడిగా ఉన్న శివ వాయిదాలకు హాజరు కాకపోవడం, అరెస్టు వారెంట్‌తో అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులపై ఇలా బ్లాక్ మెయిల్ చేయడం తగదన్నారు. పోలీసులకు బ్లాక్‌మెయిల్ చేసినా ఎంతటి వారినైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ స్పష్టం చేశారు.

## రైతుల ప్రయోజనాలే ముఖ్యం.. ప్రతి ఎకరా పంటను కాపాడుకుంటాం

**నెల్లూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కలెక్టరేట్ రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని, జిల్లాలో రెండో పంట సాగులో ఉన్న వరి పంటను కాపాడడమే ధ్యేయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ప్రతి ఎకరా పంటను కాపాడుకుంటామని, చివరి వరకు నీరు అందించేందుకు బాధ్యతతో పనిచేస్తామని స్పష్టం చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం ఉదయం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జిల్లాలో రెండో పంటకు నీటి విడుదల, సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు, నీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వృథాను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉదయగిరి, కావలి, సర్వేపల్లి, కోవూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, సోమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. తొలుత ఇరిగేషన్ అధికారులు జిల్లాలోని నీటి పారుదల సమస్యలు, కండలేరు జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, రెండో పంటకు అవసరమయ్యే నీటి పరిమాణం, నీటిని వృథా కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇప్పటికే చేపడుతున్న చర్యలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని డెల్టా, నాన్‌డెల్టా ప్రాంతాల్లో నీటి సరఫరా పరిస్థితి, కాలువల వారీగా ఉన్న సమస్యలను అధికారులు వివరించారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో
# ఎంపి శబరి భేటీ

**విజయవాడ.ఆగస్టు12, ప్రభాతవార్తప్రతినిధి:** న్యూ ఢిల్లీలోని కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని వారి కార్యాలయంలో బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిసి నంద్యాల పరిధిలోని పలు సమస్యలను వినతి పత్రం ద్వారా వివరించారు. నంద్యాల జిల్లా ప్రజల భద్రత, సౌకర్యం, మెరుగైన రవాణా కనెక్టివిటీకి సంబంధించిన పలు ముఖ్యమైన అభ్యర్థనలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. బొల్లవరం, కరివేన, ఆత్మకూరు-సిద్ధపల్లె జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు, పారుమంచాల వద్ద మీడియన్ ఓపెనింగ్, డిపాల్ స్కూల్ సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, భానుముక్కల - ఇస్కాల గ్రామాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ని కోరానన్నారు. అలాగే ఎన్‌హెచ్340సీ (ఆత్మకూరు-దోర్నాల), విబీ544డీ(బుగ్గ-కైప-గిద్దలూరు) రహదారులకు సంబంధించిన డి పి ఆర్ ల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.

## హెడ్‌కానిస్టేబుల్ పై దాడి.. ఇద్దరు అరెస్టు



హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్న యువకుడు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 12 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రమణయ్యపై మంగళవారం రాత్రి పట్టణానికి చెందిన యువకుడు ఆతని స్నేహితులు దాడి చేసి హల్ చల్ సృష్టించారు. దాడి చేసిన ఇద్దరు యువకులను అదుపులో తీసుకున్నట్లు తిరుపతి జిల్లాఎస్పి రవిమనోహరాచారి బుధవారం మీడియా సమావేశంలో వివరించరు. శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో ఓ ప్రయాణీకుడు తన లాబ్‌ట్యాప్ దొంగతనం జరిగిందని 112కు ఫిర్యాదు చేయటంతో విచారణకు వెళ్ళిన హెడ్‌కానిస్టేబుల్ రమణయ్యకు పానగల్ లో రెండు మోటార్‌సైకిళ్ళు ఢీకొనటంతో బుజ్జమ్మ అనే మహిళ గాయపడింది. ఆమెను మానవతా ధృక్పథంతో భర్తతో పాటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనం తాళాలు తీసుకోవటంతో ఆ వాహనం నడిపిన యువకుని వెనుక కూర్చొన్న శ్రీనివాసులు హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డాడని ఎస్‌పి కేసు వివరాలు తెలిపారు. ఆ యువకుడు తన వద్ద ఉంచుకున్న చూర కత్తితో హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడం జరిగిందన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి నిందితులు శ్రీనివాసులు, ఆతని స్నేహితుడు జితేంద్రను అరెస్టు చేసినట్లు వివరించారు. నిందితుని బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలో ఊరేగింపుగా రిమాండ్‌కు పంపారు. శ్రీకాళహస్తిలో శాంతి భద్రతల పరిస్థితి ప్రమాదంలో పడిందని పలువురు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. పుణ్యక్షేత్రంలో యువత మత్తుకు బానిసలై హల్‌చల్‌చేస్తున్నారని చర్చించుకుంటున్నారు.

## ఎపిలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి

**విజయవాడ, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు చెన్నై, కోయంబత్తూర్‌లలో నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ రోడ్‌షోలు విజయవంతం అయినట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తరుపున మంత్రి ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో ఈరెండు పట్టణాల్లోనూ సదస్సులు నిర్వహించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను, రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని పారిశ్రామికవేత్తలకు వివరించారు. సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ -2016 కి ముందుగా చేపడుతున్న పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాలో భాగంగా ఈరోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సంవృద్ధిగా ఉన్న సహజ వనరులు, మౌలిక వసతులు, వేగవంతమైన అనుమతులు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణం పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించారు. ఇసుజు మోటార్స్, హీరో మోటోకార్ప్, కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు తమకున్న సానుకూల అనుభవాలను పంచుకోవటం సంతోషకరమన్నారు. మంగళవారం చెన్నైలో జరిగిన సదస్సులో జర్మనీ కాన్సులేట్ జనరల్ మైఖేల్ హాస్పర్, ఇండో-జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు ఎస్.పద్మనాభన్, టిఈసిసి చెన్నై డైరెక్టర్ జనలర్ స్టీఫెన్‌హ్సు, పోస్కో చెన్నై ప్లాంట్ హెడ్ జంగ్ ఉంగ్ కాంగ్‌తో చర్చలు జరపినట్లు మంత్రి తెలిపారు.

## రైతు భూమికి రక్షణ- రైతు హక్కుకు భరోసా

**కోవూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రైతు భూమికి రక్షణ కల్పించడం.. రైతుల హక్కులకు భరోసా ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని 939 మంది రైతులకు పాస్ పుస్తకాలు, 50 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ సమస్యలు పరిష్కరిస్తామని, రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, దానిని వెంటనే అమలు చేసి మాట నిలబెట్టుకోవడం జరిగిందన్నారు. కేవలం గత ప్రభుత్వం యొక్క తప్పిదాల వలన అనేక ప్రాంతాల్లో రైతుల సొంత భూములు కూడా నిషేదిత జాబితాలోకి వెళ్లాయన్నారు. కోవూరు నియోజకవర్గంలోని కొత్త వంగల్లు లో కూడా ఇటువంటి సమస్యలు ఉన్నాయన్నారు. 90 ఏళ్లుగా రైతులు సాగు చేస్తున్న 400 ఎకరాల భూములు నిషేదిత జాబితాలోకి వెళ్లాయన్నారు. వెంటనే ఈ విషయాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కోవూరు గ్రామంలో 5554 ఎకరాలకు రీ సర్వే పూర్తి చేయడం జరిగిందని, ఇందులో 3917 ఎకరాలకు సంబంధించి 939 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను అందించడం జరిగిందన్నారు. ఇప్పటికే మండలంలోని 9 గ్రామాల్లో ఇటువంటి పాసు పుస్తకాలనరు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సాదా బైనామా భూములకు కూడా పాసు పుస్తకాలు అందించే చర్యలు జరుగుతున్నాయన్నారు. ఇటుక బట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న 50 మంది నిరుపేదలకు ఈ సందర్భంగా పట్టాలు కూడా పంపిణీ చేయడం జరిగిందని, ఇందుకు సహకరించిన నాయకులు బాల చెన్నయ్యకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## డాక్టర్ ప్రియాంక మృతిపై విచారణ జరిపించాలి: సిపిఎం డిమాండ్

**విజయవాడ.,ఆగస్టు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాజమహేంద్రవరంలో ఆగస్టు 3వ తేదీ రాత్రి మద్యం సేవించి కొందరు దుండగులు పలుమార్లు కారుతో ఢీ కొట్టించి దారుణంగా హత్య చేసిన ఘటనలో డా.ప్రియాంక తీవ్రంగా గాయపడి మృతిచెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది ఈ మేరకు సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన చేసారు..సీసీటీవీ దృశ్యాల ప్రకారం మద్యం మత్తులో ఉన్న నిందితులు అత్యంత నిరక్ష్యంగా కారును నడుపుతూ ప్రియాంకను పలుమార్లు ఢీకొట్టారు. ప్రమాదానికి ముందు కూడా ప్రసాద్ ఆదిత్య మాల్ వద్ద భద్రతా సిబ్బందితో వారు ఘర్షణకు దిగినట్లు సిసి కెమెరా ల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటి నేపథ్యంలో ఈ ఘటనను కేవలం రోడ్డు ప్రమాదంగా పరిగణించడం సరైంది కాదు. నిందితుల వెనుక పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులున్నారని, వారు కేసు నీరు కార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఇప్పటికే వార్తలు వచ్చాయి. కేవలం రాజమండ్రిలో ప్రజాసంఘాలు, పౌర సమాజం స్పందించి ఆందోళన చేశాకే నిందితులపై హత్యకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు రాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబానికి ప్రకటించిన సహాయం సక్రమంగా లేదు డా. ప్రియాంక మృతి ఘటనపై పూర్తి స్థాయిలో, పారదర్శకంగా విచారణ జరిపించాలని వాపోయారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక భాద్యత

### తెలుగు యువత అధ్యక్షుడు : భాను ప్రకాష్



సంతబొమ్మాళి, ఆగస్టు 12, ప్రభాతవార్త :

పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సంతబొమ్మాళి మండల తెలుగు యువత అధ్యక్షులు కూచెట్టి భాను ప్రకాష్ పిలుపు నిచ్చారు. సంతబొమ్మాళి కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో నెహ్రూ యువకేంద్రం వాలంటీర్ కొయ్యాన మధు ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచత పక్వాడ 2026' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత.మన ఇంటి నుంచి ప్రారంభమయ్యే స్వచ్ఛతే మన గ్రామాన్ని,మన సమాజాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతుంది' అని అన్నారు.పరిశుభ్రతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా మన నిత్యజీవితంలో ఒక అలవాటుగా,బాధ్యతగా మార్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు చిన్ననాటి నుంచే స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థులు, సిబ్బంది సహకారం అందించారు. కార్యక్రమంలో యువజనసంఘ ప్రతినిధి కొన్న రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలల్లో థర్డ్ పార్టీ ద్వారానే కుక్‌లు, కమాటీల నియామకం

సీతంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త :



సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న కుక్‌లు, కమాటీల పోస్టుల నియామకాలు థర్డ్ పార్టీ ద్వారానే చేపట్టడం జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డీడీ) అన్నదొర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకాల్లో ఐటీడీఏ డీడీ కార్యాలయానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, పాద్యమి ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే థర్డ్ పార్టీ ఏజెన్సీ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు సంబంధిత థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో అభ్యర్థులెవరూ ఐటీడీఏ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని తెలిపారు.

## మాతృమూర్తి యువజన సంఘం ఉదారత

కవిటి, ఆగస్టు 12, ప్రభాతవార్త :



పాము కాటుకు గురై శ్రీకాకుళం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నికి అండగా మాతృమూర్తి యువజన సంఘం నిలిచి తమ ఉదారతను చాటారు. మండలం మడయారిపుట్టుగ గ్రామానికి చెందిన దుక్క రాజు కుటుంబానికి అండగా కుసుంపురం కేంద్రంగా పని చేస్తున్న మాతృమూర్తి యువజన సంఘం నిలిచింది. రాజ్ కుమార్తె చిన్ని ఇటీవల పాము కాటుకు గురై శ్రీకాకుళంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. పత్రికల ద్వారా సమాచారం తెలుసుకున్న మాతృమూర్తి యువజన సంఘం బుధవారం గ్రామానికి చేరి ఫోన్ పే ద్వారా రాజు కుటుంబానికి 10000 ఆర్థిక సహకారం అందించారు. మరింతమంది దాతలు వచ్చి ఆదుకోవాలని కోరారు.

## రేపు సంతబొమ్మాళి మండల సమావేశం

సంతబొమ్మాళి, ఆగస్టు 12, ప్రభాతవార్త :

సంతబొమ్మాళి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.పార్వతీశం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి గౌరవ సభ్యులు మాత్రమే తప్పకుండా హాజరు కావాలని అయన కోరారు. అలాగే మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు. అధికారులు ఎవరైనా హాజరు కాకపోతే క్రమశిక్షణ చర్యలు కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఆయన తెలిపారు.



## జాతీయ జెండాని గౌరవించాలి

ఇచ్ఛాపురం, ఆగస్టు 12, ప్రభాతవార్త :

జాతీయ జెండాని గౌరవించాలని ఎంఈవో కాకర సూర్యారావు అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమీషనర్ రమేష్, ఎంపీడీఓ ప్రభాకరరావు, ఎం ఈ వో 2 విశ్వనాథం పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం విభాగం అధ్వర్యంలో ప్రిన్సిపాల్ కృష్ణ అధ్యక్షతన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు జాతీయ జెండాను గౌరవించాలని, మువ్వన్నెల జాతీయ పతాకం ప్రతి ఇంటిపై రెపరెపలాడాలని, కొండ పొలమ్మ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు దుర్యోధన, శివకుమార్, ఈశ్వర్, లోకేష్, దేవరాజు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన నిలబడి పోరాడండి

### విక్రాంత్‌కు జగన్ ప్రశంసలు



వీరఘట్టం, ఆగస్టు 12, ప్రభాతవార్త :

ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని, అలాగే కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు వివరించాలని వైకాపా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు సూచించారు. గురువారం తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో శాసన మండల సభ్యులకు, శాసనసభ్యులకు జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన సమావేశం అనంతరం ఆయనను ప్రత్యేకంగా శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్ కలిశారు. ఇటీవల పాలకొండ, పాతపట్నం, రాజాం నియోజకవర్గాల్లో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలను ఆయన జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా మెగా డీఎస్సీ, దగా డీఎస్సీ అంటూ ప్రజల పక్షాన నిలబడి బాగా పోరాటం చేస్తున్నారని, అనునిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి బాగోగుల కోసం పరితపిస్తున్న తీరు తనకు ఎంతో ముచ్చటేసిందని జగన్ విక్రాంత్‌ను ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి, ప్రజల పక్షానే ఉండాలని ఆయన విక్రాంత్‌కు సూచించారు.



## మందస ఎస్సైకి శుభాకాంక్షలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 12, ప్రభాతవార్త :

మందస పోలీస్ స్టేషన్ ఎస్సైగా పదవీ బాధ్యతలు చేపట్టిన బెల్లుపడకి చెందిన పోతల అప్పల రెడ్డికి బెల్లుపడ గ్రామ వాసులు మందస పోలీస్ స్టేషన్‌లో సత్కరించి అభినందనలు తెలియజేశారు. స్వర్ణభారతి విద్యా సంస్థలు చైర్మన్ చాట్ల తులసిదాస్ రెడ్డి, తిప్పన జనార్దన్ రెడ్డి. సిల్లా జాని రెడ్డి. జీరు లోహిదాస్ రెడ్డి. పిట్ట మణి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## భర్త చితికి తలకొరివి పెట్టిన భార్య

కంచిలి, ఆగస్టు 12, ప్రభాతవార్త :



మండలం అంపురం పంచాయతీ పద్మతుల గ్రామంలో ఓ నిరుపేద ఇంట విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన గుడియా కులస్తుడు నిరుపేద కుటుంబానికి గ్రామంలో గల చిన్న హోటల్లో పాచి పనులు చేస్తూ గుడియ జ్ఞాని (59) బుధవారం వేకువ జామున అనారోగ్యంతో మృతి చెందాడు. జ్ఞానికు సాంప్రదాయ పద్ధతిలో కుమారులు చితి పెట్టాల్సి ఉన్నప్పటికీ పిల్లలు లేకపోవడంతో మృతదేహానికి భార్య భాగ్యవతి కన్నీటి భారంతో చితి పెట్టింది. ఈ దృశ్యాన్ని చూసి గ్రామస్తులంతా కన్నీటి పర్యంతమయ్యారు. గుడియా కులస్తులు అన్ని విధాలుగా కుటుంబానికి ఆదుకుంటామని తెలియజేశారు.

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమం



సంతకవిటి, ఆగస్టు 12, ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం సంక్షేమ విజయాలు ప్రజా పాలన-ఇంటింటికీ అభివృద్ధి" కార్యక్రమంలో సంతకవిటి మండలం చిన్నయ్యపేట గ్రామంలో బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు గట్టి భాను, మండల పీఏసీఎస్ చైర్మన్ చెలికాని మహేష్, యువత అధ్యక్షులు వావిలపల్లి శ్రీనివాస్, పంచాయతీ సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస చక్రవర్తి, రూపటి చిన్నప్పలనాయుడు, పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఓలో విధులు నిర్వహిస్తున్న జవాన్ మామిడి గిరి మృతి

### తిమ్మాపురంలో విషాదఛాయలు



ఆమదాలవలస, ఆగస్టు 12, ప్రభాతవార్త :

హిమాచల్‌ప్రదేశ్‌లో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌లో 22 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఎం వి ఎస్ ఎన్ గిరి (52) బుధవారం తెల్లవారు జామున గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మృతి చెందిన వార్త తన స్వగ్రామం మున్సిపాలిటీలో ఒకటవ వార్డ్ తిమ్మాపురానికి అధికారులు చేరవేయడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. గత 22 సంవత్సరాలుగా బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆరఓ)లో డిఫెన్స్‌కు సంబంధించిన విధుల్లో గిరి సేవలందిస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో ఆయన విధులు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గిరి మృతికి సంబంధించి ఆయన భార్య మామిడి హేమలత మనాలి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచఓకు కన్సెంట్ లెటర్ అందించారు. తన భర్తకు సివిల్ అథారిటీ లేదా మిలిటరీ అథారిటీ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వ హించేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని హేమలత లేఖలో పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని జి.శ్రీనివాసరావు, జేఈ (ఈ అండ్ ఎం), జి.ఎస్ 179985 వై కు అప్పగించేందుకు కూడా తనకు అభ్యంతరం లేదని లేఖలో స్పష్టం చేశారు. గిరికి భార్య హేమలతతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న గిరి ఆకస్మికమృతితో భార్య, పిల్లలు విషాదంలో మునిగిపోయారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి



కవిటి, ఆగస్టు 12, ప్రభాతవార్త :

అంగన్వాడీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాలు మరింత పెంచాలని నొక్కి వక్కాణించారు. కవిటి మండలంలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి సందర్శించి పరిశీలించారు. అలానే కవిటి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథం అంగన్వాడీ కేంద్రాల్లో ఈ చిన్నారికి అర్థవంతంగా చదవడం ఉద్దేశ్య పూర్వకంగా రాయడం సజ్ఞ జ్ఞానాన్ని అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలల సర్వతోముఖాభివృద్ధికి అందరం కలిసికట్టుగా విచ్చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు పల్లవి కృష్ణవేణితో పాటు డిఆర్పీలు దుద్దిష్టి రౌలో సూర్యం పాల్గొన్నారు.

## సంతబొమ్మాళిలో ఘనంగా ఎసఆర్ రంగనాథన్ జయంతి

సంతబొమ్మాళి, ఆగస్టు 12, ప్రభాతవార్త :



సంతబొమ్మాళి శాఖా గ్రంధాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి కె.రామక్రిష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగనాథన్ లైబ్రరీ సైన్స్ రంగంలో దూర దృష్టి గల మార్గదర్శకుడని కొనియాడారు. గ్రంథాలయ శాస్త్రంలో పంచ సూత్రాలు కనుగొని వాటిని విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా (లైబ్రేరియన్స్ డే )జాతీయ గ్రంథాలయ అధికారుల దినోత్సవం నిర్వహించారు. గ్రంథాలయ పాఠకులు చైతన్య కమలాకర్ ఉమా మహేశ్వర్, రాజా శంకరరావు, కే.కృష్ణ, సహాయకులు బాబురావు, ఎంపీపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం సద్వినియోగం చేసుకోండి



### ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

సీతంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త :

తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రి ఆవరణలో నూతనంగా మంజూరైన తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని గర్భిణీలు, బాలింతలు చిన్నారులకు వైద్య సేవలు మరింత చేరువ చేయడం, అవసరమైన సమయంలో సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించడం ఈ సేవల ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగం కలుగుతుందని, తల్లి-బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఐటిడిఏ ఉపవైద్యాధికారి డాక్టర్ విజయ పార్వతి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ బి.సంధ్యారాణి, డాక్టర్ డివి శ్రీనివాసరావు, ఇమరక పవన్, హెచ్.ప్రసాదరావు ,తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

హిరమండలం, ఆగస్టు 12, ప్రభాతవార్త :



సర్ కార్యక్రమంలో భాగంగా హిరమండలం మండల పరిధిలో ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించి, అర్హత లేని మరియు ప్రస్తుతానికి ఓటరుగా కొనసాగేందుకు అవకాశం లేని ఓట్లను గుర్తించి తొలగింపు ప్రక్రియ చేపట్టినట్లు తహసీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు. మండల పరిధిలో మొత్తం 32,894 మంది ఓటర్లు ఉండగా, సర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరిశీలనలో మొత్తం 2,933 ఓట్లు తొలగించబడినట్లు తెలిపారు. ఇందులో మరణించిన ఓటర్లు 1,233, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలిపోయిన ఓటర్లు 370, ఒకే వ్యక్తికి సంబంధించిన డబుల్ ఓట్లు 728 ఉన్నట్లు వివరించారు. ప్రజల నుంచి అందే అభ్యంతరాలు, ఆధారాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతతో పాటు, ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, డిప్యూటీ ఎంపీడీఓ, జెడ్పీటీసీ బుచ్చిబాబు, సూపర్వైజర్లు, బిఎలఓలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన పర్యావరణ పరిరక్షణ సమితి



రాజాం, ఆగస్టు 12, ప్రభాతవార్త :

ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా 100 పడకల రాజాం ప్రభుత్వ ఆసుపత్రిలో, ఆసుపత్రి సూపరిండెంట్, డాక్టర్స్, నర్సస్‌తో ఆసుపత్రి ఆవరణలో కలసి మొక్కలు నాటడమైందని పర్యావరణ పరిరక్షణ కన్వీనర్ ఆర్‌వి జె నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ రెడ్డి శ్రీనివాసరావు, వొల్లూరు సన్యాసిరావు, ప్రసాద్, మురళీ పాల్గొన్నారు. ఇలా ప్రత్యేక దినాలు, పుట్టినరోజులు, పండగలు, శుభకార్యాల్లో మొక్కలు నాటి పర్యావరణంలో ఉన్న అసమతుల్యంను సమతుల్యం మొక్కలు నాటడంతోనే అవుతుందని అన్నారు.

## అర్హులైన రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు

### ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ కూన

ఆముదాలవలస, ఆగస్టు 12, ప్రభాతవార్త :



అర్హులైన రైతులందరికీ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. తోటాడ గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో తప్పులు జరిగాయని, రైతుల పాస్ పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మలు వేయడం రైతులు అభద్రత భావానికి లోనయ్యారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్,తమ్మినేని నాని, బుడుమూరు సీతారాం, తాండ్ర హరిబాబు, అన్నేపు భాస్కర్ రావు, హనుమంతు బాలకృష్ణ, కూన అమ్మాజీ,ఆర్ ఐ పప్పల గోవిందరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## థైలేరియా వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలి



కోటబొమ్మాళి, ఆగస్టు 12, ప్రభాతవార్త :

పశువులకు థైలేరియా వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌మార్ అన్నారు. ఆయన బుధవారం మండలం నిమ్మాడ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి 85 పశువులకు టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 10,800 డోసులు రాగా టెక్కలి డివిజన్కు 7,630 డోసులు వచ్చాయని, అందులో కోటబొమ్మాళి మండలానికి 950లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీకర్ , తదితరులు ఉన్నారు.

# శ్రీకాకుళం వార్త



## ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

### -రాష్ట్ర కళింగ కోమటి కార్పోరేషన్ చైర్మన్ బోయిన



కోటబొమ్మాళి, ఆగస్టు 12, ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు గూర్చి గ్రామాల్లో ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలని రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవనంలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసిన అభివృద్ధి గూర్చి ప్రజలకు చెప్పకపోవడం వల్ల 2019 ఎన్నికల్లో మన పార్టీ ఓటమి చెందిందని, మళ్ళీ ఆ పరిస్థితి రాకుండా ఇప్పటి నుంచే మనం చేస్తున్న అభివృద్ధి, ఇస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి ఇంటింటికివెళ్ళి వివరించాలని ఆయన సూచించారు. ఈ విషయంలో మన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చాలా కఠినంగా ఉన్నారని, ప్రతి ఒక్కరు రోజుకు గంట సమయం కేటాయించి ప్రజలకు సంక్షేమపథకాలు వివరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, దేశం నేతలు కర్రి అప్పారావు, కోరాడ గోవింద్, పట్ట సింహాచలం, సుంకరి గణపతిరావు, మక్క లక్ష్మణరావు, విరఘట్టపు శివరాం, సాసువ అంతు అనంద్, దేవాది సింహాద్రమ్మ, శిమ్మ సింహాచలం, ధర్మాన నాగరాజు, పాగోటి ముత్తురాజు, తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటిక పునరుద్ధరణ

### -బీజేపీ నేత గురునాథ్ రెడ్డిని కొనియాడిన గ్రామస్తులు

రణస్థలం, ఆగస్టు 12, ప్రభాతవార్త :



మండలంలోని నారువ పంచాయతీ పరిధిలోని నారువ, బోయిపాలెం గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందిగా మారిన శ్మశానవాటిక సమస్య ఎట్టకేలకు తీరింది. ఇరు గ్రామాల ప్రజలు దహన సంస్కారాలు నిర్వహించే ఈ శ్మశానవాటిక గత కొంతకాలంగా పిచ్చిచెట్లు, ముళ్ల కంపలతో నిండిపోయి అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో అంత్యక్రియలు జరిపించేందుకు గ్రామస్తులు నరకయాతన అనుభవించేవారు. ఈ దయనీయ పరిస్థితిని నారువ గ్రామానికి చెందిన జిల్లా బిజెపి ఓబీసీ విభాగం ఉపాధ్యక్షులు జీరు గురునాథ్ రెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన తక్షణమే స్పందించారు. బుధవారం ఆయన తన సొంత నిధులతో శ్మశానవాటికలోని ముళ్ల కంపలను, చెత్తా చెదారాన్ని తొలగించి, ప్రాంగణాన్ని పూర్తిగా బాగు చేయించారు. ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఈ ప్రధాన సమస్యను తక్షణమే పరిష్కరించిన ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఓపీఎస్‌తోనే సీపీఎస్ ఉద్యోగులకు భరోసా ఇవ్వండి



### అప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు

సంతబొమ్మాళి, ఆగస్టు 12, ప్రభాతవార్త :

ఓపిఎస్ తోనే ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు అన్నారు. పెన్షన్ అనేది ప్రభుత్వ దానం కాదని, ఉద్యోగి జీవిత కాలం ప్రజాసేవకు లభించే చట్టబద్ధమైన హక్కు అని ఇటీవల సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం విధితమే. సిపిఎస్ అనేది నిర్దిష్ట విరాళాల విధానం, అందువలన ఉద్యోగికి భవిష్యత్తులో ఎంత పెన్షన్ లభిస్తుందో ముందుగా నిర్ధారించలేని పరిస్థితి అన్నారు. ఇదే సిపిఎస్ ఉద్యోగుల ఆందోళనకు ప్రధాన కారణమన్నారు. కేవలం నియామక తేదీ ఆధారంగా ఒకరికి ఓ పి ఎస్, మరొకరికి సిపిఎస్ వర్తించడం సమాన పనికి సమాన సామాజిక భద్రత అనే సూత్రానికి అనుగుణంగా లేదన్నారు. దీనివలన నిర్ధారిత పెన్షన్, డియర్ నెస్ రిలీఫ్, కుటుంబ పెన్షన్ వంటి ప్రయోజనాలు ఉండవన్నారు. అందువలన సిపిఎస్ వారికి ఓపిఎస్ విధానం అమలు చేసినట్లయితే ఉద్యోగి వృద్ధాప్యంలో ఆర్థిక భద్రతతో గౌరవప్రదంగా జీవించే అవకాశం లభిస్తుందన్నారు.

## మొక్కలు నాటిన పర్యావరణ పరిరక్షణ సభ్యులు

రాజాం, ఆగస్టు 12, ప్రభాతవార్త :



పర్యావరణ హితులు, ప్రకృతి ప్రేమికులు వొళ్లూరు సన్యాసి నాయుడు తల్లి ద్వాదశ దినకర్మ సందర్భంగా, పొనుగుటీవలస చెరువు ఆవరణలో కొబ్బరి మొక్కలను నాటారు. ఆర్గానిక్ ప్లేట్స్‌లో భోజనాలు ఏర్పాటు చేసి వారి యొక్క పర్యావరణ స్పృహను చాటుకున్నారని పర్యావరణ పరిరక్షణ కన్వీనర్ ఆర్ వి జె నాయుడు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాసరావు, శాసపు సత్యనారాయణ, గార గున్నం నాయుడు, అడపా వెంకటేష్ , తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

కోటబొమ్మాళి, ఆగస్టు 12, ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వంలో సంక్షేమనికే, అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నట్లు టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల సింహాచలం అన్నారు. బుధవారం పాకివలస గ్రామంలో (249 బూత్ పరిధి) ఇంటింటికి టీడీపీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి కుటుంబ సభ్యులతోను గత పాలకుల తీరు ఎండ గడుతూ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామంలో ప్రతి ఒకరికి అందిస్తున్న సంక్షేమంను ప్రస్తావిస్తూ, అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అందిస్తున్న పూర్తి సహకారాలు ప్రజలకు వివరించారు. సీ.ఎం నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్ బాబు సారథ్యంలో సాగుతున్న పాలన పరుగులు తీస్తుందని, ప్రజలంతా పాలనకు బ్రహ్మరథం పడుతున్నారని ఆయన అన్నారు.

## రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేత

సంతకవిటి, ఆగస్టు 12, ప్రభాతవార్త :



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు తమ భూములపై సర్వహక్కులు కల్పిస్తూ, రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొల్ల అప్పలనాయుడు తెలిపారు. రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సూచన మేరకు బుధవారం సంతకవిటి మండలం చిన్నయ్యపేట గ్రామంలో రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. మండల పార్టీ అధ్యక్షులు గట్టి భాను, మండల తెలుగు యువత అధ్యక్షులు వావిలపల్లి శ్రీనివాస్, బండారు రామకృష్ణ, డీటీ మధు, పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

## సత్యసాయి రథానికి స్వాగతం పలికిన మహిళలు



కవిటి, ఆగస్టు 12, ప్రభాతవార్త:

సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా అనంతపురం పుట్టపర్తి ప్రశాంతి నిలయం వద్ద ఐదు సత్యసాయి ప్రేమవాహిని రథాలు దేశవ్యాప్తంగా దేశ శాంతి కొరకు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా 13వ తేదీ బుధవారం కవిటి మండలం సన్యాసిపుట్టుకలో ప్రారంభమై నెలవంక, కపాసుకుద్ది మీదుగా ప్రగడపుట్టుగలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని హారతితో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కన్వీనర్ అప్పలనాయుడు అంతమందికి దీక్ష పుష్పాలను అందించారు. అనంతరం కవిటి మీదుగా బొరివంక, బి.గొనపపుట్టుగ, మాణిక్యపురం నుండి సోంపేట చేరుకోవడం జరిగిందని కన్వీనర్ అప్పలనాయుడు తెలియజేశారు.

## ఐతంలో క్షయ వ్యాధిపై ఎన్‌సీసీ అవగాహన

టెక్కలి, ఆగస్టు 12, ప్రభాతవార్త :

క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు టెక్కలి సమీపంలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా ఎన్‌సీసీ 14(ఎ) బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెన్సిటైజేషన్ అండ్ ఫీల్డ్ ర్యాలీ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో క్షయ లక్షణాలు, ముందస్తు సంకేతాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



# పెళ్లంటే మమకారపు 'బేడీ'లా ?

**అత్తారింటికి దారేది? అత్తింట్లో చోటేది? ఈ రెండు ప్రశ్నలకు సమాధానం అంత తేలికగా చెప్పడం కష్టమే.** ఒకవేళ దారి దొరికినా అత్తింట్లో చోటు, ఆమె మనసులో సంపాదించేందుకు పెద్ద సవాలేనని, మగువలు ఎంతో కష్టపడాలి అక్కడ సర్దుకు పోవడం పెద్ద సవాలేనని, అందుకే భారతీయ మహిళలకు వివాహం మూన్నాళ్ల ముచ్చట కాకూడదని మనసారా కోరుకునే పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్, రిటైర్డ్ ఐపిఎస్ అధికారిణి డాక్టర్ కిరణ్‌బేడి 'పెళ్లి' తదనంతర జీవితం, ఎదురొచ్చే సవాళ్ల గురించి ఓ పాడ్‌కాస్ట్‌లో ప్రత్యేకించి ప్రస్తావించారు.

ఇంటి పనులను భర్తతో పంచుకోవాలని, ఆర్థిక స్వాతంత్రం సాధించాలని సలహాఇచ్చారు. భారతీయ మహిళలకు వివాహం అంటే వేడుక కాదు, అదొక పెద్ద ట్రామా (మానసిక గాయం) ఇదీ ఆమె వ్యాఖ్యల సారాంశం. ఆమె ఇంకా మాట్లాడుతూ పెళ్లిళ్లు చూడటానికి పండగలా కనిపించినా, సురక్షితమైన పుట్టింటిని వదిలి కొత్త వాతావరణంలోకి వెళ్లడం మహిళలకు తీవ్రమైన భావోద్వేగ, మానసిక సవాళ్లను తెచ్చిపెడుతుందని అన్నారు. కొత్తగా పెళ్లయిన కోడలు అత్తమామలను సొంత తల్లిదండ్రుల్లా చూడాలని, భర్త కుటుంబ వాతావరణానికి పూర్తిగా అలవాటు పడాలని, తన ఇష్టాలతో సంబంధం లేకుండా గృహిణి పాత్రను స్వీకరించాలని సమాజం ఆశిస్తుందని ఆమె పేర్కొన్నారు.

ఈ అంచనాల గురించి పెళ్లికి ముందే జంటలు ఎందుకు చర్చించుకోవని ఆమె ప్రశ్నించారు. పెళ్లి తర్వాత కూడా ఉద్యోగం కొనసాగిస్తామని, అవసరమైతే ఇంట్లో సహాయానికి మనిషిని పెట్టుకుంటామని, ఇంటి పనులను భర్తతో పంచుకుంటామని మహిళలు ధైర్యంగా చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందని అన్నారు. పెళ్లి తర్వాత చాలా మంది మహిళలు వృత్తిని వదిలేస్తున్నారని కిరణ్ బేడీ ఆవేదన వ్యక్తం చేశారు. వివాహం, పిల్లలు పుట్టిన తర్వాత మహిళా ఉద్యోగుల సంఖ్య తగ్గడానికి ఇదే కారణమని ఆమె విశ్లేషించారు. అత్తారింట్లో మద్దతు లభించని పక్షంలో ఆర్థిక స్వాతంత్రంతో ధైర్యంగా తల్లిదండ్రుల వద్దకు తిరిగి వెళ్లడానికి సంకోచంపడరాదని సమాజం అలాంటి నిర్ణయాలను సానుకూల దృక్పథంతో ఆహ్వానించాలన్నారు. ◻

# మీగడతో..



ముఖం అందంగా ఉండాలంటే పార్లర్ల వద్దకే వెళ్లాల్సిన పనిలేదు. మన ఇంట్లో దొరికే వాటితోనే చక్కటి నిగారింపును సొంతం చేసుకోవచ్చు. పైగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అందు కోసం ముఖంపై కాస్త శ్రద్ద పెట్టి ఇంట్లో ఉంటే సహజసిద్ధమైన వాటిని అప్లై చేసి మచ్చలేని చందమామలా ఉండే ముఖాన్ని సొంతం చేసుకుండి. అందుకు ఈ సింపుల్ రెమిడీస్‌ని ఫాలోకండి. రోజూ పెదవులకు కాస్తంత మీగడ రాసిన సున్నితంగా మర్దన చేస్తే పదవులు పగడలకుండా గులాబీ రేకుల్లా మెరు స్తాయి. ముఖాన్ని రోజుకు రెండు మూడు సార్లు గోరువెచ్చటి నీటితో కడుక్కుని పొడి టవల్‌తో చక్కగా తుడిచేస్తే మొటిమల వంటివిరావు. లేత కొబ్బరిని మెత్తగా మెదిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తుంటే ముఖం చక్కగా అందంగా కనబడుతుంది. రకరకాల షాంపూల బదులు కుంకుడుకాయ రసం లేదా సీకాయపొడితో తలస్నానం చేయడం వల్ల చుండ్రు, కేశ సంబంధమైన సమస్యలు రాకుండా జుట్టు ఆరోగ్యంగా నిగనిలాడుతుంది. తల స్నానం పూర్తయిన తర్వాత, చివరి మగ్గు నీటిలో కొంచెం నిమ్మరసం కలిపి తలమీద పోసుకుంటే జుట్టు, చర్మ సమస్యలు రావు. ◻

# ఒకరికి ఒకరం !



ప్రస్తుతం ఫోన్ అందరి జీవితంలో భాగమై పోయింది. దీని మాయలో పడి చుట్టూ ఉన్నవాళ్లని పట్టించు కోవడం లేదు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య గొడవలకు కారణం మొబైలే అంటున్నారు. వివాహ బంధాలు బల హీన పడడానికి సోషల్ మీడి యా, సాంకేతి కత చాలా వరకూ కారణం అవుతు న్నాయి. రోజులో సంగంపైనే ఫోన్‌లో వీడియోలు చూడటం, చిన్న విషయాలకు మెసేజ్, మెయల్ రూపంలో సమాధా నం ఇచ్చు కోవడం వల్ల ఇద్దరిమధ్యా కమ్యూనికేషన్ తగ్గుతుంది. తిరిగి అడిగినదానికి అనాసక్తిగా సమాధానాలు చెబితే కోపాలు తలెత్తుతాయి. భాగస్వామితో సంభాషించేటప్పుడు ఫోన్‌ను దూరంగా ఉంచండి. ఇది ఇద్దరిలో సఖ్యతను పెంచుతుంది. సోషల్ మీడియాలో ఇతరులతో పరిచయాలు పెంచుకుంటే అది భాగస్వామిలో అసూయకీ, అపనమ్మకానికీ దారితీస్తుంది. ఫలితంగా సంబంధాలూ దెబ్బ తింటాయి. కాబట్టి ఇద్దరి మధ్య అపార్థాలు రావద్దు అంటే మీ పరిచయాలు గురించి మీ భాగస్వామితో చెప్పండి. దాంతో మీ దాంపత్యం దృఢంగా మారుతుంది. వారాంతంలో కుటుంబంతో సమయం గడపకుండా ఫోన్ చూస్తుండడం వల్ల ఇద్దరి మధ్య ప్రేమ తగ్గుతూ పోతుంది. సెలవురోజు అయినా కాస్త భాగస్వామితో బయటకు వెళ్లడంకలిసి భోజనం చేయడం వంటివిమీ బంధాన్ని ఆరోగ్యంగా ఉంచు తాయి. ◻



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

# వ్యథ ధ్యానం కంటే దృక్పథం ముఖ్యం !

**ప్రశ్న :** నా వయస్సు 64 ఏళ్లు. నాకు బీపీ, మధుమేహం, గ్యాస్ సమస్యలు ఉన్నాయి. నిద్ర లేమితో బాధపడుతున్నాను. దీనికి మందులు వాడుతున్నాను. చిరాకు, కోపం, విసుగు వెంటాడు తున్నాయి. మా వారు ప్రభుత్వ ఉద్యోగిగా రిటైర్ అయినప్పటికీ, అనుకున్నంత సంపాదించలేక పోయారు. డబ్బు ఉన్నా మా చెల్లి, తమ్ముడితో పోలిస్తే సగం కూడా ఉండదు. నా కొడుకు కంటే అల్లుడే బాగా సంపాదిస్తాడు. ఇవన్నీ తలుచుకుంటే బాధేస్తుంది. దీంతో ప్రతికూల భావాలు పెరిగాయి. ఒక యోగా నిపుణుడి వల్ల ధ్యానం, చైనా యోగాసనాలు నేర్చుకున్నాను. రోజూ ఉదయం నాలుగు గంటలకు లేచి గంటసేపు యోగా, ధ్యానం సాధన చేస్తున్నాను. అయినా నా సమస్యలు తగ్గలేదు. నా మనసు ప్రశాంతంగా ఉండేందుకు సలహాలు ఇవ్వండి.

– ఒక సోదరి, తిరుపతి



**జవాబు:** అమ్మా! మనశ్శాంతికి ధ్యానం మంచిదే. అయితే జీవితాన్ని చూసే దృక్పథం కూడా చాలా ముఖ్యం. పొంగే పాలపై నీళ్ల చల్లడం కంటే మంట తగ్గించడం మేలు. అలాగే సమస్యలపై ఆలోచనలను ఆపడంకంటే వాటిపట్ల మన దృక్పథాన్ని మార్చుకోవడం మంచిది. మీరు చేస్తున్న యోగా, ధ్యానం అభినందనీయం. అయితే అవి చేస్తున్నప్పటికీ మనసులో ఇతరులతో పోల్చుకోవడం కొనసాగితే ప్రశాంతత పూర్తిగా లభించదు. 'నా దగ్గర ఎంత ఉంది?' అని భావించడం కంటే 'నా దగ్గర ఉన్నదానితో నేను ఎంత సంతోషంగా జీవిస్తున్నాను?' అనే ఆలోచన పెంచుకోండి. చెల్లి, తమ్ముడి సంపదతో, కొడుకు, అల్లుడి సంపాదనతో మీ జీవితాన్ని పోల్చుకోవడం మానేయండి. ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి జీవన ప్రయాణం వేరు. వారి సంపాదన, జీవన విధానం, లక్ష్యాలు వేరుగా ఉంటాయి. ఈ వయసులో సంపాదన కంటే ఆరోగ్యం, ఆత్మీయ సంబంధాలు, ప్రశాంతమైన జీవితం ముఖ్యమైనవి. గతాన్ని తలచుకుని బాధపడటం, భవిష్యత్తును ఊహించి భయపడటం రెండూ వర్తమాన ప్రశాంతతను దూరం చేస్తాయి. అలాగే ఉదయం నాలుగు గంటలకు లేవడం తప్పనిసరి కాదు. రాత్రి తగినంత నిద్రపోయిన తర్వాతే యోగా, ధ్యానం చేయండి. మీ వయసులో సాధారణంగా ఏడు నుంచి తొమ్మిది గంటల నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. ఉదయం ఆరు, ఏడు గంటల తర్వాత లేదా సాయంత్రం యోగా, ధ్యానం చేసినా నష్టం లేదు. రోజూ కొంతసేపు నచ్చిన వారితో మాట్లాడండి, ప్రకృతిలో నడవండి, ఇష్టమైన పనులు చేయండి. మనసుకు ఉల్లాసం కలిగించే అభిరుచులను ఎంచుకోండి. మందులు క్రమబద్ధంగా వాడండి. తేలికగా జీర్ణమయ్యే సమతుల ఆహారం తీసుకోండి. ధ్యానం మనసును ప్రశాంతపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది. దృక్పథం జీవితాన్ని మార్చి, ఒత్తిడి కారకాల ప్రభావాన్ని తగ్గిస్తుంది. అందుకే ధ్యానం కంటే దృక్పథం ముఖ్యం అని గుర్తించండి. అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణుడిని సంప్రదించి కౌన్సెలింగ్ తీసుకోవడం కూడా మంచిదే. ◻

# ఓం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి



శ్రీవల్లీ దేవసేనలతో కలిసి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి పూజలు అందుకునే క్షేత్రాలు ఎన్నో వున్నాయి. అలాంటి పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా మల్లామ్ కనిపిస్తుంది. సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాల్లో మల్లామ్ విశిష్టమైనదిగా .. విశేషమైనదిగా చెప్పుకోవచ్చు. నెల్లూరు జిల్లా పరిధిలో ఈ గ్రామం కనిపిస్తుంది. శ్రీవల్లీ దేవసేనలతో కలిసి స్వామివారు ఇక్కడ ఆవిర్భ వించారు. ఇక్కడ స్వామివారు ప్రత్యక్షంగా ఉన్నారనీ .. ఆయన మహిమాన్వితుడని భక్తులు విశ్వసిస్తుంటారు. ఈ క్షేత్రంలో అడుగుపెట్టడంతోనే సర్ప దోషాలు తొలగిపోతాయని చెబుతారు. స్వామివారి దర్శనంతో కుజ దోషాలు తొలగిపోతా యని అంటారు. సంతానం లేక బాధపడేవారు, స్వామివారి ధ్వజా రోహణం రోజున ప్రత్యేక ప్రసాదాన్ని స్వీకరిస్తుంటారు. ఆయన అనుగ్రహంతో ఎంతోమంది సంతానాన్ని పొందినట్టుగా చెబుతారు. మొండి వ్యాధులతో బాధపడేవారు స్వామివారికి అనునిత్యం ప్రదక్షిణలు చేయడం వలన, ఆ వ్యాధుల నుంచి బయటపడతారని భక్తులు అనుభవపూర్వకంగా చెబుతుంటారు. స్వామివారి అనుగ్రహంతో ఆపదలు, అనారోగ్యాలు తొలగిపోతాయనీ, సకల శుభాలు చేకూరతాయని విశ్వసిస్తుంటారు. ◻

# పల్లీ పకోడి



**తయారీ విధానం:** ఒక గిన్నెలో పల్లీలు, బియ్యపు పిండి, శనగ పిండి, కారం, చాట్ మసాలా, గరం మసాలా, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. కొద్దికొద్దిగా నీళ్ల చల్లుకుని పల్లీలకు పిండి బాగా పట్టేలా గట్టిగానే కలుపుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి, వేయించడానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక పిండితో ఉన్న పల్లీలను విడివిడిగా వేస్తూ దోరగా కాల్చుకుంటే కరకరలాడే పల్లీల పకోడి సిద్ధం.

**తయారీ విధానం:** ఒక గిన్నెలో పల్లీలు, బియ్యపు పిండి, శనగ పిండి, కారం, చాట్ మసాలా, గరం మసాలా, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. కొద్దికొద్దిగా నీళ్ల చల్లుకుని పల్లీలకు పిండి బాగా పట్టేలా గట్టిగానే కలుపుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి, వేయించడానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక పిండితో ఉన్న పల్లీలను విడివిడిగా వేస్తూ దోరగా కాల్చుకుంటే కరకరలాడే పల్లీల పకోడి సిద్ధం. ◻

# తెర

## 'అగధ' మంచి విజయం సాధిస్తుంది: ఎం.ఎస్.రాజు



**'అగధ' అంటే ఏంటి?..**
'అగధ' అని టైటిల్ పెట్టగానే చాలా మంది నెట్‌లో సర్చ్ చేశారు. అగధ అంటే లోతైన అంశం, ఓ శూన్యం అని చెప్పుకోవచ్చు. మనం దేవుడ్ని, దెయ్యాలను కంటితో చూడలేదు. అలాంటి ఫోర్స్‌లకు మధ్య జరిగే కథ అగధ.

**'అగధ' కోసం మీరు చేసిన రీసెర్చ్ గురించి చెప్పండి?..**
'అగధ కోసం చాలా రీసెర్చ్ చేశాను. చాలా చోట్ల తిరిగాను. అవన్నీ కూడా ఆడియెన్స్‌కి అవసరం లేదు. ఇదొక ఆర్ట్ ఫిల్మ్‌లా కాకుండా అందరినీ రంజింపజేసేలా రూపొందించాను. నేను చూసిన రియాల్టీకి నా ఫ్యాంటసీని జోడించి ఓ మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వాలని తీశాను.

**మీరు సడెన్‌గా సినిమాల్ని నిర్మించడం ఆపేశారు.. ఎందుకు?..**
'ఆట', 'మస్కా' మంచి చిత్రాలు. కమర్షియల్‌గా విజయాలు అందుకున్నాను. కానీ నా స్టాండర్డ్‌లో లేవు అని చాలా మంది అన్నారు. ఆ తర్వాత మా అబ్బాయి కెరీర్ మీద కూడా ఫోకస్ పెట్టాను. చాలా ఏళ్ల తర్వాత 'డర్టీ హరి'ని తీశాను. అది నా టేస్ట్‌కి పూర్తి భిన్నంగా ఉంటుంది. నా జర్నీలో ఎప్పుడూ కూడా కొత్త కథలకే ఒకే చెబుతూ వచ్చాను.

**'అగధ' చిత్రం విజయంపై భారీ నమ్మకంతో ఉన్నారు?..** నేను ఇంత వరకు స్టేజ్ మీద అలా ఓపెన్‌గా సినిమా బాగుంది అని స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. కానీ 'అగధ' చూసిన తర్వాత సినిమా బాగుంది, విజయం సాధిస్తుందని నా మనసుకి అనిపించింది.

**'అగధ' వీఎఫ్ఎక్స్ వర్క్ ఎలా ఉంటుంది?..** నేను ప్రతీ ఫ్రేమ్ మీద ఫోకస్ పెడతాను. నాకు క్లారిటీ వస్తే తప్పా ముందుకు వెళ్లను. నేను తీసిన ప్రతీ చిత్రంలో నా ఇన్వాల్వ్‌మెంట్ ఉంటుంది. ప్రతీ క్రాఫ్ట్ గురించి ఆలోచిస్తాను. నేను నిర్మాతగా ఉన్నప్పుడు కూడా దర్శకులతో కథా విషయంలో చర్చించేవాడ్ని. వాళ్లు కూడా నా సలహాలను తీసుకునేవారు.

**'అగధ'డిస్ట్రిబ్యూషన్ గురించి చెప్పండి?..** అగధ'ని ముందు ఎవ్వరికీ ఇవ్వకూడదని అనుకున్నాం. ట్రైలర్ రిలీజ్ అయ్యాక చాలా మంది ఫోన్స్ చేశారు. కన్నడ నుంచి హోంబలే టీం సంప్రదించింది. గీతా ఆర్ట్స్, అన్నపూర్ణ స్టూడియో టీం నుంచి కొంత మంది వచ్చి సినిమాని చూశారు. ముందు ఇక్కడ సినిమాని రిలీజ్ చేసిన తర్వాత మిగతా భాషల్లో విడుదల చేయాలని అనుకుంటున్నాను.

**మీ హీరోలతో మీకున్న రిలేషన్ గురించి చెప్పండి?..** నేను నా ఆర్టిస్టులందరితోనూ మంచి రిలేషన్ మెయింటైన్ చేస్తాను. అగధ టీజర్, ట్రైలర్ చూసి మహేష్ బాబు నాకు వాయిస్ మెసెజ్ చేశారు

## 'విశ్వనాథ్ సన్స్' ప్రీ రిలీజ్ వేడుక

తమిళ అగ్ర కథానాయకుడు సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ సన్స్. ప్రతిభ గల దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. . ఈ చిత్రం భారీ అంచనాల నడుమ ఆగస్టు 14, 2026న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో అడుగు పెట్టనుంది. ఈ వేడుకలో కథానాయ కుడు సూర్య మాట్లాడుతూ.. "ఈ వేడుకకు విచ్చేసిన ఎమ్మెల్యే నవీన్‌కి, మా సినీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ధన్యవాదాలు. అలాగే, రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న నా అభిమానులు, వారి కుటుంబ సభ్యులకు నా నమస్కారం. 28 ఏళ్ళ నుంచి మీరు నాపై ఈ ప్రేమను చూపిస్తున్నారు. మీ వల్లే నేను ఈరోజు ఇలా ఉన్నాను. నాగవంశీ, వెంకీ వల్లే ఇలాంటి మంచి సినిమా సాధ్యమైంది. ఈ సినిమాను మీరు థియేటర్లలో చూసి ఖచ్చితంగా ప్రేమిస్తారని నమ్ముతున్నాను. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "ముందుగా తక్కువ సమయంలో ఈ వేడుక జరగడానికి అనుమతి ఇచ్చిన తెలంగాణ పోలీస్ శాఖకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు. సినీ పరిశ్రమకు అండగా ఉంటుందన్నందుకు, గద్దర్ అవార్డులు ఇచ్చి మమ్మల్ని ప్రోత్సహిస్తున్నం దుకు.. సినీ పరిశ్రమ తరపున తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు. . థియేటర్లో చూసే ప్రేక్షకులకు కూడా ఆ సంతృప్తిని కలిగిస్తుంది. ఇది సూర్య అభిమానుల కోసం మాత్రమే తీసిన సినిమా కాదు, సూర్య అభిమానుల కుటుంబాల కోసం కూడా తీసిన సినిమా. ఈ సినిమా చూస్తున్నంత సేపూ మీ ముఖం మీద చిరునవ్వు ఉంటుంది.



## 'కొరియన్ కనకరాజు' సెలబ్రేషన్స్‌లో చిరంజీవి



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యూవీ క్రియే షన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించాయి. ఆగస్టు 6న జరిగిన ఈ సినిమా ప్రీమియర్స్‌కి అద్భుత మైన రెస్పాన్స్ వచ్చింది. ఆగస్టు 7న వరల్డ్ వైడ్ థియేటర్ల లో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో రన్ అవుతోంది. మెగా బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ: ఒక సినిమా విజయం సాధిస్తే ఎంతోమందిలో ఆనందాన్ని నింపుతుంది. ఎన్నో ఏళ్లుగా నేను ఈ విషయాన్ని చూస్తున్నాను. అది మరోసారి ఇక్కడ పునరావృతం అయింది. ఈ సంతోషంలో పాలుపంచుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. సినిమా చూసిన తర్వాత ఫంక్షన్ ఎప్పుడు పెడతారు, దాని గురించి నాలుగు మాటలు మాట్లాడాలని ఉంది అని అనుకున్నాను. వరుణ్ ఈ వేడుకకు రమ్మని అన్నప్పుడు కచ్చితంగా వస్తానని చెప్పాను. ఇలాంటి విజయాలను సెలబ్రేట్ చేసుకోవాలి. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మాట్లాడుతూ: కొరియన్ కనకరాజు మీ అందరికీ నచ్చి మంచి విజయాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. పెదనాన్న చిన్నప్పటి నుంచి మమ్మల్ని మంచి విలువలు, కష్టపడే తత్వం, క్రమశిక్షణతో పెంచారు. కొరియన్ కనకరాజు విజయం చాలా ఆనందాన్ని ఇచ్చింది, నాగబాబు మాట్లాడుతూ: మేమందరం ఈ స్థితిలో ఉన్నామంటే దానికి కారణం మా అన్నయ్య చిరంజీవి . మా అందరికీ ప్రాణవాయువు మా అన్నయ్య. కొరియన్ కనకరాజు సినిమా విజయం సాధించడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు మేర్లపాక గాంధీ చాలా మంచి విజన్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. నటీనటులు అందరూ చాలా చక్కగా నటించారు. వరుణ్ విషయంలో నేను చాలా గర్వపడుతున్నాను.

## 'సెయాన్' రెండవ షెడ్యూల్ ప్రారంభం



వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' ప్రాజెక్ట్ కోసం దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌తో చేతులు కలిపారు. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న అమరన్ తర్వాత రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో శివకార్తికేయన్ చేస్తున్న చిత్రమిది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ రోజు రెండవ షెడ్యూల్ ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియో లో శివకార్తికేయన్ లుక్ అందరినీ ఆకట్టుకుం టుంది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని భారీ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఎమోషన్స్, మాస్ అప్పీల్, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఎంటర్టైనర్ గా సినిమా రూపొందనుంది. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. వివేక్ విజయకుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, షాన్ లోకేష్ ఎడిటింగ్ చేస్తున్నారు. యాక్షన్ డైరెక్టర్‌గా సుప్రీమ్ సుందర్ పని చేస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అరుణ్ వెంకటరామూడి రూపొందిస్తున్నారు.

## 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' విన్‌లో రిలీజ్



'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' విన్‌లో రిలీజ్ డేట్ పోస్టర్ సెప్టెంబర్ 18 నుంచి ఈవిన్ లో స్ట్రీమింగ్‌హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు. సెప్టెంబర్ 18 నుంచి నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ స్ట్రీమింగ్ కానుంది. ఈ డేట్ లాంచింగ్ పోస్టర్ ఈటివి వీన్‌లో స్టార్ బాయ్ సిద్దుజొన్నల గడ్డ లాంచ్ చేశారు. ఈ చిత్రంలో హైపర్ ఆది, జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, శ్రావ్య చౌదరి, శ్రీ విద్యా, మహేందర్, ప్రేమ్ సాగర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## 'రంభ ఊర్వశి మేనక' నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది



కామెడీ సినిమాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్ మరోసారి తనకు బాగా కలిసొచ్చిన జానర్‌లో సందడి చేయ బోతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ రంభ ఊర్వశి మేనక. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. టీజర్ లాంచ్ ఈవెంట్లో హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ: నేను సరైన కామెడీ సినిమా చేసి దాదాపు 10 సంవత్సరాలు అవుతోంది. నాంది తర్వాత కొన్ని సీరియస్ సినిమాలు చేశాను. కాకపోతే నేను కామెడీని ఎప్పుడూ వదల్లేదు. ఒక మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నాను. చాలా రోజుల తర్వాత చంద్ర మోహన్ గారు వచ్చి ఈ కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ సంస్థలతో కలిసి ఈ సినిమా చేయడం మరింత ఆనందాన్ని ఇచ్చింది. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. నిర్మాతగా నా జర్నీ ప్రసాద్ గారితో కలిసి మొదలైంది. నేను ప్రతి సినిమా కథ విన్న తర్వాత ప్రసాద్ గారిని సంప్రదిస్తాను. అన్నపూర్ణ స్టూడియోస్ 50 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ బ్యానర్‌తో కలిసి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. హీరోయిన్ సురభి మాట్లాడుతూ: ఈ టీజర్ మీకు నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. అల్లరి నరేష్ గారు నా ఫేవరెట్. రాశి సింగ్ మాట్లాడుతూ: నాకు ఇలాంటి మంచి పాత్ర ఇచ్చిన మా డైరెక్టర్ గారికి థాంక్యూ. అల్లరి నరేష్‌కి అద్భుతమైన కామెడీ టైమింగ్ ఉంది.

13vzm15:13vzm15.qxd 12-08-2026 22:28 Page 1



విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## సంక్షేమ పథకాలకే మొదటి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

శృంగవరపుకోట,ఆగస్టు12,ప్రభాతవార్త



రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో కేవలం సంక్షేమ పథకాలకే లక్షలాది కోట్లు ఖర్చుచేస్తున్నామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళయిన సందర్భంగా బుధవారం సీతంపేట వినాయక పల్లిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు.అనంతరం కోళ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రభివృద్ధి జరుగుతుందని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నడుమ మాజీ డీజీఎం పుట్టినరోజు వేడుకలు



మెరకముడిదాం, ఆగస్టు 12 , ప్రభాత వార్త :

మండలంలో చినబంటుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కోట్ల సన్యాసి అప్పలనాయుడు తనయుడు ఎన్.టి.పి.సి. మాజీ డిజిఎం కోట్ల కృష్ణమూర్తి నాయుడు పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. సామాజిక సేవే పరమావధిగా ఆయన పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సింగవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలా విద్యార్థులు నడుమ తన పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా చిన బంటుపల్లి మరియు సింగవరం ఉపాధ్యాయ సిబ్బంది ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేతపై హర్షం

శృంగవరపుకోట,ఆగస్టు12,ప్రభాతవార్త :



రాష్ట్రంలో ప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమానవ వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి మంగళవారం జనసేన పార్టీ ఎంపీలు లింగమనేని రమేష్,తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ వినతిపత్రం అందజేయడం పట్ల ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయడం వలన గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకుమెరుగైన విద్యను అందించేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.కొత్తగా నవోదయ విద్యాలయాలు ఏర్పాటుకై జనసేనపార్టీ ఎంపీలు చేస్తున్న కృషికి ఇంచార్జ్ వబ్బిన అభినందనలు తెలిపారు.

## చిన్నారులకు జ్ఞాన వికాసం పొందే విధంగా బోధించాలి



కురుపాం,ఆగస్టు12,ప్రభాతవార్త :

చిన్నారుల జ్ఞానం వికసించే విధంగా అంగన్వాడి కార్యకర్తలు బోధించే విధంగా కృషి చేయాలని ఎం ఈ ఓ ఎన్ సత్యనారాయణ అన్నారు. గురువారం కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మరింత నాణ్యమైన ప్రాథమిక విద్య,పోషణ,ఆరోగ్యం,రక్షణ సేవలు అందించేందుకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి జి రజనీ దుర్గ మాట్లాడుతూ ఆరు రోజుల నిర్వహించే శిక్షణ కార్యక్రమం లో చిన్నారుల సమగ్ర అభివృద్ధి,ఆటల ద్వారా అభ్యాసం,బోధనా సామగ్రి వినియోగం,పాఠశాల సంసిద్ధత, ఆరోగ్యం–పోషణ,బాలల రక్షణ తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వై రమా లక్ష్మి, ఉపాధ్యాయులు బి బాబురావు ,ముకుంద రావు, సందీప్ శిక్షణా సిబ్బందిగా పాల్గొన్నారు,

## డైట్‌ల్లో ఖాళీ సీట్ల భర్తీకి నేటి నుంచి వెబ్ ఆప్షన్స్



నెల్లిమర్ల, ఆగస్టు 12, ప్రభాతవార్త:

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ( డైట్ సెట్ )లో అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ డి.ఎల్. ఎడ్. కళాశాలలలో మిగిలిన ఖాళీ సీట్ల భర్తీ నిమిత్తం రెండవ దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు.రెండవ దశ కౌన్సెలింగ్ లో భాగంగా అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 13 నుండి 16 వరకు వెబ్ ఆధారిత ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని ఆయన సూచించారు.అభ్యర్థులు నమోదు చేసిన వెబ్ ఆప్షన్ల ఆధారంగా 17 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు సీట్ల కేటాయింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీట్లు కేటాయించబడిన అభ్యర్థులు తమ తాత్కాలిక ప్రవేశ పత్రాలను అధికారిక వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు.సీట్లు కేటాయించబడిన అభ్యర్థులు 21 నుండి 24 వరకు ప్రభుత్వ డైట్ కళాశాలలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించి, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది ప్రవేశ పత్రం పొందాలన్నారు.డి.ఎల్.ఎడ్. మొదటి సంవత్సరం తరగతులు 27 నుండి ప్రారంభమవు తాయని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామకృష్ణారావు సూచించారు.

## ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేద్దాం

రామభద్రపురం, ఆగస్టు 12, ప్రభాత వార్త :



మండలం పాత రేగలో ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని జిల్లా పరిషత ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమణ పిలుపు నిచ్చారు. 80 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా భారత,రాష్ట్ర ప్రభుత్వాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పాతరేగ గ్రామంలో గ్రామంలో విద్యాశాఖ, సచివాలయ పంచాయతీ సెక్రెటరీ జగదీశ్వరరావు తన సిబ్బందిసిబ్బంది ,వైద్య,ఆరోగ్య సిబ్బంది హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.ఇంటిమీద జాతీయజండాలను ఎగురవేయాలని కోరుతూ విద్యార్థులకు జాతీయ జండాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమణమాట్లాడుతుజాతీయ జెండా దేశభక్తిని, జాతీయ స్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. ర్యాలీలో ఉపాధ్యాయ సిబ్బంది , సచివాలయ సిబ్బంద, వైద్య ఆరోగ్య సిబ్బంది విద్యార్థులు, తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ పార్కు, విద్యుత్ సబ్ స్టేషన్ కోసం స్థలపరిశీలన



పార్వతీపురం, ఆగస్టు12, ప్రభాతవార్త:

ఇండస్ట్రియల్ వీ-హావీజు పార్కు ఏర్పాటు లక్ష్యం ఆ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే అని స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. కొంతకాలంగా ఎమ్మెల్యే వీ-హావీజు పార్కు, విద్యుత్ సబ్టేషన్ ఏర్పాటు కోసం స్థలం అన్వేషణ చేస్తున్న విషయం తెలిసింది. ఈ క్రమంలో అధికారులు మండల పరిధిలోని నర్సిపురం గ్రామం వద్ద ప్రభుత్వ స్థలాన్ని గుర్తించడంతో విజయచంద్ర అధికారులతో స్వయంగా వెళ్లి ఆ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లను కలిసి ఈ ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించవచ్చని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, పలు దఫాల చర్చలు అనంతరం ప్రభుత్వ స్థలాన్ని గుర్తించడం జరిగిందని అన్నారు. స్థల విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లనున్నామని త్వరలోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే దిశలో ఈ ప్రాజెక్టును ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు గొట్టాపు వెంకటరమణ, విద్యుత్ అధికారులు, తదితరులు ఉన్నారు.

## దొంగతనం కేసులో ముద్దాయిలు రిమాండ్‌కు తరలింపు

దత్తిరాజేరు, ఆగస్టు 12, ప్రభాత వార్త :




రెండు రోజుల క్రితం బంగారం చైను దొంగతనం కేసులో పట్టుబడిన కేతల దుర్గారావు మల్లెపరం అనసూయ పై పెదమానాపురం పోలీసులు ముద్దాయిలను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం బుధవారం కోర్టుకు పంపించడం జరిగిందని సి ఐ సన్యాసినాయుడు స్థానిక విలేకరులకు తెలిపారు పెదమానాపురం గ్రామానికి చెందిన కేతల కుమారి మెడలో రెండు తులాలు బంగారం చైన్ దొంగలించి పారిపోతుండగాగ్రామస్తుల పట్టుకుని పోలీసులకు తెలియజేయడంతో వెంటనే స్పందించిన పోలీసులు దొంగతనం చేసిన వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేయడం జరిగిందన్నారు వీలది దత్తి రాజేరు మండలం రాజుల రామచంద్రపురం గ్రామానికి చెందిన దుర్గారావు (26) ఎస్సీ మాల కులానికి చెందిన వ్యక్తి విశాఖ జిల్లా శివశక్తి నగర్ కొమ్మాదిలో నివాసం ఉంటున్నాడు ఆమెశ్రీకాకుళం జిల్లా మోలియా పుట్టి మండలం వసుంధర గ్రామానికి చెందిన అనసూయ (27) ఎస్సీ పైడి కులానికి చెందిన వ్యక్తిని పోలీసులు తెలిపారు ముద్దాయిలు ఇద్దరు పై కేసు నమోదు చేసి రిమాండ్ కోర్టుకు తరలించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సై కళాధర్ పోలీసులు అప్పన్న మహిళా పోలీసు పాల్గొన్నారు

## మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయింపు

కొత్తవలస, ఆగస్టు 12, ( ప్రభాత వార్త) :



ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించినట్లు కొత్తవలస మండల పరిషత్ అధ్యక్షురాలు ఎన్.గోపమ్మ తెలిపారు. కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం ఆరోగ్య కేంద్రంలో జరిగినది. సమావేశానికి కమిటీ చైర్మన్, మండల పరిషత్ అధ్యక్షులు నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన జరిగినది. 2026. 27 సంవత్సరానికి హెచ్డి స్ నిధుల కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్తవలసకి 1,75,000 నిధులు కేటాయించడంది. దీనికిగాను ఆసుపత్రిలో మౌలిక వసతులు, రోగులకు ఉత్తమమైన సేవలు అందుటకు గాను పరికరములు, మరియు రాత్రి కాపలాదారునకు జీతములు తదితర అవసాలపై తీర్మానము చేసి ఆమోదించటం. ఈ కమిటీకి సభ్యులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్. రమణయ్య, డిప్యూటీ తాసిల్దార్ హేమంత్, వైద్యాధికారులు డాక్టర్ శీతల వర్మ, సీత లక్ష్మి పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షురాలుగా కొత్త భవనం నిర్మాణం కొరకు నా వంతు సహాయ సహకార అందిస్తానని శాసనసభ్యురాలు శ్రీమతి కోళ్ల లలితకుమారి ద్వారా భవననిర్మాణము త్వరిత గతిగా పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందటానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు పంటల బీమా చేయించుకోవాలి



కొమరాడ, ఆగస్టు 12, ప్రభాత వార్త:

రైతులు పంటల బీమా పథకం నమోదు చేసుకోవాలని గుంటూరు వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయం సంయుక్త సంచాలకులు పి హరిబాబు చౌదరి కోరారు. బుధవారం గుణనపురం గ్రామంలో ఎల్లోనో ప్రభావం పై రైతుల తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ నెల 15లోగా పంటలు బీమా నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు వర్షపావ పరిస్థితులు ఎదురైనా ఎడల ప్రత్యామ్నాయక్ పంటలే మేలని సూచించారు 80% రాయితీపై డ్రోన్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోపంచుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కొమరాడ మండల వ్యవసాయ శాఖ ఏవో ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం

సాలూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త :



సాలూరు మండల కోదుకరఖ వలసలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఇంటింటికి తెలుగుదేశం అభివృద్ధి సంక్షేమ విజయాలు కార్యక్రమం నిర్వహించగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. బుధవారం ఆ గ్రామానికి చెరుకున్న మంత్రికి గిరిజన మహిళలు మంగళ హారతులు పట్టగా టీడీపీ శ్రేణులు ఘనంగా ఆహ్వానించారు.అలాగే ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని సంధ్యారాణి కరపత్రాలు గ్రామ ప్రజలకు అందజేసి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతు రాష్ట్రప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అలాగే పారదర్శక పాలనతో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తుందని క్లారిటీ ఇచ్చారు. అంతేకాకుండా రైతులు, మహిళలు,యువత,విద్యార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను విజయ వంతంగా అమలు చేస్తున్నా మని మంత్రి స్పష్టం చేసారు. టీడీపీ మండల ప్రెసిడెంట్ పరమేష్,మాజీ ఎంపీటీసీ రమాదేవి,యుగంధర్,శ్యామ్ , తదితరులు పాల్గొన్నారు.

## డిస్ట్రిక్ట్ సెన్సెస్ హ్యాండ్ బుక్ తయారు చేయడంలో శిక్షణ



రామభద్రపురం, ఆగస్టు 12,ప్రభాత వార్త:

మండలం కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో రామభద్ర పురం, మెంటాడ, తెర్లాం మండలాల ఎన్యూమరేటర్స్‌కి డిస్ట్రిక్ట్ సెన్సెస్ హ్యాండ్ బుక్ తయారు చేయడంలో అందరు ఎన్యూమరేటర్స్‌కి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది ఈ ట్రైనింగ్ లో జాయింట్ డైరెక్టర్ సెన్సెస్ చంద్రకళ మాస్టర్ ట్రైనర్ సూర్య వర్ధన్ , తహసీల్దార్ అజూరఫీ జాన్ ఏ ఎస్ వో సన్యాసి రావు పాల్గొనడం జరిగింది.

## గరివిడిలో ఘనంగా గ్రంథాలయ పితామహుని జయంతి

గరివిడి, ఆగస్టు 12, ప్రభాత వార్త:



గ్రంథాలయ పితామహుడు డాక్టర్ సియాలి రామమృత రంగనాథన్ జయంతి వేడుకలు బుధవారం స్థానిక గ్రంథాలయాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయం లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గరివిడి శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షులు వివిఎస్ఎస్ఎన్ గుప్తా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1892లో జన్మించిన రంగనాథన్ లైబ్రరీ సైన్స్ రంగంలో పరివర్తన చెందిన వ్యక్తి అని గణిత శాస్త్రజ్ఞుడు దూరదృష్టి కలవాడు అని కొనియాడారు. లైబ్రరీ సైన్సుకు అద్భుతమైన రచనలు అందించిన ఆయనకు దేశంలో లైబ్రరీ సైన్స్ పితామహుడు అని బిరుదు పురస్కార గ్రహీత అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఉషారాణి,సత్యనారాయణ గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మక్కువ ,ఆగస్టు 12, ప్రభాతవార్త:

మక్కువ మండల కేంద్రంలో ఎగువ కూరాకుల వీధికి చెందిన బలగ శ్రీను భార్య గౌరమ్మ ఎగువ కురాకల వీధిలో నివసిస్తున్న వారు అనారోగ్యానికి గురయ్యారు. వైద్యం నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రిలో సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు ఖర్చు అయ్యిందని అయినప్పటికీ వారి ఆరోగ్య పరిస్థితిని, వారి ఆర్థిక పరిస్థితిని గమనించిన స్థానిక టిడిపి నాయకులు దాసరి కేశవరావు మండల తెలుగుదేశం అధ్యక్షులు గుల్ల వేణుగోపాల నాయుడు దృష్టిలో పెట్టారు. మండల అధ్యక్షుని చొరవతో రాష్ట్ర గిరిజన మరియు స్రి శిసు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రత్యేక దృష్టి సారించి వారికి 99,100 రూపాయల సీఎం ఎఫ్ చెక్కును వారికి మంత్రి అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమకు ఆర్థిక సాయం అందించిన మంత్రికి దంపతులిద్దరూ ధన్యవాదాలు తెలిపారు.

## వరి, మొక్కజొన్న పంటల బీమాకు మరో ఐదు రోజులు గడువు

### మండల వ్యవసాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్స్న

గరుగుబిల్లి, ఆగస్టు 12, ప్రభాత వార్త:



ఖరీఫ్ -2026సీజన్‌కు సంబంధించి పంటల బీమా నమోదు గడువును రైతులు సద్వినియోగం చేసుకుని తప్పని సరిగా బీమా చేయించు కోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్స్న సూచించారు. మండల కేంద్రం లోని వ్యవ సాయ శాఖ కార్యాలయంలో బుధవారం స్థానిక విలేకరులతో మండల వ్యవ సాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్స్న మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల పంటలకు కలిగే నష్టాల నుంచి రైతులను ఆర్థికంగా రక్షించేందుకు ప్రభుత్వం పంటల బీమా పథకాలను అమలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్బివై) కింద వరి, మొక్కజొన్న పంటలకు, రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూ రెన్స్ స్కీమ్ కింద ప్రత్తి, అరటి పంటలకు బీమా నమోదు కొనసాగుతోందని మండల వ్యవసాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్స్న వెల్లడించారు. వరి మరియు మొక్కజొన్నకు పంటకు ఆగస్టు 15 వరకు పంటల బీమా నమోదు చేసు కునే అవకాశం ఉందన్నారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు తమ రుణ ఖాతా ఉన్న బ్యాంకుల్లోనే బీమా నమోదు చేయిం చుకోవాలని, రుణం లేని రైతులు సమీప కామన్ సర్వీస్ సెంటర్ (సిఎస్‌సి) ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు. రైతులు చివరి తేదీల వరకు వేచి ఉండకుండా ముందుగానే బీమా నమోదు పూర్తి చేసుకోవాలని, సందేహాలుంటే వ్యవసాయ శాఖ అధికారులు లేదా రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రైతులకు సూచించారు.

## స్థానిక ఎన్నికల్లో 100 శాతం విజయం సాధించాలి



దత్తిరాజేరు, ఆగస్టు 12, ప్రభాతవార్త :

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు 100శాతం విజయంసాధించాలని మండల టిడిపి అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ పార్టీ కార్యకర్తలకు సూచించారు బుధవారం దత్తి రాజేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తలకు ఎటువంటివిభేదాలు లేవన్నారు. అందరూ పార్టీకి కలిసి పనిచేయాలన్నారు అప్పుడే విజయం సాధిస్తామని కార్యకర్తలకు సూచించారు. ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమాన్నిపక్కాగా నిర్వహించాలన్నారు తెలుగుదేశం పార్టీకి గ్రామాల్లోప్రజలు మంచి ఆదరణ చూపిస్తున్నారని వారికి అండగా కార్యకర్తలు పనిచేయాలన్నారు తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మన మండలానికి చేసిన అభివృద్ధి ని ప్రజలకు తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మిత్తిరెడ్డి రామ బోడసింగి సత్యనారాయణ బండి కృష్ణ గౌరు నాయుడు నారాయణ మూర్తి రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాత బొబ్బిలిలో చౌడేశ్వరి అమ్మవారి విశేష పూజలు

బొబ్బిలి, ఆగస్టు 12, ప్రభాతవార్త:



పాత బొబ్బిలిలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారికి బుధవారం గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో భక్తులు మేళతాళాలతో వెంట వెళ్లారు. ఉదయం నుంచి విశేషంగా పూజలు చేసి సాయంత్రం అమ్మవారిని పాత కార్యక్రమం అంతా స్థానికంగా దాసరి రాజు కుటుంబం పుచ్చల రాజు బత్తుల సత్యనారాయణ మొదలగు కుటుంబాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అంతా గ్రామ పెద్ద చోడిగంజి రమేష్ నాయుడు పర్యవేక్షణలో జరిగింది.

## పాచిపెంటలో జాతీయ సమైక్యత ర్యాలీ



పాచిపెంట, ఆగస్టు 12, ప్రభాతవార్త :

మండల కేంద్రమైన పాచిపెంటలో జాతీయ సమైక్యత ర్యాలీ బుధవారం నిర్వహించారు. ర్యాలీను ఉన్నత పాఠశాల నుండి అంబేద్కర్ భవనం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు ఏడుకొండలు మాట్లాడుతూ వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తి హర్గర్ తరంగ్ ఈనెల 13 నుండి 17 వరకు జాతీయ పతాకాన్ని ప్రతి ఇంటిపైన ఆవిష్కరించి జాతీయ సమైక్యతను ప్రపంచానికి చాటి చెప్పాలని భారత ప్రభుత్వం పిలుపునిచ్చిందనీ ఆయన అన్నారు. ఈ సందర్భంగా తొలత ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ గల గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. పాచిపెంట ఎంపీటీ సభ్యులు పల్లెడ ఉమామహేశ్వరరావు, ఏఎంసి డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు, వాణిజ్య మండలి అధ్యక్షులు నడిపల్లి మెహర్ బాబా, జూనియర్ కళాశాల తెలుగు ఉపన్యాసకులు ప్రశాంత్ , కళాశాల విద్యార్థులు ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల అభివృద్ధి జనాభా లెక్కల వివరాలపై శిక్షణ

దత్తిరాజేరు, ఆగస్టు 12, ప్రభాతవార్త :



గ్రామపంచాయతీ అభివృద్ధి మరియు జనాభా లెక్కలు వివరాలు సేకరణ పై శిక్షణ ఇవ్వడం జరిగిందని ఏఎస్ఓ జగన్నాథం అన్నారు పంచాయతీ కార్యదర్శులకు వీఆర్వోలు వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు యానిమల్ హస్బెండ్ అసిస్టెంట్లకు గ్రామ సంరక్షణ కార్యదర్శిలు కు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి తాసిల్దార్ హరికిరణ్ పాల్గొన్నారు కార్యక్రమాన్ని ఉద్దేశించి తాసిల్దార్ మాట్లాడుతూ గ్రామం యొక్క జనాభా భూ వినియోగం వర్షపాతం నీటిపారుదల వనరులు పండించే ప్రధాన పంటలు పశు సంపద త్రాగునీటి వనరులు సామాజిక సంస్థలు నీటి పరివాహక ప్రాంత పథకాలు భూగర్భ జల పునరుత్పత్తి నిర్మాణాలు, సాంప్రదాయ పరిరక్షణ పద్ధతులపై సమాచారం ఉంటుంది గ్రామం యొక్క జనాభా వ్యవసాయము సహజవాద మరియు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు వివరించడానికి ఈ ప్రొఫైల్ అంశాలను కవర్ చేయాలన్నారు విద్య వైద్య కమ్యూనికేషన్ బ్యాంకులో విద్యుత్ వంటి అంశాలు పై క్షుణ్ణంగా వివరాలు సేకరించాలని తెలియజేశారు. 1951 నుండి ప్రతి జనగణన తర్వాత దేశంలో ప్రతి జిల్లాకు విడివిడిగా ఈ పుస్తకాన్ని ప్రసరిస్తున్నారని తెలిపారు.

## ఘనంగా డాక్టర్ అనూష జన్మదిన వేడుకలు



గరివిడి, ఆగస్టు 12, ప్రభాత వార్త:

గరివిడిలో చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా యువనేత్రి డాక్టర్ బొత్స అనూష జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. భారీ ర్యాలీ అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు,వైద్య పరమైన కిట్లు పంపిణీ చేశారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. బొత్స క్యాంపు కార్యాలయంలో రక్త దాన శిభిరాన్ని ఏర్పాటు చేశారు. వైకాపా అభిమానులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. పెక్కు సంఖ్యలో ప్రజలు పాల్గొని అనూషకు శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. అనంతరం జరిగిన సభలో మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ సత్తిబాబు ని ఆదరించినట్లే అనూషని అక్కున చేర్చుకోవాలని ప్రజలకు కోరారు. బొత్స కుటుంబానికి చీపురుపల్లి ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారని ఆమె అన్నారు.తొలుత గజమాలతో స్వాగతం పలికారు..నియోజకవర్గ వైకాపా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన మాజీ కౌన్సిలర్ నల్లి కృష్ణవేణి

నెల్లిమర్ల, ఆగస్టు 12, ప్రభాతవార్త



వైసిపి అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి లోని ఆయన నివాసంలో నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపు పేటకు చెందిన వైసీపీ నాయకురాలు, 18వ వార్డు మాజీ కౌన్సిలర్ నల్లి కృష్ణవేణి, ఆమె కుమార్తె నల్లి దివ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్సీ డాక్టర్ పి. వి.వి సూర్యనారాయణ రాజు ( సురేష్ బాబు) జగన్మోహన్ రెడ్డికి పరిచయం చేశారు. గ్రామంలో పార్టీ ప్రతిష్టకు కృష్ణవేణి కృషి చేస్తున్నారని జగన్కు వివరించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి కృష్ణవేణిని, ఆమె కుమార్తె దివ్యను ఆశీర్వదించారు. పార్టీ ప్రతిష్టకు కృషి చేస్తున్నందుకు అభినందించారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్సీ

శృంగవరపుకోట,ఆగస్టు12,ప్రభాతవార్త :

మండలంలోని ముషిడిపల్లిలో ప్రభుత్వ భూములు,చెరువులు ఆక్రమణలపై రెవెన్యూ యంత్రాంగంవెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆక్రమణలు నిజమేనని భావించాల్సి వస్తుందని ఎమ్మెల్సీ రఘురాజు తెలిపారు.బుధవారం ముసిడిపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. స్వప్నలోక్ లేఅవుట్ భూవివాదంపై ఆయన స్థానిక సిబ్బందిని ఆరా తీశారు.

## కురుపాంలో ఘనంగా 'హర్‌ఘర్ తిరంగా' వేడుకలు




కురుపాం, ఆగస్టు12, ప్రభాతవార్త :

కురుపాం మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. దేశభక్తి భావాన్ని చాటుతూ స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు , ప్రజలు ఈ వినూత్న ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు నడుకూరు దూలికేశ్వరరావు మాట్లాడుతూ.. మన జాతీయ జెండా భారతీయుల ఆత్మగౌరవానికి, సార్వభౌమాధికారానికి ప్రతీక అని కొనియాడారు. .ఈ కార్యక్రమంలో కురుపాంలో జాతీయ జెండాలను చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు. '.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు గెంబలి ప్రదీప్ కుమార్, బీజేపీ నాయకులు బోటు అనిల్ కుమార్, పలువురు బీజేపీ కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు స్థానికలు పాల్గొన్నారు.




13-08pg10exHMNWJQE.qxd OK OK:13-08pg10exHMNWJQE.qxd 1/1/02 6:33 AM Page 1






# సింక్యూఫీల్డ్ కప్‌లో.. సిందరోవ్‌పై ప్రజ్ఞా విజయం



**న్యూఢిల్లీ:** సింక్యూఫీల్డ్ కప్‌లో జవోఖిర్ సిందరోవ్‌పై ప్రజ్ఞానంద గెలుపు సాధించాడు. గ్రాండ్ చెస్ టూర్‌లోని చివరి ఈవెంట్ అయిన సింక్ఫీల్డ్ కప్ రెండవ రౌండ్ మ్యాచ్‌లో బుధవారం భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద జవోఖిర్ సిందరోవ్ రక్షణను ఛేదించి తన మొదటి విజయాన్ని నమోదు చేసుకున్నాడు. క్వీన్ పాన్ ఓపెనింగ్ నుండి మొదలైన ఎండ్‌గేమ్‌లో, ప్రజ్ఞా అంగుళం అంగుళం చొప్పున తన పాయింట్‌ను కైవసం చేసుకుని, ఆట మొత్తానికి హీరోగా నిలిచాడు. సంపూర్ణ డ్రాగా ముగిసిపోవాల్సిన ఒక సమానమైన ఎండ్‌గేమ్‌ను సిందరోవ్ ఎంచుకున్నాడు.

కానీ ప్రజ్ఞానంద పట్టుదల. కంప్యూటర్ డ్రాగా భావిస్తున్న ఆట క్షణాల్లోనే విజయ దశకు చేరుకున్నాడు. ఈ ఆట ఏకంగా 95 ఎత్తుల పాటు సాగింది. ప్రజ్ఞానంద తన రెండు ఆటలలో 1.5 పాయింట్లు సాధించగా, రాత్రికి అగ్రస్థానంలో ఉన్న అమెరికాకు చెందిన ఫాబియానో కరువానా మాత్రమే హాలండ్‌కు చెందిన అనీష్ గిరితో డ్రాతో ప్రశాంతంగా ముగించాడు. ఆ డచ్ ఆటగాడు ఆరంభంలో చేసే లోతైన సన్నాహాలకు ప్రసిద్ధి చెందాడు మరియు అతను తన అభిమానులను నిరాశపరచలేదు, కానీ కరువానా తన నల్ల పావుతో బాగా సన్నద్ధమయ్యాడు. మొదటి రౌండ్‌లో కేవలం ఒకే నిర్ణయాత్మక ఫలితం వెలువడగా, రెండవ రౌండ్‌లో నాలుగు నిర్ణయాత్మక ఫలితాలతో సమీకరణం మారింది. ఈ రౌండ్లలో అమెరికాకు చెందిన లెవాన్ అరోనియన్ తన ప్రతిభను ప్రదర్శించి జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను ఓడించగా, అమెరికాకు చెందిన వెస్లీ సో హాలండ్‌కు చెందిన జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌పై తన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాడు.



## శ్రీలంక సిరీస్‌కు.. టీమిండియా కఠిన శిక్షణ

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్ గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నద్ధం అవుతోంది. ఈనెల 4న కొలంబోలో అడుగుపెట్టడం మొదలు అక్కడి నాన్‌డెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) మైదానంలో వరుసగా ఎలాంటి విరామం లేకుండా చెమటలు చిందిస్తోంది. ఇందులో మూడు రోజుల పాటు సాగిన పూర్తి స్థాయి వామప్ మ్యాచ్‌తో పాటు, మిగిలిన రోజుల్లో రోజుకు ఐదు నుంచి ఆరు గంటల పాటు సాగిన కఠిన నెట్ సెషన్లు ఉన్నాయి. ప్రధానంగా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే శ్రీలంకతో జరిగే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం తప్పనిసరి అయింది. అంతేకాకుండా శ్రీలంకపై 18 ఏండ్ల నుంచి ఒక్క టెస్టు సిరీస్ కోల్పోని రికార్డు భారత్‌కు ఉంది. ఈ నేపథ్యంలో లంక సిరీస్‌ను టీమిండియా యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సి వచ్చింది. ఈనెల 15న మొదలయ్యే సిరీస్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ఏ చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా పక్కా ప్రణాళికతో ఆటగాళ్లను సిద్ధం చేస్తోంది. ప్రస్తుత జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే లంకలో టెస్టు మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. మిగిలిన ఆటగాళ్లందరికీ ఇక్కడి పరిస్థితులు కొత్త. అందుకే లంకలో అడుగుపెట్టిన 24 గంటల్లోనే మైదానంలోకి దిగిన జట్టు ఇక్కడి విపరీతమైన వేడి, తీవ్రమైన తేమతో కూడిన వాతావరణానికి ఆటగాళ్లు అలవాటుపడేలా హెడ్ కోచ్ గంభీర్ ప్రాక్టీస్ సెషన్స్‌ను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తిరిగి 2 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా విభజించాడు. లంక ఎలెవన్‌తో జరిగిన వామప్ మ్యాచ్ సమయంలోనూ ఫీల్డింగ్ చేస్తున్న ఆటగాళ్లను మారుస్తూ, ఒకవైపు మ్యాచ్ ఆడుతూనే మరోవైపు సమాంతరంగా నెట్స్ ప్రాక్టీస్ చేయిస్తున్నాడు.

## కామన్వెల్త్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారతకు 3 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో భారత ఫెన్సింగ్ జట్టు వివిధ సీనియర్ వ్యక్తిగత ఈవెంట్లలో ఒక్క రోజునే 3 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. నైజీరియాలోని లాగోస్‌లో జరుగుతున్న ఈ ఈవెంట్లలో సీనియర్ మహిళల ఫోయిల్, సీనియర్ పురుషుల ఈపీ, మరియు సీనియర్ పురుషుల సాబ్రే విభాగాలలో టీమ్ ఇండియా ఆధిపత్యం చెలాయించింది. సీనియర్ మహిళల ఫాయిల్ విభాగంలో భారత్ ఆధిపత్యాన్ని నెలకొల్పి, స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకుంది. కచ్చితమైన, నియంత్రిత ప్రదర్శనతో కనగలక్ష్మి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, ఆమె సహచరి జాయిస్ అషిత రజత పతకాన్ని గెలుచుకుంది.



తద్వారా కాంస్య పతకం గెలుచుకున్న ఇంగ్లాండ్‌కు చెందిన జార్జియా గ్రీన్, ఎమిలీ గుడ్‌చైల్డ్‌ల కంటే ముందుగా వీరు పోడియంపై మొదటి రెండు స్థానాలను దక్కించుకున్నారు. సీనియర్ పురుషుల ఈపీ విభాగంలో కూడా విజయం కొనసాగింది, ఇక్కడ రాజేంద్రన్ శాంతిమోల్ షేర్జిన్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి భారతదేశానికి ఆ రోజు రెండవ స్వర్ణ పతకాన్ని సాధించిపెట్టాడు. సీనియర్ పురుషుల సాబ్రే ఈవెంట్‌లో, రజత పతకం సాధించిన ఆస్ట్రేలియాకు చెందిన షిమ్ యోంగితో జరిగిన ఫైనల్ పోరులో అద్భుతమైన ప్రదర్శనతో సింగ్ కరణ్ సింగ్ భారతదేశానికి మూడవ స్వర్ణ పతకాన్ని అందించాడు. జట్టు సభ్యురాలు కుమారేసన్ పద్మ గిషో నిధి, నైజీరియాకు చెందిన అకిన్యోసోయే ఒలువాఫోలాయెమితో కలిసి కాంస్యం గెలిచి పతకాల సంఖ్యను పెంచింది.



# బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్

### అఫ్ఘాన్‌తో భారత్ టీ20 సిరీస్ ఖరారు

### సెప్టెంబరు 13న తొలి మ్యాచ్

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ)కి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) బిగ్ షాకిచ్చింది. సెప్టెంబర్‌లో తమతో సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా వస్తుందని ఆశించిన బీసీబీకి నిరాశే ఎదురైంది. అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఖరారు చేసి బంగ్లా పర్యటనకు వెళ్లడం లేదని భారత్ క్రికెట్ బోర్డు పరోక్షంగా వెల్లడించింది. సెప్టెంబర్‌లో అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు టీ20ల సిరీస్ షెడ్యూల్‌ను బుధవారం బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. అఫ్గాన్ క్రికెట్ బోర్డు వెల్లడించినట్లుగానే ఢిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ జరగనుంది. భారత్‌లోనే అఫ్గాన్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఢిల్లీ మైదానాన్ని అఫ్గాన్ హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుంది. గత జూన్‌లో భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్ట్, మూడు వన్డేల సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే. భారత్, అఫ్గానిస్థాన్ మధ్య సెప్టెంబర్ 13న తొలి టీ20, 15 రెండో టీ20, 19న మూడో టీ20 జరగనుంది. ఈ సిరీస్ భారత్, ఆఫ్ఘనిస్తాన్‌ల మధ్య జరగనున్న రెండవ ద్వైపాక్షి క టీ20ఐ మాత్రమే. ఈ రెండు జట్లు చివరిసారిగా జనవరి 2024లో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడ్డాయి. అప్పుడు భారత్, మొహాలీ, ఇండోర్, బెంగళూరులలో ఆఫ్ఘనిస్తాన్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఆ సిరీస్‌ను భారత్ గెలుచుకుంది. ఇక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో కష్టకాలం ఎదుర్కొంటున్న భారత టీ20 జట్టుకు, రాబోయే ఈ పోటీ ఒక కీలక దశలో వస్తోంది. ఇటీవలి పరంపరను ఐర్లాండ్‌తో 2-0 సిరీస్ ఓటమితో ప్రారంభించిన భారత్, ఆ తర్వాతి సిరీస్‌లో ఇంగ్లండ్ చేతిలో 4-0 తేడాతో ఓటమి చవిచూసింది. కాగా భారత క్రికెట్ బోర్డు ఎప్పుడూ అఫ్గానిస్థాన్‌కు అండగా ఉంటుందని బీసీసీఐ ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్ తెలిపారు. అఫ్గాన్ క్రికెట్ అభివృద్ధి కోసం మద్దతు ఇస్తామని, అత్యున్నత స్థాయిలో పోటీ పడేలా వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పాడు. ఈ క్రమంలోనే ఆ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌ను ఏర్పాటు చేశామని, టాప్ టీమ్స్‌తో ఆడటం వల్ల వెలకట్టలేని అనుభవం వస్తుందని అభిప్రాయపడ్డాడు. భారత్ వేదికగా అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యం ఇస్తున్న సిరీస్‌కు బీసీసీఐ అండగా ఉంటుందని సెక్రటరీ దేవజిత్ సైకియా అన్నారు. మైదానంలో ఇరు జట్ల మధ్య పోరు చాలా ఆసక్తికరమని, నాణ్యమైన క్రికెటర్లు ఉన్నారని పేర్కొన్నారు. భారత్‌లోనూ అఫ్గాన్ ఆటగాళ్లకు అభిమానులు ఉన్నారంటే వారి ఆటతీరే కారణమని, ఇటీవల ఒక టెస్ట్, వన్డే సిరీస్ జరిగిందని, మూడు ఫార్మాట్లలోనూ ఇరు జట్లు తలపడేందుకు ఉన్న అవకాశాలను ఏ మాత్రం వదులుకోమని స్పష్టం చేశారు.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.